ఆంధ్రప్రభ

Estd. 1938

www.prabhanews.com Journalism first!



సంపుటి:56 • సంచిక: 336 •ఆదివారం 18 మార్చి 2018 •హైదరాబాద్ * పేజీలు:12+4 •వెల: 6.00• Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

నాటి విభజన హామీలకు కట్టుబడి ఉన్నాం

మేమొస్తే అమలు చేస్తాం

ప్రత్యేక హోదా ఏపీకి కల్పిస్తాం

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్యాయం చేస్తోంది

ప్లీనరీలో కాంగ్రెస్ రాజకీయ తీర్మానం

కలిసొచ్చే పార్టీలతో పనిచేస్తాం

కాంగ్రెస్ ఉనికి లేకుండా చేయాలని మోడీ తపన


ఎన్డీయే సర్కార్ అవినీతిని ఆధారాలతో బయటపెడతాం

యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా

బీజేపీ విద్వేషాలను పెంచితే మేము ప్రేమను పంచుతాం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్

వివరాలు 12లో...


కాంగ్రెస్ 84వ ప్లీనరీలో తల్లి సోనియాను అభినందిస్తున్న తనయుడు రాహుల్

• రాజ్‌భవన్‌లో వైభవంగా ఉగాది వేడుకలు...


శనివారం రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

చలో కోల్‌కతా

కొత్త ఫ్రంట్ కోసం కేసీఆర్ కార్యాచరణ


మమతా బెనర్జీతో భేటీ ఖరారు

తాజా రాజకీయ పరిణామాలపై చర్చించే అవకాశం

ప్రాంతీయ పార్టీలు ఏకతాటిపై తీసుకురావడమే లక్ష్యంగా అడుగులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ రాజకీయాలు వేడెక్కిన నేపథ్యంలో.. టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. తాను జాతీయ రాజకీయ ప్రక్షాళనకు నడుంబిగిస్తానని ప్రకటించిన వెంటనే మొట్టమొదటగా సంఘీభావం తెలిపి అభినందించిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో సోమవారం భేటీకానున్నారు. ఇందుకోసం కోల్‌కతా బయలుదేరి వెళుతున్నారు. ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో వేగంగా మార్పులు వస్తున్న నేపథ్యంలో.. అనుసరించాల్సిన వైఖరిపై మమతాబెనర్జీతో కెసిఆర్ చర్చించనున్నారు. పక్షం రోజుల క్రితం బిజెపి..కాంగ్రెసేతర ఫ్రంట్ దేశ రాజకీయాల్లో తీసుకువస్తానని సంచలన ప్రకటన చేసిన కెసిఆర్ ఇపుడు బిజెపియేతర పార్టీలన్నీ ఏకత్రాటిపైకి వస్తున్న నేపథ్యంలో

3వ పేజీలో...



నేటి ఆంధ్రప్రభతో శ్రీ విళంబినామ సంవత్సర పంచాంగం 2018-19 ప్రత్యేక అనుబంధం ఉచితంగా అందుకోండి



మంత్రి హరీష్ కారులో మంటలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మంత్రి హరీష్‌రావుకు ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనలో ఉన్న హరీష్ కారు ఇంజన్‌లో పొగలు రాగా, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై ఆయనను మరో కారులో పంపించారు. మేడిగడ్డ బ్యారేజీ నుండి ఎల్ అండ్ టి క్యాంపుకు వెళ్లే సమయంలో ఈ సంఘటన జరగ్గా, ఎలాంటి అపాయం జరగకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

రాంమాధవ్‌కు ఏపీ బీజేపీ వ్యవహారాల బాధ్యతలు

టీడీపీ - బీజేపీ సై × సై



ఏపీ పార్టీ నేతలకు అమిత్ షా దిశానిర్దేశం

ఢిల్లీలో అత్యవసర భేటీ

నాయకత్వం మార్పు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగుదేశంపై భారతీయ జనతా పార్టీ సమరానికి సై అంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు ప్రతివ్యూహాలతో సిద్ధమవుతోంది. ఒక్క రాత్రి వ్యవధిలో ప్రత్యర్థిగా మారిన పాత మిత్రపక్షంపై యుద్ధం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వంపై సంధించిన

3వ పేజీలో...

సెంటిమెంట్‌కు డెవలప్‌మెంట్ సమాధానం

ప్రశ్నిస్తాం.. జవాబివ్వండి

రాంమాధవ్ సూటి సవాల్

అవిశ్వాసంపై ఏంచేద్దాం?

పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ చర్చలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ, వైసిపి ప్రతిపాదించిన అవిశ్వాసం విషయంలో ఎలా వ్యవహరించాలన్నదానిపై పార్టీ ముఖ్యులతో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చర్చిసున్నారు. ప్రత్యేకహోదా అంశంపై ఇప్పటికే పార్లమెంట్ సాక్షిగా టిఆర్ఎస్ మద్దతు ప్రకటించగా, తాజా రాజకీయ పరిణామాలపై అందుబాటులో ఉన్న ముఖ్యనేతలతో సిఎం మాట్లాడుతున్నారు. ఆదివారం అందుబాటులో ఉన్న ఎంపీలను ప్రగతిభవన్ రమ్మని కోరినట్లు సమాచారం. ప్రత్యేకహోదా అంశానికి టిఆర్ఎస్ మద్దతునిస్తుందని, అవిశ్వాసానికి మద్దతునివ్వాలా లేదా అన్నఅంశంపై ఇంకా పార్టీ నిర్ణయం తీసుకోలేదని

3వ పేజీలో...

అందరూ మనవైపే

ఓటింగ్ అడగండి!

మూడు పార్టీల మహా కుట్ర బయటపెట్టా

టీడీపీ ఎంపీలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

8లో



ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్ర మాసం, తిథి: శుద్ధ పాడ్యమి సా.6.29 వరకు, అనంతరం విదియ; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.8.05వరకు, అనంతరం రేవతి; అమృతకాలం: మ.3.15 నుండి 4.55 వరకు; వర్జ్యం: ఉ. 6.42 నుండి; దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ.12.00 నుండి 1.30వరకు;

జోరా..!





పాలనలోనూ మహిళలే భేష్!

అన్నిరంగాల్లో స్త్రీల ప్రాధాన్యత పెరగాలి


ఆలోచనావిధానం మారితేనే సాధికారత

మహిళా లీడర్‌షిప్ సమ్మిట్‌లో కవిత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అన్నిరంగాల్లో మహిళల ప్రాధాన్యత పెరగాలని ఎంపీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో శనివారం నల్సార్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిఎంఎస్) ఆధ్వర్యంలో మహిళా లీడర్‌షిప్ సమ్మిట్- 2018 జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన నిజామాబాద్ ఎంపీ కవిత మాట్లాడుతూ మహిళా సాధికారితకు ప్రభుత్వాలు సహకరించాలన్నారు. మహిళలకు నాయకత్వ లక్షణాలు పెంపొందితే సమాజ ఆలోచన విధానంలో మార్పు వస్తుందని, తద్వారా మహిళలకు మేలు జరుగుతుందన్నారు. దక్షిణాసియాలో మహిళలు నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగుతున్నారన్నారు. ఇందిరాగాంధీ మహిళలు పాలనలో రాణించగలరని నిరూపించారన్నారు. తెలంగాణ,

3వ పేజీలో...

చెరువు మింగేసింది




ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృత్యువాత • గుడితండాలో విషాదం

కొండమల్లేపల్లి, ప్రభన్యూస్: ఆడుతూపాడుతూ పాఠశాలకు వెళ్లి వచ్చి అనంత లోకాలకు ఐదుగురు చిన్నారుల ప్రాణాలు నీటిలో కలిసిపోవడంతో ఆ గిరిజన కుటుంబాల్లో విషాధచాయలు అలుముకున్నాయి. నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకుల గ్రామపరిధిలోని గుడితండాకు చెందిన నేనావత్ సాత్విక్(9), నవదీప్(7), శివ(9), సంతోష్(7), రాకేష్(7)లు పెండ్లిపాకుల రిజర్వాయర్ మునిగిపోయారు. నేనావత్ హనుమ, కుమారి దంపతుల ఇద్దరు కుమారులు సాత్విక్, నవదీప్‌లు స్థానిక విజయమేరి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. నేనావత్ ఓంకార్ కుమారులు సంతోష్, రాకేష్ లు గౌతమి పాఠశాలలో చదువుతున్నారు. నేనావత్ సర్దార్ కుమారుడు శివ గౌతమీ పాఠశాలలో చదువుకొని సాయంత్రం తిరిగి తండాకు చేరుకొన్నారు. ఓంకార్ తన గొర్రెలను వ్యవసాయ పొలం వద్ద మేపుతుండగా పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు రాకేష్, సంతోష్‌లతో పాటు మిగిలిన ముగ్గురు వెళ్లారు. ఓంకార్ అక్కడ పిల్లలు కనిపించకపోవడంతో ఐదుగురు విద్యార్థులు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. ఆడుకుంటూ రిజర్వాయర్ వద్దకు వెళ్లడంతో వారిని రక్షించేందుకు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో అందులోనే ప్రాణాలు వదిలారు. ఐదుగురు విద్యార్థులు ఆడుకుంటూ

7వ పేజీలో...





విళంబినామంలో ఉజ్వల భవిష్యత్తు

- తెలుగు ప్రజలకు గవర్నర్ ఉగాది శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శ్రీ విళంబినామ సంవత్సరంలో తెలుగు ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సరం ప్రజలు ఉజ్వల భవిష్యత్తుతో ముందుకు సాగాలని అన్నారు. విళంబినామ సంవత్సరంలో శాంతి, సామరస్యం, సర్వతో ముఖాభివృద్ధి, ఆనందం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఉభయ రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు గవర్నర్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు

శ్రీ విళంబినామ సంవత్సరంలో తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరాలని, వాటితో రాష్ట్రం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగువారి జీవితాల్లో షడ్రుచులు నిండాలి: చంద్రబాబు

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు తెలుగు దేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది తెలుగు ప్రజల జీవితాల్లో షడ్రుచులను సమపాళ్ళలో అందించాలని, ప్రజలకు విజయాలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.

తెలుగు ప్రజల కీర్తి ఇనుమడించాలి : కడియం

ఉగాది పండుగను తెలుగు ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది షడ్రుచుల సంఘమమని, జీవితంలో కూడా ఒడిదుడుకులు ఉంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని గెలవాలని అన్నారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

టిపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తెదేపా తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ, ఏపీ తెదేపా అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు, వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, తెదేపా శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ, తెదేప పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

షడ్రుచుల సమ్మిళితమే జీవితం

- వినూత్నతకు సంకేతం ఉగాది పండుగ
- ప్రకృతిలో వచ్చే నూతనత్వం మనుషుల్లోనూ రావాలి
- మన దేశ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం
- రాజ్‌భవన్ ఉగాది వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- గవర్నర్ తెలుగు ప్రసంగానికి కితాబు


శనివారం రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సన్మానిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పండుగలు, పర్వదినాలు సంయమనం, శాంతి, ఆరోగ్యానికి దోహద పడతాయని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. అన్ని పండుగల్లోకెల్లా ఉగాదికి ప్రత్యేకత ఉందని, ఈ శుభదినం వినూత్నతకు సంకేతమని తెలిపారు. మన దేశంలో భిన్న ప్రాంతాలు, విభిన్న వర్గాలు జరుపుకుంటున్న పండుగలు సాంప్రదాయాలు, సంస్కృతికి చిహ్నమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని కూడా దృఢ పరుస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన నూతన తెలుగు సంవత్సరం ఉగాది పర్వదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒగరు, పులుపు, చేదు, కారం, తీపి తదితర షడ్రుచుల సమ్మిళితమే మానవ జీవితమని అన్నారు. ఉగాది మొదలుకొని చెట్ల ఆకులన్నీ రాలి, కొత్త ఆకులు చిగురించడంతో పాటు మానవాళికి అవసరమైన కాయలు కాయడం, పూతపూయడం లాంటి నూతనత్వం మొదలవుతుందని చెప్పారు. ప్రకృతిలో వచ్చే ఈ వినూత్న మార్పులు మనుషుల్లోనూ రావాలని ఉప రాష్ట్రపతి ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు ప్రకృతి ఆదర్శంగా శాంతి, సంయమనాలతో జీవించాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో తెలుగు పండుగలు దేశానికే ఆదర్శవంతంగా జరుగుతాయని ఆయన స్పష్టంచేశారు. ప్రకృతిని, సంస్కృతిని భావితరాలకు అందించే ప్రయత్నం జరగాలని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఆవిష్కృతమవుతుందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. ఉగాదితో ప్రారంభమయ్యే తెలుగు సంవత్సరాలు ఇప్పుడున్న తరంలో చాలా మందికి తెలియక పోవడం బాధాకరమన్నారు. ఆధునిక విద్యావిధానంలో పండగుల శాస్త్రీయతను మనం మరిచిపోతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులకు సెలవులు ప్రకటించడం ఆనందం కోసం కాదని, కనీసం పండుగల సందర్భంలోనైనా ఆ విశిష్టమైన రోజు ప్రాశస్త్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రకృతితో ముడిపడి ఉన్న ఉగాది పండుగను తెలుగు ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

పండుగలు వారసత్వ సంపద... సంస్కృతులు పాఠ్యాంశంగా మారాలి

మన సంస్కృతులను పరిరక్షించి భావితరాలకు అందజేయాలంటే విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు పాఠ్యాంశంగా రూపుదిద్దుకోవలసిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. మన వారసత్వ సంపదగా వస్తున్న పండుగలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహించుకుంటూ మత సామరస్యానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. కనీసం ఈ సందర్భాల్లోనైనా భారత సంస్కృతి ప్రతిబింబించేవిధంగా సంగీత, నృత్య, జానపద కళావైభవం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వశాఖల్లో నిర్వహించేకార్యకలాపాల్లో తెలుగును తప్పనిసరి చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం హర్షించదగినదని ప్రశంసించారు. ఒకప్పుడు తెలంగాణను ఏలిన నవాబులు ఉర్దూలోనే పరిపాలనను కొనసాగించినందున ఆ భాషకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ప్రత్యేక సందర్భాల్లో తెలుగువారు కలుసుకుంటే చెప్పాల్సింది థ్యాంక్యూ కాదని, ధన్యవాదాలు చెప్పాలన్న విధానం అమల్లోకి రావాలని ఆకాంక్షిం చారు. సంప్రదా యాలను కాపాడు కుంటూ ముందడుగు వేయా ల్సిన ఆవశ్యకత ఉంద న్నారు. గ్రీస్, ఈజిప్టు, రోమన్ సంస్కృ తులు ఆయా దేశాల్లో ఏనాడో కాల గర్భంలో కలిసి పోయా యని, భారతదేశ సం స్కృతి మాత్రం ప్రపంచ దేశాల్లో కోట్లాది మందికి ఆదర్శం గా మారిం దని వెంకయ్య నాయు డు ఈ సం దర్భంగా ప్రకటించారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మన సాంప్రదాయాలు, సంస్కృతులను కాపా డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. సర్వేజనా సుఖినోభవంతు.. నేను కాదు, మనం అన్న భావన అందరిలో పెరగాల న్నారు. విళంబినామ సంవత్సరంలో పండితులు చెబుతున్న ప్రకారం సమృద్ధిగా వర్షాలు కురువాలని కోరుకుంటున్నానని అన్నారు.

సుఖదుఃఖాల సమ్మిళితమే జీవితం

ఆనందాన్ని ఆస్వాదిస్తూ దుఖాన్ని దిగమింగుతూ ఆనందించేదే జీవితమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ రరావు అన్నారు. తెలుగు ప్రజలందరికీ ఈ సందర్భంగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మంచి, చెడు కలిసి ఉన్నదే ఉగాది పచ్చడి అని, జీవితం కూడా అలాగే ముందుకు సాగిపోవాలని ఆకాంక్షించారు. గవర్నర్‌గా నరసింహన్ వచ్చిన తర్వాతే రాజ్‌భవన్‌లో నూతన తెలుగు సంవత్సరం ఉగాది వేడుకలు ప్రారం భమయ్యాయని తెలిపారు. ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తుమ్మల నాగేశ్వ రరావు, తలసాని శ్రీనివాస యాదవ్, నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పుర ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

"మామిడి పువ్వుకు మాట వచ్చింది
కోయిల గొంతుకు కూత వచ్చింది
వేపకొమ్మకు పూత వచ్చింది
పసిడి బెల్లం తోడుతెచ్చింది
గుమ్మానికి పచ్చని తోరణం తెచ్చింది
ఉగాది పండుగ మన ముందుకు వచ్చింది"



ఇది మానవత్వ సంవత్సరం

తెలుగింట సంబుర సౌరభం వర్ధిల్లాలని, తెలుగు రాష్ట్రాలు అభివృద్ధివైపు పయనించాలని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ధర్మసంస్థాపనార్థాయ సంభవా మి యుగేయుగే... ఉగాది నుంచి తెలుగు ప్రజలకు మంచి జరుగు తుందని, భవిష్యత్తులో చూడ బోయేది గోదా కళ్యాణం దశావతార మని ఇతిహా సాలు ఉటంకించారు. విళంబినామ సంవత్సరం ప్రతి ఒక్కరికీ కలిసి రావాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరానికి తాను మానవత్వ సంవత్సరంగా నామకరణం చేస్తున్నానని ప్రకటిం చారు. గవర్నర్ ప్రసంగం తెలుగులోనే కొనసాగించి తెలుగులోనే ముగించడం ఈ వేడుకలకు హాజరైన ప్రముఖు లందరికీ ఆకట్టుకుంది. ఆఖరులో ఉగాది ప్రాశస్త్యా న్ని ప్రతిబిం బించే విధంగా చదివిన కవిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మన మత్స్య సంపద దేశానికే ఆదర్శం

మత్స్యకాన్ఫరెన్స్ ముగింపు సభలో ఆర్థిక మంత్రి ఈటల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఉన్న జలవనరున్నింటినీ పునరుద్ధరించి తద్వారా మత్స్య సంపదను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆలోచన గ్రామీణ సంపదను సృష్టించేవిధంగా చేస్తోందని ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్ తెలిపారు. మత్స్య రంగంపై ఆధారపడిన దాదాపు మూడు లక్షల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో గడిచిన మూడేళ్ళుగా ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిసు న్నామని పేర్కొన్నారు. ఈ సరికొత్త పథకం దేశంలోనే ప్రప్రథమమని స్పష్టంచేశారు. మూడు రోజులపాటు హైటెక్స్‌లో జరిగిన జాతీయ మత్స్య సదస్సు ముగింపు కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌తో కలిసి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతిత్వరలోనే రాష్ట్ర మత్స్య సంపద దేశానికే ఆదర్శ వం తంగా మారనుం దన్నారు. మత్స్య ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందు కు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున కొత్తగా మార్కెట్‌లను నిర్మిం చాల న్న ప్రతిపాదన ఉందన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లా కేంద్రంలో ఆధునిక మార్కెట్లను నిర్మించే ప్రక్రియ కొనసాగుతోందని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా రెండువేల పైచిలుకు రిటైల్ మార్కెట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వచ్చే ఆర్థిక సంవ త్సరంలో ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేసి యువకులకు ఉపాధి కల్పిస్తా మన్నారు. మత్స్య ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే విధంగా మత్స్యకారులు, కార్మిక కుటుంబాలను ప్రోత్సహించి అత్యధిక లాభాలు పొందేవిధంగా చేస్తామన్నారు.

కేంద్రం సాయాన్ని ప్రజలకు వివరించండి

- ఉద్దేశపూర్వకంగానే తెదేపా బయటకు..
- పీఎంఓలో జెఎస్ స్థాయి అధికారి
- ఏపీ బీజేపీ బాధ్యతలు రాంమాధవ్‌కు
- నేతలకు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా దిశానిర్దేశం



(ఫైల్)

అమరావతి, ఆంధ్రప్రభ: 'రాష్ట్రానికి కేంద్రం చేసిన సాయంపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి. ఇందుకోసం మీడియాను, సామాజిక మాధ్యమా లను విరివిగా వినియోగించుకోండి. రాష్ట్ర సాయా నికి సంబంధించి రాజకీయ పార్టీలు, ప్రజలు కావాల్సిన సమాచారం పొందేందుకు ప్రధాన మంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబం ధించి సంయుక్త కార్యదర్శి స్థాయిలో ఒక అధికారిని నియమిస్తున్నామంటూ' బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్ర నేతలకు దిశా నిర్దేశం చేశారు. నిధులు ఇస్తున్నప్పటికీ తెలుగుదేశం ప్రభుత్వం తనంతట తానే బయటకు వెళ్లిందని చెపుతూ నేతలు ప్రజల్లోకి వెళ్లి అన్ని వివరాలు వెల్లడించాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్‌డిఏ ప్రభుత్వం నుంచి వైదొలగిన నేపథ్యం లో శనివారం ఏపీ బీజేపీ నేతలతో అమిత్ షా ప్రత్యే కంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ అధిష్టానం తరుపున జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్, అఖిల భారత సంఘటనా మంత్రి రాం లాల్, జాతీయ అధికార ప్రతినిధి జి.వి.ఎల్. నరసిం హారావు పాల్గొనగా ఏపీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు కె.హరిబాబు, కేంద్ర మాజీమంత్రి దగ్గుబాటి పురం ధేశ్వరి, రాష్ట్ర మాజీమంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, పైడికొండల మాణిక్యాలరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర సంఘటనా మంత్రి రవీంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు. ఇకపై బీజేపీ ఏపీ వ్యవహారాలను జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ పర్య వేక్షించనున్నట్లు తొలుత అమిత్ షా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తరుపున ఏపీకి చేసి న సాయంపై అమి త్ షా రాష్ట్ర నేతలకు వివ రించారు. ఏడాదికి రూ.3వేల కోట్ల చొప్పున మూడేళ్లకు రూ.9వేల కోట్లు ఇస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించి రూ.16వేల కోట్లు అడిగిం దన్నారు. రాజధాని నిర్మాణం కోసం రూ.2500 కోట్ల మంజూరు చేస్తే ఇప్పటి వరకు ఒక్క భవనానికి కూడా శంఖుస్థాపన చేయ లేదన్నారు.

రెవిన్యూ లోటు విషయంలోను కూడా ఇదే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందని చెపుతూ ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం నుంచి, ఎన్‌డిఎ నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగిందని అమిత్ షా వారికి వివరించారు. తెదెపా వెళ్లినంత మాత్రాన ఏపీలో బీజేపీకి వచ్చిన నష్టమేమీ లేదంటూ కేంద్రం చేసిన సాయంపై ఇంటింటికీ తిరిగి వివరించాలన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఎవరైనా తీసుకునే విధంగా పీఎంఓ స్థాయిలో ఏపీ కోసం ప్రత్యేకంగా ఓ సంయుక్త కార్యదర్శి(జాయింట్ సెక్రటరీ) స్థాయి అధికారిని ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కమిటీలు

రాష్ట్ర బీజేపీ తరుపున వివిధ విభాగాలకు వెంటనే కమిటీలు వేయాలంటూ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ నేతలకు స్పష్టం చేశారు. అమిత్ షాతో సమావేశం ముగిసిన తర్వాత రామ్‌మాధవ్ నివాసంలో ఏపీ నేతలతో భేటీ జరిగింది. ఈ నెల 26,27 తేదీల్లో తనతో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలో పర్యటిస్తారని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే పక్షం రోజులకో మారు కేంద్రమంత్రులు రాష్ట్ర పర్యటనకు రానున్నట్లు వారికి చెప్పినట్లు తెలిసింది. విపక్షాల ఆరోపణలను ధీటుగా తిప్పికొట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సాయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ రామ్ మాధవ్ వారికి స్పష్టం చేశారు.

శ్రీ విళంబి నామ పంచాంగాన్ని ఆవిష్కరించిన కేవీ రమణాచారి


హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రముఖ పంచాంగ కర్త యలమంచి శ్రీధర శర్మ రూపొందించిన శ్రీ విళంబి నామ సంవత్సరం పంచాంగాన్ని ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ కెవి రమణాచారి శనివారం ఇక్కడ ఆవిష్కరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శనం పత్రిక సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, భీంసేన్ మూర్తి, తెలంగాణ విద్యత్సభ కార్యదర్శి గౌరిభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించుకుందాం: దేవులపల్లి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ దేవులపల్లి ప్రభాకరరావు పిలుపునిచ్చారు. సచివాల యంలో చేతన సారస్వత వేదిక ఆధ్వర్యంలో శనివారం జరిగిన తెలుగు సంవత్సరాది శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొ న్నారు. తెలంగాణ సంస్కృతి గొప్పదనీ, భాష కూడా తీయనైనదని చెప్పారు. సీఎం కె చంద్రశేఖరరావు సారథ్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో సాగుతోం దన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులు, గాయకులు ఉగాది కవితలు, పాటలను అద్భుతంగా వినిపించారని ప్రభాకరరావు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి చేతన అధ్యక్షురాలు క్రిష్ణవేణి అధ్యక్షత వహించగా, రచయి త్రి గోగు శ్యామల, జాయింట్ సెక్రెటరీ జూపాక సుబద్ర మాట్లాడారు. ప్రభా కర్, హరికిషన్, ఎఎస్ఆర్ మూర్తి, పద్మసుందరి, శ్రీదేవి తదితరులు కవితలు, పాటలు పాడారు. వారిని ప్రభాకరరావు, క్రిష్ణవేణి ఘనంగా సత్కరిం చారు.

తలకు రూ.50 వేల అప్పు

- వచ్చే ఏడాదికి రాష్ట్ర రుణభారం 2.1లక్షలు కోట్లు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : పరిస్థితి ఇదే విధంగా ఉంటే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర అప్పు రూ. 2,10,000 లక్షలకు చేరుకునే అవకాశం ఉంది. అదే అంటూ జరిగితే రాష్ట్రంలోని ప్రతి వ్యక్తిపై రూ. 51,145 భారం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. గురువారం శాసనసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ 2018-19 కి సంబంధించి రూ. 1,74, 453.84 కోట్లతో బడ్జెట్ ప్రతిపాద నలు సమర్పించిన విషయం తెలిసిందే. బడ్జెట్‌లో రాబడు లు, వ్యయాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, పన్నుల రాక, పోకలను పరిశీలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 1,80,238 కోట్ల అప్పులు ఉన్నట్లు తేలింది. ఇది వచ్చే ఆర్థిక సంవ త్సరంలో రూ. 2 లక్షలు దాటనుంది. ప్రస్తుత ఆర్థిక సంవ త్సరంలో రూ.23,000కోట్ల అప్పులను ప్రభుత్వం తీసు కుంది. వచ్చే ఏడాది రూ. 29,000 కోట్ల అప్పు అవసరమవు తుందని పేర్కొంది. రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్ర అప్పు రూ.70,000 కోట్లు కాగా, గడచిన నాలుగేళ్లలోనే లక్ష కోట్ల అప్పులు పెరిగాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడు తున్న సాగునీటి ప్రాజెక్టులు, ఇంటింటికి తాగునీరందించే మిషన్ భగీరథ, పలు కార్పోరేషన్లు తెలంగాణ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్, రైతు సమన్వయ సమితీలకు సైతం రుణాలు తీసుకోవాలని నిర్ణయించింది. జీఎస్‌డీపీలో 3.45 శాతం ద్రవ్యలోటు ఉన్నట్లు ప్రభుత్వమే ప్రకటించడం వల్ల అప్పులకు వెళ్లేందుకు అవకాశం ఉందా ? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. గడచిన ఐదేళ్లుగా అప్పుల వివరాలు ఇలా ఉన్నాయి. 2014 జూన్ 2 నుంచి వరకు రూ. 61,710 కోట్లు ఉన్న అప్పు 2014 -15 లో రూ. 83,845 కోట్లు, 2015 -16 లో రూ. 93,115 కోట్లు, 2016 -17 లో రూ.1,27, 829 కోట్లు, 2017 -18 లో రూ. 1,51,133 కోట్లు పెరిగింది. 2018 -19 లో రూ. 1,80, 238 కోట్లు పెరిగే అవకాశం ఉంది.

జీఎస్టీ అంచనాలు సుస్పష్టం

- జీఎస్టీ పరిహారంపై ఆశలు
- రాబడిపై అంచనాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత వాణిజ్య పన్నులపై బడ్జెట్ అంచనాలను తెలంగాణ ప్రభుత్వం ఆ మేరకు సవరించుకుంది. తాజా వార్షిక ఏడాదిలో వాణిజ్య పన్నుల రాబడి అంచనాలు రూ. రూ. 46,499కోట్లను వచ్చే ఏడాదికి భారీగా తగ్గించుకుంది. 2018-19 ఆర్థిక ఏడాదిలో రూ. 25,942 కోట్లనే అంచనా వేసుకున్నది. జీఎస్టీరాకతో మొత్తంగా ఈ రాబడిపై ప్రభావం పడింది. తాజా అంచనాల్లో భాగంగా కేంద్ర వస్తువులపై సేవల పన్నును(సీజీఎస్టీ) రూ.6181 కోట్లుగా, ఎస్జీఎస్టీ (స్టేట్ జీఎస్టీ) రూ. 26,040కోట్లు, ఐజీఎస్టీ రూ. 511కోట్లు, కేంద్ర పరిహారం రూపంలో రూ 1500కోట్లు అంచనా వేశారు.

2017-18 ఆర్థిక ఏడాదిలో తొలి నాలుగు మాసాలు జీఎస్టీ అమలుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే క్రమంగా జీఎస్టీశ్లాబ్ రేట్లలో మార్పులు, రిటర్న్‌ల దాఖలుకు గడువు పెంపు కారణాలతో నవంబర్‌లో రాబడికి గండిపడింది. నవంబర్ నెలలో రూ.1549కోట్ల ఎస్‌జీఎస్టీ, ఐజీఎస్టీ పన్ను ఖజానాకు చేరిందని ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేశాయి. అక్టోబర్ నెలలో రూ.1631కోట్లు జీఎస్టీ ద్వారా పన్ను ఆదాయం సమకూరింది. ఇందులో ఎస్జీఎస్టీ రూ.847కోట్లుకాగా, ఈ నెలలో అది రూ.750కోట్లు మాత్రమే కావడం గమనార్హం. అనేక వస్తు సేవలను 28శాతం శ్లాబ్ నుంచి 18శాతంలోకి, 18నుంచి కొన్నింటిని 12 శాతంలోకి, మరికొన్నింటిని 12నుంచి 5 శాతంలోకి తగ్గించడంతోపాటు మరికొన్ని సేవలను జీరో పన్ను శాతంలోకి చేర్చిన సంగతి తెలిసిందే. అయితే జీఎస్టీ కనీస రాబడిని కేంద్రం రాష్ట్రానికి నెలకు రూ.1745కోట్లుగా అంచనా వేసింది. దీనికంటే తక్కువగా వస్తే కేంద్రమే సర్దుబాటు చేయాలని కౌన్సిల్‌లో నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నవంబర్‌లో కేంద్రం రూ.196కోట్లను సర్దుబాటు చేయాల్సి ఉంది.

జీఎస్టీ అంతరం ...

తాజాగా ఆగష్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో జీఎస్టీ రాబడిపై కొంత అంతరం ఏర్పడింది. తెలంగాణలో జీఎస్టీ రూపంలో నెలకు రూ.1745 కోట్లు ఖజానాకు చేరుతాయని వేసుకున్న అంచనాలు స్వల్పంగా తలకిందులయ్యాయి. ఈ మేరకు ఏమైనా తగ్గితే, ఆ మేరకు లోటును కేంద్రం సర్దుబాటు చేయాల్సిం దిగా చట్టంలో ఉంది. ఈ నాలుగు నెలల్లో దాదాపు రూ.1068కోట్ల రాబడి తగ్గుదల నమోదైంది. దీనికి ఇంకా కేంద్రం సర్దుబాటు చేయలేదు. రెండు నెలలకోసారి కేంద్రం రాష్ట్రాలకు నిధులను సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చింది.

అమలులోకి వచ్చిన తొలి ఏడాది ఇప్పుడిప్పుడే స్పష్టత వస్తోంది. ఈ కాలంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల రాబడులు, అంచ నాల మధ్య తేడా పది శాతం లోపే నమోదైంది. జీఎస్టీ కౌన్సిల్ ఆగష్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల పరిహారాలను గణనలోకి తీసుకుంది. దేశంలో ఐదు రాష్ట్రాలు మాత్రమే పది శాతంలోపు తక్కు వ రాబడి కల్గి ఉన్నట్లుగా నిర్ధారణ అయింది. 2015-16 ఆర్థిక ఏడాది రాష్ట్రాల రాబడిని అంచనాగా తీసుకుని దీనికి 14 శాతం వృద్ధిరేటును అంచనా వేస్తూ సగటు మొత్తాలను లెక్కిస్తారు. దీని కంటే తక్కువ రాబడి వస్తే ఆ నష్టాన్ని కేంద్రం సర్ధబాటు చేస్తుంది. ఇలా ఐదేళ్లపాటు కేంద్రం పరిహారం ఇవ్వనుంది. తెలంగాణలో జీఎస్టీ రాబడి అంతరం రూ.1068 కోట్లుగా ఉంది. ఇక ఏపీలో రూ. 4369కోట్లకుగానూ రూ. 3603కోట్లురాగా రూ. 766కోట్ల అంతరం గమనించారు.

2017-18 ఆర్థిక ఏడాది పూర్తయ్యేనాటికి 40శాతం పన్నుల రాబడితో 18.6 శాతం వృద్ధిరేటు నమోదు చేసుకుంది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ 114 శాతంతో రూ.4వేల కోట్లను ఆర్జిం చింది. అమ్మకం పన్నుల రాబడి 32శాతంతో రూ.15,075కోట్లకు చేరుకుంది. ఆబ్కారీ శాఖ ద్వారా రూ. 9వేల కోట్ల రాబడి సమకూర్చుకుంది.



దేశానికే ఆదర్శం 'కాళేశ్వరం'

- ప్రాజెక్టు గేట్ల బిగింపు ఆరంభం
- 80శాతం పూర్తయిన కాంక్రీట్ పనులు
- అన్నారం బ్యారేజీ పనుల్లో వేగం
- జూన్ కల్లా పంటపొలాలకు నీళ్లు
- పనులు పరిశీలించిన మంత్రి హరీశ్

మహదేవ్‌పూర్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు భారతదేశానికి ఆదర్శంగా నిలువనుందని రాష్ట్రభారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కొనియాడారు. శనివారం ఆకస్మికంగా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. అన్నారం వద్ద నిర్మిస్తున్న బ్యారేజీ, గ్రావెటి కెనాల్, కన్నెపల్లి పంప్‌హౌజ్‌లను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శాసన సభకు మూడు రోజుల పాటు వరుసగా సెలవులు రావడంతో ప్రాజెక్టులు బాట పట్టినట్లు తెలిపారు. గతంలో నాలుగుసార్లు, రాత్రింబవళ్లు పనులు ఎలా జరుగుతున్నాయీ అడిగి తెలుసుకోవడానికి వచ్చినట్లు మంత్రి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నారం వద్ద నిర్మించిన ప్రాజెక్టును మొదటగా బిగించారు. ఈ పనులను మంత్రి దగ్గరుండి పర్యవేక్షించారు. మరో రెండు గేట్ల పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నా యన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బిడ్డ కాబట్టి రైతుకు ఎంత నీరు అవస రమే తెలిసిన బిడ్డగా ప్రాజెక్టు పను లు శరవేగం గా ముం దుకు సాగ డానికి ఇంజనీర్లతో పాటు ఆయన పనిచే స్తున్నా రన్నారు. వచ్చే వర్షకా లం కాగా కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ, ఎల్ఎండీ ప్రాజెక్ట లకు తీసుకెళ్లి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోని రైతులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇంజనీర్లు రాత్రింబవళ్లు తేడాలేకుండా పండుగలను సైతం పక్కన పెట్టేసి ప్రాజెక్టు తమకు ఇందే పండుగ అనుకుని చుట్టు గోదావరి వెంట ఉంటూపనులు చేస్తున్నారు. గత యేడాది డిసెంబర్ 11న సీఎం కేసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పర్యనటలో 13 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ ప్రారంభించి మూడునెల ల్లో పనులు శరవేగంగా పనులు కొనిసాగించి కోటి క్యూబిక్ మీటర్‌ల మట్టి పనులను పూర్తిచేశారన్నారు. ఇంకా 80 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు చేయాల్సి ఉందని, అత్యంత టెక్నాలజీని ఉపయోగించి ప్రాజెక్టు పనులను చేస్తున్నట్లు చెప్పారు. 29 వంతెనల పనులు కూడా వేగంగా సాగుతున్నాయన్నారు. ఇప్పటికే అన్నారం 90 శాతం పనులు పూర్తయ్యాయని, మరో కొద్దిరోజుల్లోనే ప్రాజెక్టులు పూర్తవుతాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోనే అత్యంత పెద్దదైన మేడిగడ్డ ప్రాజెక్టు 85 ట్లతో నిర్మిస్తున్నారని అన్నారం 66గేట్లు, సుందిళ్ల 79 గేట్ల పనులు తయారీ కూడా జరుగుతున్నాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం మరో కొంతమంది ఇంజనీర్లు కావాలని సీఈ వెంకటేశ్వర్లు మంత్రిని కోరగా సోమవారం కల్లా డిప్యూటేషన్‌పై మరొకొంత మంది ఇంజనీర్లను పంపిస్తానని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాతనే ఉగాది పెద్ద పండుగగా ఇంజనీర్లందరూ జరుపుకుంటామని అంతవరకు ప్రాజెక్టుమాకు పండుగలా భావిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీల్లో1384 పోస్టుల భర్తీకి ఆమోదం

- డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన డిగ్రీ లెక్చరర్ల అసోసియేషన్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 1384 పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపి నందుకు ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం కృతజ్ఞతలు తెలిపింది. మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 1214 అధ్యాపక పోస్టులు, 15 ప్రధాన ఆచార్యుల పోస్టులు, 67 వ్యాయా మ అధ్యాపక పోస్టులతోపాటు మరికొన్ని బోధనేతర సిబ్బంది భర్తీకి ఆమోదం తెలిపారని సంఘం అధ్యక్షు లు డాక్టర్ ఏ సంజీవయ్య, ప్రధాన కార్యదర్శి కె సురేం దర్‌రెడ్డి తెలిపారు.

చలో కోల్‌కతా

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహాత్మకంగా వ్యవహరిం చాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్డిఏ నుండి బయటకు రావడం, ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ఇప్పటికే కూర్పు చేశారంటూ జాతీయమీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో.. సుదీర్ఘకాలంగా ఫెడరల్ ఫ్రంట్‌పై కసరత్తు చేస్తున్న కెసిఆర్ మమతతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రాంతీయపార్టీల్లో అత్యంత బలీయంగా ఉన్న.. మమతాబెనర్జీ మద్దతు ఉంటే, ప్రాంతీయ పార్టీల కూటమితో దేశరాజకీయాల్లో చక్రం తిప్పవచ్చని కెసిఆర్ తలపోస్తున్నారు. తెలంగాణ తరహాలో.. కామన్ ఎజెండా తీసుకొచ్చి దేశంలోని రాజకీయ పార్టీలను అనివార్యంగా తన ఎజెండాలోకి తీసుకురావాలని కెసిఆర్ మొదట భావించగా, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా అంశం.. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల ఫలితాలతో అనూహ్యంగా దేశ రాజకీయాల్లో వేడి పెరిగింది. టిడిపి, వైసిపిలు ప్రకటించిన అవిశ్వాస తీర్మానాలకు బిజెపియేతర పార్టీలన్నీ క్రమంగా మద్దతిచ్చే దిశగా కదులుతుండగా.. ఢిల్లీ వెళ్లడం కంటే బెంగాల్ ద్వారా మంత్రాంగం నడిపి చక్రంతిప్పాలని కెసిఆర్ భావిస్తున్నారు. చంద్రబాబు నేతృత్వంలో ఫ్రంట్ ఏర్పాటయ్యే అవకాశం ఉందా.. ప్రాంతీయ పార్టీలన్నీ కూటమిగా ఏర్పడితే నేతృత్వం ఎవరు వహిస్తారు? కాంగ్రెస్ కూటమిలో ఉంటుందా? దేశ రాజకీయాల్లో మున్ముందు ఎలాంటి పరిణామాలు సంభవించబోతున్నాయి? అని ముఖ్యమంత్రి కెసిఆర్ మమతతో చర్చించే అవకాశం ఉన్నట్లు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. జాతీయ రాజకీ యాల విషయంలో తనకున్న ఆలోచనలు, కార్యాచ రణను ఈ సందర్భంగా వివరించి ముఖ్యమంత్రి మద్దతు కోరే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో నేరుగా కాంగ్రెస్‌తోనే పోరాడుతున్నం దున.. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఉన్న కూటమిలో టిఆర్ఎస్ ఉండడం సాధ్యం కాదని, ఇందుకు బదులుగా తన వద్ద ఉన్న ప్రత్యామ్నాయ సుస్థిర కార్యాచరణను సిఎం మమతకు వివరించే అవకాశం ఉందని సమాచారం. మమతాబెనర్జీని కలవనున్న ముఖ్యమంత్రి కెసిఆర్, ఇదే సందర్భంలో బెంగాల్‌కు చెందిన వివిధరంగాల నిపుణులతోనూ భేటీకావాలని యోచిస్తున్నారు. టిడిపి ప్రకటించిన అవిశ్వాసానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ ఇప్పటికే మద్దతు ప్రకటించగా, మమత సూచనలను మద్దతు విషయంలో పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ఎన్డిఏ నుండి బయటకు వచ్చి అవిశ్వాస ప్రకటన చేశాక వేగంగా జరుగుతున్న ప్రాంతీయశక్తుల ఏకీకరణలో తానూ క్రియాశీల పాత్ర పోషించాలని టిఆర్ఎస్ భావిస్తోంది. రాజకీయ పరిస్థితులను అనుకూలంగా మలుచుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. కోల్‌కతా వెళ్లొచ్చాక.. నెలాఖరులో ముంబైకి వెళ్ళి ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్‌ను కలిసే యోచనలో ఉన్నట్లు సమాచారం. పరిస్థితులను బట్టి ఢిల్లీ వెళ్ళాలని కూడా భావిస్తున్నారు. మమత సహకారంతో మరిన్ని ప్రాంతీయపార్టీల నేతలను కలిసే యోచనలో సిఎం ఉన్నట్లు సమాచారం. తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జాతీయ ఫ్రంట్ దిశగా ముమ్మర కార్యాచరణకు కెసిఆర్ సన్నద్ధమయ్యారు.

పాలనలోనూ మహిళలే భేష్!

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు, యుపిల నుండి ఎక్కువమంది మహిళలు నాయకత్వ లక్షణాలతో దూసుకువచ్చారన్నారు. వారసత్వం నుండి వచ్చే మహిళలను నిలదీస్తున్నారు కానీ పురుషులను ప్రశ్నించరా అని ఆమె అన్నారు. పురుషనాయకులు మహిళా సమస్యలపై మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల సమస్యలు, పరిష్కారంపై ఏడాది పొడవునా చర్చ జరగాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నదన్నారు. మహిళాదినోత్సవం సందర్భంగా మహిళా పారిశ్రామిక వేత్తల కోసం విహబ్ ప్రారంభించామన్నారు. దీనికి బడ్జెట్‌లో రూ.15కోట్లు కేటాయించామన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీళ్ళు అందిస్తే గ్రామీణప్రాంతాల్లో మహిళల ఇబ్బందులు తొలుగుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా షీటీమ్స్ అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. మహిళలు సాధికారిత సాధించాలంటే ముందు మహిళలు మారాలని, ఆలోచనా విధానంలో మార్పు రావాలన్నారు. సమ్మిట్‌లో టైమ్స్‌గ్రూప్ కన్సల్టింగ్ ఎడిటర్ సాగరికాఘోష్, టిఐఈ అధ్యక్షులు కాళీప్రసాద్, సిఐఐ చైర్ ఉమెన్ శోభాదీక్షిత్, మాజీ చైర్‌పర్సన్ కరుణగోపాల్, నల్సార్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఫైజన్ ముస్తఫా, రిజిస్ట్రార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో మార్పునకే కేసీఆర్ ఫ్రంట్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కెసిఆర్ ఏర్పాటుచేయబోయే ఫ్రంట్‌తో దేశరాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ మార్పుదిశగా దేశాన్ని నడిపించేందుకు కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు కృషిచేస్తున్నారన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కెసిఆర్ లక్ష్యమన్నారు. తెలంగాణలో 70ఏళ్ళలో జరగని అభివృద్ధి మూడేళ్ళలో చేశామన్నారు. తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాలను దేశమంతా అమలుచేయడమే కెసిఆర్ లక్ష్యమన్నారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన అవిశ్వాసతీర్మానం విషయంలో ముఖ్యమంత్రి కెసిఆరే తుదినిర్ణయం తీసుకుంటారన్నారు.



టీడీపీ - బీజేపీ సై × సై



(మొదటి పేజీ తరువాయి)

అన్ని ప్రశ్నలకు సమాధానాలిస్తూ, తాము సైతం ప్రశ్నిస్తామంటూ సవాల్ విసురుతోంది. శుక్రవా రం ఉదయం ఎన్డీయే కూటమి నుంచి వైదొలుగు తున్నామంటూ తెలుగుదేశం పార్టీ చేసిన ప్రకటన, ఆ తర్వాత లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంతో అటు రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సమీకరణాలు వేగంగా మారిపోయాయి. తెలుగుదేశం పార్టీ ఎన్డీయే కూటమి నుంచి దూరమయ్యే సంకేతాలిస్తున్నప్పటికీ, ఒక్కసారిగా రాత్రికి రాత్రే మిత్రపక్షం కాస్తా చిరకాల రాజకీయ ప్రత్యర్థిని తలపించే చర్యలతో విరుచుకుపడేసరికి బీజేపీ షాకయ్యింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ నాయకత్వంతో ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం గం. 4.00 సమయంలో ప్రారంభమైన ఈ సమావేశం దాదాపు గంటన్నర పాటు కొనసాగింది. అమిత్ షా నివాసంలో ప్రారంభమైన ఈ సమావేశానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ సహా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, సీనియర్ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, పురంధేశ్వరి, సోము వీర్రాజు, పైడికొండల మాణిక్యాల రావు, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, ఆకుల సత్యనారాయణ, మాధవ్, కంతేటి సత్యనారాయణ రాజు, కావూరి సాంబశివరావు హాజరయ్యారు.

తెలుగుదేశం పార్టీ ఎన్డీయేను వీడుతూ జాతీయస్థాయిలో బీజేపీని దోషిగా నిలబెట్టిన తీరును అమిత్ షా తప్పుబడుతూ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో పరిస్థితుల గురించి నేతల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న అమిత్ షా, పార్టీని బలోపేతం చేయడానికి ఇక ఏ అడ్డంకులూ లేవని చెప్పినట్టు సమాచారం. మిత్రపక్షంగా ఉంటూనే బీజేపీ సొంత బలం పెంచుకోకుండా టీడీపీ అడ్డుకున్న తీరుపైనా నేతలు వివరించి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కోసం కేంద్రం ఇంత చేసినా ఏమీ చేయలేదంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని అమిత్ షా సూచించారు. రాష్ట్రానికి కేంద్రం ఏమేం చేసిందో ఆధారాలతో సహా వివరాలన్నీ అందజేస్తామని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. కేవలం తమ గణాంకాలతోనే సరిపెట్టకుండా తెలుగుదేశం పార్టీ వైఫల్యాలను సైతం ఎండగట్టాలని తేల్చి చెప్పారు. మరింత దూకుడుగా, ముప్పేట ఎదురుదాడికి సిద్ధపడాలని రాష్ట్ర నాయకత్వానికి సూచించారు. ఈ సమావేశంలోనే ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల బాధ్యతల్ని రాం మాధవ్‌కు అప్పగిస్తూ అమిత్ షా నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషించిన రాం మాధవ్ పార్టీ అప్పగించిన ఏ పనైనా దిగ్విజయంగా పూర్తిచేస్తూ వచ్చారు. భావవైరుధ్యం కలిగిన పీడీపీ వంటి రాజకీయ పార్టీలతో కలిసి జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో రాం మాధవ్ కీలకంగా వ్యవహరించారు. ఈశాన్య రాష్ట్రాల్లో పూర్తి వైరుధ్య భావజాలం కలిగిన కమ్యూనిస్టుల కంచుకోట త్రిపురలో కాషాయ జెండా ఎగరేయడంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన ట్రాక్ రికార్డ్ రాం మాధవ్‌కు ఉంది. బీజేపీకి సొంత బలం సరిపోకపోయినా, ఇతర పార్టీలను కలుపుకుని సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో ప్రత్యర్థులకు అందనంత వేగంగా దూసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఆయనకు మాత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ బాధ్యతలు అప్పగించడంతో రాష్ట్ర నాయకత్వంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.అమిత్ షా నివాసంలో సమావేశం ముగిసిన వెంటనే ఏపీ నేతలంతా రాం మాధవ్ నివాసానికి చేరుకున్నారు. అక్కడ విడిగా మళ్లీ సమావేశమయ్యారు. రాష్ట్ర పరిస్థితులపై లోతుగా చర్చించారు. పార్టీ ముందున్న సవాళ్లను, ప్రతికూల పరిస్థితులను గురించి రాం మాధవ్ రాష్ట్ర నేతలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను సిద్ధం చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి ఆస్కారమున్న అంశాల గురించి కూడా రాంమాధవ్ వివరాలు అడిగి తీసుకున్నట్టు తెలుస్తోంది.

మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి : రాంమాధవ్

రాబోయే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో రాజకీయ తీర్మానం చేయబోతోంది. రాజకీయ తీర్మానం ద్వారా బీజేపీ వైఖరి ఏంటో రాష్ట్ర ప్రజల ముందు పెడతాం. రాష్ట్ర అభివృద్ధి కోసం ఇతర పార్టీలు ఎంత కట్టుబడి ఉన్నాయో అంతకంటే ఎక్కువగా బీజేపీ కట్టుబడి ఉంది. అనేక విధాలుగా రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు చిత్తశుద్ధితో సహకారం అందజేశాం. రాబోయే రోజుల్లో కూడా ఆ కృషి కొనసాగుతుంది. సెంటిమెంటు ఆధారంగా తెలుగుదేశం నేతలు ఏవైతే ప్రశ్నిస్తున్నారో.. వాటికి అభివృద్ధే ఆధారంగా సమాధానం చెబుతాం. ఇన్నాళ్లూ మేమూ, తెలుగుదేశం కంచెకు ఒకే వైపు ఉన్నాం. ఈ రోజు కంచెకు అటూ ఇటూ నిలబడ్డాం. మేం చేసింది కాదిది. తెలుగుదేశం ఎన్డీయే నుంచి వైదొలడం ద్వారా, కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడం ద్వారా తనంతట తానుగా మాకు వ్యతిరేకంగా నిలబడింది. వారు లేవనెత్తిన ప్రశ్నలకు తప్పనిసరిగా రాబోయే రోజుల్లో ప్రజలకు సమాధానం చెబుతాం. అయితే ఇప్పటి వరకు తెలుగుదేశం, ముఖ్యమంత్రి మాత్రమే ప్రశ్నలు లేవనెత్తారు. రాబోయే రోజుల్లో మేము లేవనెత్తే ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

బీజేపీపై దుష్ప్రచారం



ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ బయటికొచ్చిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. బీజేపీ మీద టీడీపీ సహా వైకాపా, వామపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రత్యేక హోదా విషయంలో తెలుగుదేశం పార్టీ భావోద్వేగాలను రెచ్చగొడుతోంది. నిజానికి విభజన చట్టంలో పదేళ్ల కాలంలో పూర్తిచేయాలని ప్రస్తావించిన అనేక సంస్థల్ని తాము కేవలం మూడున్నరేళ్లలోనే పూర్తి చేశాం. ఈ అంశాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలన్న విషయంపై చర్చించాం. పారిశ్రామిక రాయితీలు, వడ్డీ మినహాయిం పులు ఇప్పటికే అమలవుతున్నాయి.



స్క్రిప్టు మాది కాదు మీది

బీజేపీ ప్రజ ల కోసమే ఉంది. మా ది ప్రజాపక్షం. వారు చెప్పిందే నిజం కాదు. మేం ముఖ్యమంత్రికి కొన్ని ప్రశ్నలు వేశాం. వాటికి సమాధానాలు చెప్పకుండా వైకాపా స్క్రిప్టు అంటారు. పురంధేశ్వరి మాట్లాడితే ఇది కాంగ్రెస్ పార్టీ స్క్రిప్టు అంటారు. పవన్ కళ్యాణ్ కొన్ని అవినీతి ఆరోపణలు చేస్తే సమాధానం చెప్పరు. ఉండవల్లి అరుణ్ కుమార్ స్క్రిప్ట్ అంటారు. మళ్లీ తెల్లవారితే బీజేపీ స్క్రిప్టు అంటారు. ఇదెక్కడి సాంప్రదాయం? ఈ స్క్రిప్టులేంటి? కొంతమంది నటులను పెట్టి స్క్రిప్టులు చదివించేది వారే. రాజకీయ డైలాగులతో వాళ్లు ముందుకెళ్తున్నారు. ఒకప్పుడు ప్రత్యేక హోదా సంజీవని కాదన్నారు. హోదా అంటే జైల్లో పెడతాం అన్నారు. రెండు నాలుకల ధోరణి ఎవరిది? మేం మొదటి నుంచి ఒకే మాట మీద ఉన్నాం. విభజనకు ముందు, విభజన తర్వాత మాది ఒకే మాట. రెవెన్యూ లోటు రూ. 16 వేల కోట్లుగా చెప్పడం తప్పుడు లెక్క. మహా అయినా ఐదారు వేల కోట్లు ఉంటుం ది. రైల్వే జోన్ వ్యవహారం 45 సంవత్సరాలుగా ఉంది. ఇప్పుడు బీజేపీ పరిశీలిస్తోంది. ఇప్పుడు కూ డా మేము ఇవ్వ ము అని ఎక్కడా అనలేదు. పదేళ్ల కాల వ్యవధిలో చేయాల్సిన వాటిని ఇప్పటికిప్పుడే చేయాలంటున్నారు.

అవిశ్వాసంపై ఏంచేద్దాం?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీకి చెందని ఎంపీలు చెబుతున్నారు. అవిశ్వాసం విషయంలో కెసిఆర్ నిర్ణయం తీసుకుంటారని శనివారం కవిత చెప్పారు. అవిశ్వాసంపై జరిగే చర్చలో పాల్గొని.. ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు, రిజర్వేషన్ల అంశంపై వాదనలు వినిపించాలని టిఆర్ఎస్ భావిస్తోంది. అవిశ్వాసంపై చర్చ జరిగి.. డివిజన్ జరిగే పరిస్థితి ఉంటే అప్పటి వాతావరణాన్ని బట్టి నిర్ణయం తీసుకుందామని, ఈ లోగా మరిన్ని రాజకీయ మార్పులు జరిగే అవకాశం ఉందని టిఆర్ఎస్ భావిస్తోంది.

సోమవారం ఉదయం ముఖ్యమంత్రి కెసిఆర్ కోల్‌కతా వెళ్ళి మమతాబెనర్జీతో భేటీ కానుండగా, ఆమె సూచనలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. జాతీయ రాజకీయాల్లో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా చురుకుగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయించారు. అందుకు అనుగుణంగానే అవిశ్వాసం విషయంలో నిర్ణయం ఉండే అవకాశం ఉంది.

అవిశ్వాసం చుట్టూ రాజకీయాలు

- అనుకూల, వ్యతిరేక వర్గాలుగా పార్టీలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు దేశంలో సృష్టించిన ప్రకంపనాలు ఇంకా కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీలన్నీ ఈ తీర్మానానికి అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయాయి. నిన్నమొన్నటి వరకు మిత్రపక్షంగా ఉన్నవాళ్లే ఇప్పుడు వైరివర్గాలుగా మారిపోయి అవిశ్వాస అస్త్రాన్ని ప్రయోగించడంతో క్షణక్షణానికి రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయి. మొదటగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ తీర్మానం ప్రవేశపెట్టడంతో కదలిక మొదలైంది. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ సైతం ఈ అస్త్రాన్ని సంధించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

మొత్తానికి రెండు పార్టీలూ పరస్పరం నిందారోపణలు చేసుకుంటూనే ఒకే కేంద్రంపై ఒకే ఆయుధాన్ని ఎక్కుపెట్టాయి. ఇన్నాళ్లూ అధికార కూటమిలో భాగస్వామిగా ఉండి, ఒక్కసారిగా బయటికి రావడమే దేశ రాజకీయాల్లో కలకలం సృష్టించగా, ఆ వెంటనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం అందరినీ నివ్వెరపరిచింది. అయితే ఈ రెండు పార్టీలతో సిద్ధాంతపరంగా విబేధాలున్నా, కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. కేంద్రాన్ని ఇరకాటంలో పెట్టే ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోడానికి ఇష్టపడని తృణమూల్ కాంగ్రెస్ కూడా మద్దతు ప్రకటించింది. సైద్ధాంతిక వైరుధ్యంతో బీజేపీ అంటేనే మండిపడే కమ్యూనిస్టుల మద్ధతు ఎలాగూ ఉండనే ఉంది. వీరితో పాటు కేంద్ర ప్రభుత్వంతో, బీజేపీతో తగవులాడే సమాజ్‌వాదీ, బీఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలన్నీ వరుసగా జట్టుకడుతున్నాయి. మరోవైపు ఎన్డీయే కూటమిలో ప్రస్తుతానికి భాగస్వాములుగా ఉన్నా, తరచుగా తగవులాడుతున్న శివసేన కాస్త అటూ ఇటూ తటపటాయించింది. చివరకు ఎన్డీయేతోనే ఉంటామని నిర్ధారించింది. ఇలా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అవిశ్వాస తీర్మానం కారణంగా అనుకూల, ప్రతికూల వర్గాలుగా మారిపోయి జట్టుకడుతున్నాయి.



సిరిసిల్ల మునిసిపల్ ఛైర్‌పర్సన్ రాజీనామా

సిరిసిల్ల, ప్రభన్యూస్ : సిరిసిల్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ సామల పావని తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె రాజీనామా లేఖను శనివారం రాత్రి మున్సిపల్ మేనేజర్ శ్యాంసుదర్‌కు అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా సిరిసిల్ల అభివృద్ధికోసం తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన మంత్రి కేటీఆర్‌కు తన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రామవరప్పాడు రైల్వేస్టేషన్‌కు అరుదైన గుర్తింపు

- ఇక నుంచి మహిళా రైల్వే స్టేషన్‌గా పరిగణింపు
- డీఆర్ఎం ధనుంజయులు

అమరావతి, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి విజయవాడ రైల్వే డివిజన్‌లో పూర్తి స్థాయి మహిళా రైల్వేస్టేషన్‌గా రామవరప్పాడు రైల్వేస్టేషన్ ప్రత్యేక గుర్తింపు పొందింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు దీనిని పూర్తి స్థాయి మహిళా రైల్వే స్టేషన్‌గా పరిగణించి, డీఆర్ఎం ధనంజయులు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ రైల్వేస్టేష న్లలో ఇక నుంచి పూర్తిగా మహిళలే అన్ని రకాల సేవలు అందించనున్నారు. మహిళా స్టేషన్‌గా మారడంతో దీనికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. విజయవాడ డివిజన్‌లోని 161 రైల్వేస్టేషన్లలో ఈ రైల్వేస్టేషన్ మొదటి మహిళా రైల్వేస్టేషన్‌గా గుర్తింపు పొందింది. రైల్వేలో మహిళా శ్రామికశక్తిని పెంపొందించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని మరింతగా అభివృద్ధి పరచడానికి దక్షిణ మధ్య రైల్వే మహిళా సిబ్బందితో ఈ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేసింది . రైలు కార్యకలాపాలు , టిక్కెటింగ్, భద్రత, ఇతర సంబంధిత విధులన్నీ కూడా మహిళలే నిర్వహిస్తారు. రామవరప్పాడు రైల్వేస్టేషన్‌లో ఒక మహిళా స్టేషన్ సూపరింటెం డెంట్, ముగ్గురు మహిళా స్టేషన్ మాస్టర్లు, ఇద్దరు పాయింట్స్ ఉమెన్‌లు, మరో ముగ్గురు మహిళలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో కానిస్టేబుళ్లుగా పని చేస్తున్నారు. ఎస్ఎస్‌గా ఎం.శైలజ, ఎస్ఎంలుగా జోలిమండల్, కె.సునీత, పి.అలేఖ్యలు విధులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు పి.చైతన్య, వరుణ్‌బాబు, రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ తుపాన్!



వాయుగుండం వచ్చినప్పుడు సముద్రంలో అలలు ఎప్పుడు ఎంతెత్తున ఎగసిపడతాయో అంతుచిక్కని విషయం. రాజకీయ సుడిగుండమూ అంతే. అది ఎప్పుడు ఎటునుంచి ఎలా వస్తుంది..ఎటు మలుపులు తిరుగుతుంది..ఆ సుడిగుండాల్లో ఎవరు గల్లంతవుతారు.. ఇవేవీ అంతా అయ్యేదాకా తెలీదు. ఎటో వెళ్లిపోతుందనుకునే వాయుగుండం అటు తిరిగి ఇటు తిరిగి మరొకర్ని తాకుతుంది. ఆ తాకిడికి జీవితాలే అతలాకుతలమవుతాయి. రాజకీయ జీవితాలూ అంతే. అమరావతి నుంచి హస్తిన దాకా రేగిన రాజకీయ తుపాను ఇలాంటిదే. ఊహించిందే అయినా..ఇంత త్వరగా..ఈ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తుందని ఎవ్వరూ అనుకోలేదు. ఈలోగా అదెన్ని మలుపులు తిరిగిందీ..ఎంతెంత మందిని తాకిందీ...చూస్తూనే ఉన్నాం. ఇంతటితో అయిపోలేదు. ఈ తుపాను సుదీర్ఘ కాలం ఉండేదే. ఇంకా చెప్పాలంటే 2019 మార్చి దాకా తప్పని సుడిగుండమిది. జరగాల్సిన నష్టాలు జరిగాక..చివరకు ప్రజలే ఆ శిథిలాలను తొలగించుకుని ఇంటిని చక్కదిద్దుకుంటారు. ఆ ఘడియల కోసమే అందరి ఎదురుచూపులు!



అక్షరక్రమంలో ముందున్న ఆంధ్రప్రదేశ్ తాజాగా ఎన్డీయేకు రాజకీయ కుదుపులు ఇవ్వడంలోనూ ముందు వరసలోకే వచ్చింది. కమలనాథులకు చేతినిండా పని పెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మొన్న మొన్నటి దాకా ఒకే ప్రత్యర్థి. అదే వయ్యస్సార్ కాంగ్రెస్ పార్టీ. దాని అధ్యక్షుడు జగన్ ఒక్కరే ఆయనకు సవాలుగా నిలిచారు. తీరా ఇప్పుడు మరో రెండు సవాళ్లు కొత్తగా వచ్చి చేరి మొత్తం మూడయ్యాయి. పవన్ కల్యాణ్, ప్రధానమంత్రి మోడీ కొత్తగా పెను సవాళ్లుగా మారారు. నాలుగేళ్లుగా నడుస్తున్న స్నేహం చెదిరి మోడీకి -చంద్రబాబుకి మధ్య ఒక్కసారిగా ఇంతటి అగాధం ఏర్పడుతుందని బహుశా వారు కూడా అనుకుని ఉండరు. కాకపోతే లోలోపల పొరపొచ్చాలు మాత్రం వారికి తప్ప మరెవ్వరికీ తెలిసినవి కావు. మరీ రెండేళ్లుగా విభజన అంశాలు తెర మీద తీవ్రస్థాయిలో చర్చనీయాంశాలై..అదే వివాదాస్పదమై.. రెండు పక్షాలనూ నిద్రపోనివ్వని స్థితికి తెచ్చాయి. మిత్రుడి పాత్రలో మిత్రధర్మం ప్రకారం నడుచుకున్న చంద్రబాబు తీరా ఒక్కసారిగా ప్రత్యర్థి పాత్ర పోషించాల్సి వచ్చింది. నిన్నటి మిత్రుడు నేడు శత్రువు కావడం రాజకీయాల్లో అసహజ పరిణామమేమీ కాకున్నా చంద్రబాబు ఇలా రూపాంతరం చెందడానికి మొదట్లో కాస్తంత తడబడాల్సి వచ్చింది. రాజకీయాలు ముక్కండాయ స్థితికి వచ్చాక..మొన్నటి నిర్ణయాలకు సవరణలు చేసుకోవాల్సి వస్తే అదెవరికైనా ఇబ్బందికరమే. అదే స్థితిని చంద్రబాబు ఎదుర్కొన్నట్టు అనిపించింది. జగన్ పార్టీ అవిశ్వాస తీర్మానం పెడతానని ప్రకటించినప్పుడు తెలుగుదేశం వైఖరి ఒకరకంగా ఉంటే..తీరా బీజేపీతో విభేదాలు ముదిరి కటీఫ్ స్థాయికి వచ్చాక..రాజకీయ శత్రువులైనా సరే అవిశ్వాస తీర్మానం పెడితే రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలుగుదేశం మద్దతిస్తుందని చంద్రబాబు ప్రకటించాల్సి వచ్చింది. మళ్లీ రాత్రికి రాత్రే వ్యూహం మార్చుకుని ఎవ్వరో పెడితే మద్దతు ఇచ్చేకన్నా తామే స్వయంగా తీర్మానం పెట్టాలని నిర్ణయించడం మరో మలుపు.

చంద్రబాబు రాజకీయ వ్యూహరచనలో ఎంత అప్రమత్తంగా ఉంటారనే దానికి ఇదే ఉదాహరణ. ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని బేరీజు వేసుకుంటూ నిన్నటి ఆలోచనలకు నేడు మెరుగులు దిద్దుకుంటూ..అవసరమైతే మార్పులు చేసుకుంటూ వెళ్లడంలో ఆయన దిట్ట. అదే ఆయన్ని రాజకీయ వ్యూహరచనలో అగ్రభాగాన ఉంచుతుంటుంది. తాము అవిశ్వాస తీర్మానం పెడతామని ముందునుంచీ చెబుతూ వచ్చిన వైకాపా నిజానికి చంద్రబాబుని ముగ్గులోకి దింపడానికే ప్రాధాన్యమిచ్చినట్టు కనిపిస్తుంది. తాము తీర్మానానికి సిద్ధమైతే తెలుగుదేశానికి సంతకాలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని భావించింది. వ్యూహాత్మకంగా అది సరైన ఆలోచనే. అవతలి

ప్రత్యర్థి దానికి విరుగుడు అస్త్రం సంధించనంతవరకు అది మెరుగైన వ్యూహమే. అక్కడే రాజకీయ పరుగుపందెంలో తెలుగుదేశం కాస్తంత ముందుకెళ్లింది. తీరా తెలుగుదేశమే అవిశ్వాసం తేవడానికి ముందుకు రావడంతో వైకాపా కంగుతింది. ఈ మలుపుని ఆ పార్టీ ముందుగా ఊహించి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. అంతా అయ్యాక చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారని విమర్శించి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాన్ని యూ టర్న్ అనేకన్నా మెరుపు వ్యూహం అంటే బావుంటుంది. ఇదే మిత్రుల మధ్య జరిగితే మంచి వ్యూహంగా అభివర్ణించుకుంటారు. ప్రత్యర్థుల మధ్య జరిగింది కాబట్టి దీన్ని కుట్ర అంటారు. ఎవరి కోణంలో వారు భాష్యం చెప్పుకోవడం అలా ఉంచితే..ఈ రాజకీయ క్రీడలో ప్రతి ఒక్కరూ వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకెళుతున్నారు. చంద్రబాబు అవిశ్వాస నిర్ణయం తీసుకున్న కొద్ది గంటల్లోనే దానికి వివిధ రాజకీయ పక్షాల నుంచి మద్దతు లభించడంతో తాను సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నానని ఆయన ధీరగంభీర స్వరంతో ప్రకటించుకోగలిగారు. రెండు రోజుల విరామం వచ్చింది. ఈలోగా ప్రధాన రాజకీయ పక్షాలు మళ్లీ తాజాగా తమ వ్యూహాలకు పదును పెట్టుకునేందుకు వెసులుబాటు దొరికింది. వీళ్లింతగా ఎత్తులకు పైఎత్తులు వేసి మళ్లీ సోమవారం అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు గాని అదైనా సఫలీకృతమవుతుందా అంటే సందేహమే. శుక్రవారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ తీసుకున్న నిర్ణయం ఈ సందేహానికి తావిస్తున్నది. సభలో వాతావరణం సజావుగా ఉంటేనే తీర్మానాన్ని చేపడతానని ఆమె ప్రకటించడంతో సోమవారం సభ సజావుగా నిశ్శబ్దంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత తెలుగుదేశం, వైకాపా అధినేతల మీద పడింది. తెలుగుదేశం తీర్మానానికి ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో సోమవారం లోక్‌సభలో రణగొణ ధ్వనులకు ఆస్కారం ఉండకపోవచ్చు. రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకునేందుకు తమకు అధికారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర సమితి సభలో ప్లకార్డులతో రోజూ నిరసన తెలుపుతున్న సంగతి తెల్సిందే. ఆ పార్టీ అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేదీ లేనిదీ ఇంకా అధికారికంగా తెలియరాలేదు. మద్దతు ఇవ్వాలని ఆపార్టీకి ఉన్నట్టు లేదని ఆ పార్టీ నేతల మాటలను బట్టి అర్థమవుతోంది. ఒకవేళ ఆ పార్టీ మద్దతు ఇవ్వకుంటే సోమవారం ఆ పార్టీ సభ్యులు సభలో రోజూ మాదిరే నినాదాలతో నిరసనలకు దిగొచ్చు. అప్పుడు మళ్లీ శుక్రవారంనాటి పరిస్థితే. స్పీకర్‌కు పని సులభమవుతుంది. బీజేపీకి కావాల్సింది కూడా ఇదే. ఆడబోయే తీర్థం ఎదురైనట్టే. ఇలాంటి సమీకరణాల నేపథ్యంలో అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చే అవకాశాల మీద నీలినీడలు ముసురుతున్నాయి.

అవిశ్వాస తీర్మానం గెలుపోటములు ఇక్కడ ప్రధానం కాదు. ఆ తీర్మానం మీద చర్చకు పట్టు పట్టాలని, ఓటింగు అడగాలని చంద్రబాబు తన పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు కాబట్టి..ఇంతా చేస్తే అదేదో గెలుస్తుందని..మోడీ ప్రభుత్వం పడిపోతుందని ఎవ్వరూ అనుకోరు. చంద్రబాబుకీ ఆ విషయం తెలీక కాదు. కాకపోతే రాష్ట్రం..రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మీద ఏ స్థాయిలో అసంతృప్తిగా ఉందో సంకేతాత్మక హెచ్చరిక

చేయాలన్నదే ఇందులోని పరమార్థం. మోడీ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదుగాని. ఇది మాత్రం నిస్సందేహంగా మోడీ ప్రభుత్వం మీద ఒకనల్లని మచ్చగా మిగిలిపోతుంది. ఏదో ప్రయివేటు సభ్యుడు ఇచ్చే తీర్మానంలా కాకుండా.. నిన్నటి దాకా మిత్రపక్షంగా ఉన్న పార్టీ..ఒక రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ.. ప్రధాన ప్రతిపక్షాల మద్దతుతో అవిశ్వాస తీర్మానం పెట్టడమనేది మోడీకి వ్యక్తిగతంగా ఒక అభిశంసనలాంటిదే. కమలనాథులు ఈ వ్యవహారాన్ని ఇంత సీరియస్‌గా తీసుకుంటే మోడీ నడతలో కాస్తంతయినా మార్పు వచ్చే అవకాశాలుంటాయి. చీలికలు పేలికలుగా ఉన్న ప్రతిపక్షాలను ఏకతాటి మీదికి తెచ్చేందుకు మోడీయే కంకణం కట్టుకున్నారా అన్నంతగా దేశ రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతుంటే బీజేపీలో అంతర్మథనం మొదల

య్యే అవకాశాలే ఎక్కువగా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌తో మొదలైన ఈ సంక్షోభాన్ని బీజేపీ అధిష్టానం ఆంధ్రప్రదేశ్ అంశంగానే పరిగణిస్తున్న సూచనలు గోచరిస్తున్నాయి. ఇది దేశవ్యాప్త అంశంగా చర్చనీయాంశమై జనబాహుళ్యంలో నిర్ణయాత్మక శక్తిగా మారగల అవకాశాలను బీజేపీ నేతలు పరిశీలిస్తున్నారా లేదా అన్నది సందేహాస్పదంగానే ఉంది. నాలుగేళ్ల క్రితం నరేంద్రమోడీ అధికారం చేపట్టిననాటి పరిస్థితికి..ఆ తర్వాత రెండేళ్ల నాటి పరిస్థితికి...ఇప్పటి రాజకీయ స్థితిగతులకు మధ్య అంతరాన్ని బేరీజు వేసి పరిశీలిస్తేనే బీజేపీ కర్తవ్య నిర్వహణ ఏమిటో తెలిసే అవకాశాలున్నాయి. అలాగని ప్రధాని మోడీ ఈ పరిణామాలనన్నింటినీ ప్రేక్షకుని మాదిరి చూస్తూ నిమిత్తమాత్రుడిగా ఉంటారని కూడా అనుకోనక్కర్లేదు. కాకపోతే ఆయన వ్యూహాలు మరింత పెళుసుగానూ.. కటువుగానూ ఉంటాయి. మోడీ-అమిత్ షా ద్వయం వ్యూహ రచనా చమత్కృతులు గత రెండేళ్లుగా యావద్దేశ ప్రజలకు సుపరిచితమే. చంద్రబాబు రాజకీయ వ్యూహాలు చాపకింద నీరులా ఉంటాయి. ఆచితూచి అడుగేస్తారు. సమయం, సందర్భం చూసి మరీ అడుగేయడంలో చంద్రబాబుకు ఆరితేరిన నేతగా గుర్తింపు ఉంది. చంద్రబాబు వేసే ప్రతి అడుగూ ప్రతీకార చర్యలా కాకుండా వ్యూహాత్మక అడుగులా అనిపిస్తుంది. కాని మోడీ-షా ద్వయం రాజకీయాల్లో దూకుడుతనం కనిపిస్తుంది. ఆధిపత్య ధోరణి ధ్వనిస్తుంది. ఈ శతాబ్దపు రాజకీయాలకు అదే అసలుసిసలైన వైఖరిగా కొందరు భాష్యం చెబుతున్నారు. దానిలోని మంచిచెడులను ఏదో ఒకటీ అరా చర్యలతో నిర్ధారించడం కష్టసాధ్యం. ప్రధాని మోడీ తీసుకునే విధాన నిర్ణయాల్లో సాహసం కనిపిస్తుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధాన నిర్ణయాలు ఈ కోవలోవే. రాజకీయ నిర్ణయాల్లో కఠినత్వం కనిపిస్తుంది. అందుకే అవి ప్రతీకారాత్మక చర్యల్లా అనిపిస్తాయి. అందులోను తెలుగు రాష్ట్రంలో సెంటిమెంట్ ప్రబలంగా ఉన్న తరుణంలో ఇలాంటి అంశాలు నిర్ణయాత్మక సమయాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉంటుంది. దీన్ని కమలనాథులు గుర్తెరిగి సకాలంలో సరైన ఉపశమన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

జాతీయ స్థాయిలో మూడో ఫ్రంట్ ముచ్చట్లు మొదలయ్యాయి. మోడీ ప్రభుత్వాన్ని ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు ఆలోచనల దశ దాటి కార్యాచరణ దశకు చేరుకున్నట్టే కనిపిస్తున్నది. ఎన్డీయేలోని భాగస్వామ్యపక్షాలే మోడీ వ్యవహారశైలి పట్ల కినుకతో ఉన్నారని కొద్ది నెలలుగా వార్తలు వస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు మూడో ఫ్రంట్ కోసం కసరత్తు చేయడం దేశ రాజకీయాల్లో కొత్త పరిణామంగా భావించాలి. ఈమధ్య దాకా 2019 సార్వత్రిక ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీల మధ్యే పోటీ ఉంటుందని, కాంగ్రెస్ ఇంకా సమఉజ్జీగా రాటుదేలలేదని కమలనాథులు లెక్కలు వేసుకున్నారు. ఉన్నట్టుండి అతి తక్కువ సమయంలోనే ప్రత్యామ్నాయాల గురించి ప్రతిపక్షాలు పెదవి విప్పడం..ప్రజల్లో నాటుకుంటున్న ప్రభుత్వ వ్యతిరేకతకు చిహ్నంగా భావించాలి. ఇప్పటిదాకా పిల్లి మెళ్లో గంట కట్టేదెవరన్నదే ప్రధానాంశం కాగా..చంద్రబాబు కేంద్రం మీద తిరుగుబాటు చేయడంతో ప్రతిపక్షానికి ఎక్కడ లేని హుషారు, ధైర్యం వచ్చినట్టయింది. అంతమాత్రాన చంద్రబాబు ఆ ఫ్రంట్ ప్రయత్నాలకు ప్రాణం పోసే స్థితిలో ఉన్నారా అన్నది ఒక ప్రశ్న. భారతదేశ ప్రతిపక్షాలది భిన్నమైన తీరు. ఏ రెండు పార్టీల మధ్య సఖ్యత ఉండదు. ఉన్నా ఎంతో కాలం నిలవదు. కలిసి నడుద్దామని సూత్రప్రాయంగా అనుకుంటారు గాని..నడిపించేదెవరనే దానిమీదే విడిపోతారు. ఈ వైఖరి మోడీకి కలిసి రావాలి. కాని మొన్న ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ జత కట్టి రెండు లోక్‌సభ స్థానాలను బీజేపీ నుంచి లాగేసుకోవడంతో ప్రతిపక్షాల మధ్య ఐక్యత సాధ్యమేనన్న సంకేతాలు వచ్చాయి. మోడీ మీద యుద్ధానికి తామెంతవరకైనా వెళ్లగలమని ఆ పొత్తు ద్వారా చెప్పినట్టయింది. ఇదే స్ఫూర్తి సార్వత్రిక ఎన్నికల్లోనూ నిలిస్తే బీజేపీ మరెన్నో అంతుచిక్కని వ్యూహాలకు తెర లేపాల్సిన అగత్యం ఏర్పడుతుంది.

చంద్రబాబు ఫెడరల్ ఫ్రంట్ పెడతారన్న ఊహాగానాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మోడీ మీద ఆయన అవిశ్వాస అస్త్రాన్ని సంధించడంతో ఇలాంటి ఊహాగానాలు సహజమే. ఆయన రాష్ట్రాన్ని అలా మధ్యలో వదిలేసి హస్తినకు వెళతారని అనుకోవడానికి పెద్దగా ఆధారాలు కనిపించడం లేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌ని కొత్తగా నిర్మించాలన్న ఆయన తపన ఇంకా తొలి దశలోనే ఉంది. రాజధాని నిర్మాణానికి రాళ్లెత్తే దశ కూడా ఇంకా రాలేదు. విభజిత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్ర ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే సంకల్పంతో ఉన్న చంద్రబాబు ప్రస్తుతం దౌత్యరీతి దశ దాటి పోరాటానికి దిగారు. ఇందులో విజయం సాధించడం ఆయనకు అత్యవసరం. ఇది సాధించకుండా ఆయన ఢిల్లీ వెళ్లి రాజకీయాలు చేయలేకపోవచ్చు. ఆ సంగతి ఆయనకు బాగా తెలుసు. అందుకే ఎవరెన్నిసార్లు ఆ విషయాన్ని ప్రస్తావించినా ఉద్వేగానికి లోనుకాకుండా తన పరిధికి కట్టుబడి ఉండాలనుకుంటున్నారు. ఆయన చేసే పోరాటం నేడో రేపో ఫలితాలు ఇస్తుందని ఆశించలేము. అంతే కాదు. పోనుపోను అది ఆంధ్రప్రదేశ్-ఎన్డీయే మధ్య పోరాటమనే పరిమితిని ఛేదించుకుని విస్తృతమయ్యే అవకాశాలు లేకపోలేదు!!

వయ్యస్సారెస్

గాసిప్స్ ఎప్పటికీ నిజాలు కావు!



ఆదిత్యహృదయం

వి.ఎన్.ఆదిత్య

సినిమా కష్టాలు పలురకాలు. సినిమాల్లో కెళ్లాలనుకునే వాళ్లు నిలదొక్కుకునే వరకూ పడే కష్టాలు మొదటిరకం. మద్రాసు వెళ్లిన కొత్తలో అక్కడి ప్రొడక్షన్ మేనేజర్లు, కారు డ్రైవర్లు, ప్రొడక్షన్ బాయ్స్, అసిస్టెంట్ డైరెక్టర్స్ అందరూ కొత్తగా వచ్చిన నాలాంటి వాడికి అడిగినా, అడగకపోయినా తెగ చెప్పేవారు ఈ మొదటి రకం సినిమా కష్టాలని, పాండీ బజార్‌లో రేలంగి గారు పనగల్ పార్కు బెంచ్ మీద పడుకునేవారని, రాజబాబు పంపులో నీళ్లుతాగి కడుపునింపుకునే వారని, రామారావు గారు సైకిల్‌మీదొచ్చి ఈ మెస్‌లో భోజనం చేసేవారని, నాగేశ్వర్రావు గారు నడుచుకుంటూ వచ్చి ఈ కొట్లో కిళ్లీ కట్టించుకునేవారని, పెద్ద స్టారయ్యాక కూడా కారులో వచ్చి ఆ కొట్లోనే కిళ్లీ కట్టించుకునే వారని, ఈ ఎడిటింగ్ రూమ్ బయటే చిరంజీవి గారు నిలబడి ఎడిటర్ బ్రేక్‌లో బైటకి రాంగానే నేను యాక్ట్ చేసిన ఆ సీన్ ఎలా ఉందండి అని అడిగేవారని, ఎవరైనా అసిస్టెంట్ డైరెక్టర్స్‌కో, ప్రొడ్యూసర్స్‌కో ఒక్కసారి చూపిస్తారా ప్లీజ్ అనే వారని, రజనీకాంత్ ఈ సందులో గది అద్దెకు తీసుకుని ఉండేవారని, శోభన్‌బాబు ఇక్కడ ఒక చిన్న గదిలో ఫ్యామిలీతో ఉండేవారని ఇలా ఒకటి కాదు, రెండు కాదు సక్సెస్ అయిన ప్రతిస్టార్

తాలూకు స్ట్రగులింగ్ డేస్‌ని కళ్లకి కట్టినట్టు చెప్పేవారు. నాకు ఒక్కొక్క స్టార్ కథా వింటున్న కొద్దీ రక్తం ఉప్పొంగి, నా నిర్ణయం సరైనదేననీ, నా కష్టాలన్నీ కరెక్ట్ దిశలోనే నన్ను స్టార్ల సరసకు చేరుస్తాయనీ గట్టిగా నమ్మేసేవాడిని. ఆ ఉత్తేజంలో ఏ కష్టమైనా కష్టంగా గాక మహా ఇష్టంగా మారిపోయింది. ఈ కథలన్నీ అందుకు స్ఫూర్తినిచ్చాయి. ఇక్కడ గమనించాల్సిందేంటంటే, ఆ టైమ్‌లో నేను, నాలాంటి వాళ్లు వినే కథలన్నీ సక్సెస్ అయినవాళ్ల స్ట్రగుల్సే. ఫెయిల్యూర్ స్టోరీస్ ఎవ్వరూ చెప్పేవారు కారు. అప్పుడప్పుడు నేను కుతూహలం కొద్దీ, కొంతమంది ఇండస్ట్రీలో ఒక్కసారి మెరిసి తర్వాత ఎలా మాయం అయ్యారని అడుగుతుండేవాణ్ణి. ఉదాహరణకి కృష్ణగారితోనే వెండితెరకు పరిచయమైన రామ్మోహన్, జమున గారితో ఎక్కువ సినిమాలు నటించిన హరనాథ్, ఇలా ఇంకా చాలామంది గురించి అడిగేవాణ్ణి. నా జాగ్రత్తలో నేనుందామని. చిన్నప్పుడు ఊర్లలో రచ్చబండల దగ్గర, గుడి అరుగుల మీద చాలా గాసిప్పు వినేవాళ్లం సినిమాలకి సంబంధించి. రామారావు చాలామంది చిన్న హీరోలని తొక్కేశాడనీ, నాగేశ్వర్రావు రామారావునే ఇండస్ట్రీనుంచి పంపేద్దామని ప్రయత్నించేవాడనీ, ఎస్పీబీ మొత్తం మగసింగరనే వాడు లేకుండా తొక్కేశాడనీ ఇలా ఆ రిక్షావాడో, సైకిలువాడో, వాడు చదివిన ఎల్లో సినిమా వ్యాగజైను న్యూసులన్నీ వాడి సమక్షంలో జరిగినంత ఆథెంటిక్‌గా చెప్పేసేవాడు. అందుకే ఫెయిల్యూర్ స్టోరీస్ మీద కూడా ఓ కన్నేసుంచాను. మద్రాసు వెళ్లిన కొత్తలో. అప్పటి వరకూ నేను జీవితంలో విన్న ఏ ఒక్క గాసిప్పూ నేను సినిమాల్లో కొచ్చాక మ్యాచ్ కాలేదు. లాజిక్ లేదని తెలిసింది. సమాజ సమతుల్యత. కష్టపడి ఒకడు పైకొస్తే, కష్టపడి

ఇంకోడు వాడిని కిందకి దించుతూ ఉండాలి. లేకపోతే పైకిరాని, రాలేని, ప్రజలందరికీ ఆత్మన్యూనత పెరిగిపోతుంది. సక్సెస్ అయిన వాడిని చూసి స్ఫూర్తి పొందేవాళ్లు కొందరుంటే, ఆ, వాడి మొహం అదేం గొప్ప? అనో అడ్డదారిలో వచ్చాడనో ఇంకొందరంటారు. ఈ గాసిప్పులన్నీ అలాంటివన్నమాట. సరే ఈ ఫెయిల్యూర్ కథలు గురించి

కనుక్కున్నప్పుడల్లా నాకు తెలిసిన కారణాలు ఆయా వ్యక్తులకి ఏదో ఒక చెడు అలవాటో, వ్యసనమో, ఉండేదని. అమ్మాయిల పిచ్చో, మందులేకుండా ముద్దదిగక పోవడమో, పేకాటో, సక్సెస్, గుర్తింపు రాగానే తలకెక్కిన అహంభావమో, ఇలా సినిమాకి ఏ మాత్రం సంబంధంలేని కారణాలే ఈ ఫెయిల్యూర్స్‌కి కారణం అని చెప్పేవారు. అతి కొద్దిమంది మాత్రం సొంత సినిమాలు తీసి ఆర్థికంగా చితికిపోయారని, వారిలో కొందరు మళ్లీ లేచి నిలదొక్కుకోగలిగారనీ, ఇంకొందరు ఎప్పటికీ లేవలేకపోయారనీ తెలిసేది. ఇలా మదరాసులో నా అసిస్టెంట్ డైరెక్టరు పీరియడ్ అంతా సక్సెస్, ఫెయిల్యూర్ కథల ఉగాది పచ్చడిలా గడిచిపోయింది. దానివల్లే దర్శకుడయ్యే వరకూ పడగలిగిన సినిమా కష్టాలన్నీ తట్టుకోగలిగాను. ఫెయిలైనా కూడా ఒక్క అవకాశం వచ్చే పరిస్థితిలోనే నా నడవడికను దిద్దుకోగలిగాను. ఏ ఒక్క వ్యక్తి గత బలహీనతా నా సినిమా జీవితాన్నీ, సినిమా అవకాశాన్నీ మింగేయకూడదని బలంగా



నిర్ణయించుకోగలిగాను. మదరాసు పాండీ బజార్ లాగ, హైదరాబాద్‌లో

కృష్ణనగర్ కథలు చాలానే ఉంటాయి. సక్సెస్ స్టోరీలు, ఫెయిల్యూర్ స్టోరీలూ కూడా. కొత్తగా సినిమాల్లోకి వచ్చిన వాళ్లకి ఆ పాఠాలు వినిపిస్తూనే ఉంటాయి. ఏ పాఠం ఎవరు చెప్పినా దాన్నుంచి వినేవాడు ఏం గ్రహించాడు అన్నదే ముఖ్యం. తన జేబులో ఒక్క రూపాయి కూడా లేని నిర్మాతకి బాహుబలి కథ చెప్పినా, తీయలేనని చెప్పడు. కథ బాలేదని చెప్తాడు. నిజంగా రాజమౌళితో అద్భుతమైన సినిమా తియ్యాలని ధన సమేతంగా సిద్ధమైన నిర్మాత, రాజమౌళి బాహుబలి కథ చెప్పకపోయినా సినిమా తీస్తాడు. కాబట్టి ఎవరైనా కథ బాలేదంటే పూర్తిగా ఆ కథ బాలేదనుకుని డిప్రెషన్‌కు గురికానక్కర్లేదు. ఆ కథ విన్నవాడికి దానికి సూటయ్యే హీరో, హీరోయిన్లు దొరక్కపోవచ్చు, అంత బడ్జెట్ అతని వద్ద లేకపోవచ్చు, అతను ఆశించిన జోనర్ అది కాకపోవచ్చు, అతనింకో నాలుగైదు కథలు, పది పదిహేను డీవీడీలు ఆల్రెడీ రెడీ చేసుకుని ఉండచ్చు. అందుకని కొత్త కథకులూ, కొత్త దర్శకులూ కంగారు పడి కథను మార్చేయకండి. కావాలంటే ఇంకో కథ చెప్పండి. వచ్చేవారం మరిన్ని విశేషాలతో...

చైత్ర గీతి



చైత్రాగమనానికి తియ్యని గుర్తు
మామిడి పూత
నవాబ్దానికి స్వాగతగీతి
కోయిలకూత
నేటి నిరాశల్ని గలగలారాల్చేసి
రేపటి ఆశల్ని పల్లవింపజేసే ఆమని
నవవర్ష భామిని
కలతల్ని పోగొట్టి
కమ్మని ఊహల్ని గుండెల్లో నింపే కళ్యాణి
నవాబ్దలక్ష్మి వికృతిని చెరిపేసి
ప్రకృతిని పరమ సుందరంగా
దీపింపజేసే విద్యుల్లత
సుమనస్విని ఉగాదికాంతే
కన్నీళ్లు తుడుచుకో
కష్టాల్ని మరచిపో
నవ వర్షోదయం
నవ గీతం పాడుకో
జీవితాన్ని
ఓ మధుర కావ్యంగా రాసుకో
నవాబ్దానికి స్వాగతగీతి పాడు
చైత్రాగమానికి తియ్యని గుర్తు
ఈ మామిడి పూత
ఈ కోయిలకూత!

-తిరునగరి శ్రీనివాస్, 9441464764

శుభాకాంక్షలు



స్వాగతమమ్మా విళంబి స్వాగతం
షోడశోప చారాలు అందిస్తున్నాం
హేవళంబి మాకిచ్చిన
సంతోషం సాగనీ...
కొత్త కొత్త ఆశలకు
చిగురుటాకు లేయనీ...
సకాలంలో వర్షాలు కురవాలి
రైతుఇంట ధాన్యలక్ష్మి నిలవాలి
విద్యార్థుల విజ్ఞానం పెరగాలి
దేశ ప్రగతికది పునాది కావాలి
పరిసరాల పరిశుభ్రత తేవాలి
కాలుష్యపు కోరలను తురమాలి
స్వచ్ఛభారతం మనదై వెలగాలి
స్వేచ్ఛాయుత జీవితం రావాలి
ఉత్పత్తులు పెంచాలి
ధరను తగ్గించాలి
అతి సామాన్యుడు సహితం
ఆనందం పొందాలి
ఆరోగ్య పరిరక్షణ
అందరికీ దక్కాలి
సుఖ శాంతులతో
విళంబి సంపూర్ణమవ్వాలి

-కూచిమంచి నాగేంద్ర, ఏలూరు


ఆత్మీయ ఆహ్వానం



ప్రకృతి పులకరించి పూసిన
శ్రీ హేవిళంబినామ పరిమళాలు వదల్చిన..
జాడలను వెతుక్కుంటూ... చిగురించిన మోడులు
వికసించిన పూలే వెన్నెల కాంతులై
శ్రీ విళంబినామ వత్సరం వికసించువేళ...
కోకిల కూసింది
వసంతకాలాన వయ్యారంగా
స్వాగత సన్నాయిలై...
విజయాల మువ్వల సవ్వడితో
మా ముందుకు రారమ్మని..
తెలుగు జాతికి ఆది పండుగ
ఉగాది..
పండుగల వసుదైక కుటుంబాన్ని
తెలుగువారి ప్రతిఇంటికి రారమ్మని
ఆహ్వానం పలుకుతుంది..
వినమ్రంగా ఉగాది..
ఆశల పల్లకిలో ఊరేగడం కానేకాదు?
భూత భవిష్యత్‌లను షడ్రుచుల పచ్చడిలో
ఆస్వాదిస్తూ
ముమ్మాటికి వర్తమానంలో బతకమంటుంది
అనుభవాల శ్రీ హేవిళంభిని స్ఫూర్తితో!
శ్రీ విళంబి నామ వత్సరం అనునిత్యం
అద్భుతాల వర్తమానమవ్వాలని...
శాంతి సిరులు మాకు పంచి
ఆయురారోగ్యాలతో మనః శాంతిని
మాలో నింపమ్మా
సంస్కృతుల ఉషోదయంతో
సంస్కార సంధ్యవు అవ్వాలని
తెలుగుజాతి దండిగా పలుకుతుంది
శ్రీ విళంబినామ ఉగాదికి
ఆత్మీయ ఆహ్వానం...

-మేకిరి దామోదర్, 9573666650

విళంబీ స్వాగతమ్ము...



ఓ విళంబి నామ సంవత్సరమా
నీకిదే స్వాగతం ... సుస్వాగతం
నీ నామమే విలక్షణంబు
పలికితేనే పులకరింపమ్మా
ఆది పండుగవై వస్తావు..
ఆనందాన్నిస్తావు
కవి సమ్మేళనాన్ని జరిపిస్తావు..
కవితాగానాన్ని మౌనంగా వింటావు
కవులను సన్మానింపచేసి కనుమరుగైపోతావు
కాలాన్ని నడిపిస్తూ అందరిని ఆశీర్వదిస్తావు.
॥ఓ విళంబి॥
బొడ్డుమల్లెపూలు పూయిస్తావు
మోదుగ పూలను రంగులమయంగా అందిస్తావు
మంచిని ఇచ్చి
చెడును మిగుల్చుతావు
కులమతాలకతీతంగా
సుఖశాంతులు ఇస్తావు.
॥ఓ విళంబినామ॥
ఓ ఉగాదీ నీవు పంచభక్ష పరమాన్నాలతో
విందుచేసి ప్రజలను సంతోషపెడతావు
పచ్చడితో అందరికీ చేరువవుతావు
జీవితమంటే తీపి, చేదు, వగరు, పులుపు, కారం, ఉప్పు
అన్నీ అనుభవించాల్సిందేనని సందేశమిస్తావు
॥ఓ విళంబి నామ॥
ఓ విళంబీ, ఈ యేడు తెలంగాణ రాష్ట్రాన్ని
అన్ని రంగాలలో ముందుకు నడిపించు
అన్నదాతల మోములో
చిరునవ్వులు చిందించు
ప్రతీప్రాణి కోటి సుఖసంతోషాలతో
ఉండేలా దీవించు
॥ఓ విళంబి॥

-కామిడి సతీష్‌రెడ్డి, 9848445134

పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు

● అదనంగా టీయూఎఫ్ఐడీసీ నిధులు

● కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు ఒక్కో పట్టణ దత్తత బాధ్యతలు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పట్టణ ప్రాంతాల్లో రోజు రోజుకు జనాభా పెరిగిపోతుండడంతో మౌలిక సదుపాయాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా పెద్దఎత్తున నిధులను వెచ్చించి పట్టణ ప్రాంతాలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పట్టణాల పురోగతికి టియుఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా మరిన్ని నిధులు వెచ్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని కొద్ది రోజుల క్రితం మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సైతం స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

మెరుగైన విద్యా, వైద్య సౌకర్యాలతో పాటు జీవనోపాధి కోసం గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు నగర బాట పడుతున్నారు. దీని కారణంగా ప్రతి సంవత్సరం పట్టణ ప్రాంతాల్లో నివసించేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ పరిమాణాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పురపాలికలను ఏర్పాటు చేయాలని తలపెట్టింది.

ప్రస్తుతం రాష్ట్రంలో డెబ్బైఒక్క మున్సిపాలిటీలు ఉండగా.... కొత్తగా పదిహేను వేల జనాభా దాటిన పంచాయతీలను నగర పంచాయితీలుగా రూపొందించే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. అలాగే గ్రేటర్ హైదరాబాద్ పరిధి అనుకుని ఉన్న నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పట్టణ ప్రాంతాలు పెద్దసంఖ్యలో ఏర్పాటు అవుతున్నాయి. శివారు గ్రామాలకు పట్టణ శోభ సంతరించుకుంటున్న నేపథ్యంలో అదే స్థాయిలో మౌలిక సౌకర్యాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. కొత్తగా ఏర్పడే పట్టణ ప్రాంతాలతో పట్టణ ప్రాంతాల్లో నివసించే జనాభా మునుముందు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 39 శాతం జనాభా నివసిస్తుండగా, నూతనంగా ఏర్పడే పురపాలికల వల్ల జనాభా 45శాతానికే పెరిగే అవకాశముంది. దీనిని దృష్టిలో పెట్టుకునే పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోంది.

ఇప్పటికే పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం వైపు నుంచి ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తోంది. ఈ నిధులతో పట్టణాలను పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేయనున్నారు. నూతనంగా ఏర్పడిన కొత్త జిల్లాల కేంద్రాలు, ఇతర పట్టణాల్లో పక్కా రోడ్డు మ్యాపుతో అభివృద్ధి చేస్తారు. అలాగే పట్టణాల్లో జంక్షన్ టూ జంక్షన్ రోడ్ల అభివృద్ధి, మోడల్ మార్కెట్లు, ఫుట్‌పాత్‌లు, బస్‌బేలు, మురికి కాలువల అభివృద్ధి, శ్మశాన వాటికలు, పార్కుల అభివృద్ధి పనులను చేపడతారు. పట్టణాల అభివృద్ధి పనులు మరింత శరవేగంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకుగానూ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు ఒక్కొక్క పట్టణాన్ని దత్తత ఇచ్చే అంశాన్ని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. ఒకవైపు ఆయా పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు వెచ్చించే నిధులతో పాటు ప్రస్తుతం బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వచ్చే ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు పెద్దఎత్తున నిధులను కేటాయించిన విషయం తెలిసిందే. సుమారు రూ. 7,251 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇవి కాకుండా కేంద్రం నుంచి 14వ ఆర్థిక సంఘం ద్వారా వివిధ పథకాల కింద వచ్చే నిధులను కూడా పట్టణ ప్రాంతాల అభివృద్ధికి వెచ్చించనున్నారు. మొత్తానికి త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పన పనులు మరింత శరవేగంగా జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



ఏసీబీ వలలో లేబర్ కోర్టు అధికారి

● రూ. 3.57 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు



హైదరాబాద్/బౌద్ధనగర్, ఆంధ్రప్రభ : నాంపల్లి లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి ఇంట్లో ఏసీబీ దాడులు నిర్వహించింది. నాంపల్లో కోర్టులో పనిచేస్తున్న ఎం. గాంధీ ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హైకోర్టు అనుమతితో ఏసీబీ అధికారులు శనివారం దాడులు జరిపారు. హైదరాబాద్, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఆయన ఇళ్లతో పాటు బంధువుల ఇంట్లోపైనా సోదాలు నిర్వహించారు. ఇక్కడి వారాసిగూడలోని అతడి ఇంటితో పాటు.. నాంపల్లి, డీడీ కాలనీ, ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరులో రెండు చోట్ల, ఏలూరు, రాజమండ్రి సహా మొత్తం 7 చోట్ల ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. జరిగిన తనిఖీల్లో బంజారాహిల్స్‌లో రూ.10,52,000 విలువైన ఫ్లాట్, డీడీ కాలనీలో రూ.33,51,000 విలువైన ఫ్లాట్, వారాసిగూడ పాత ఇంట్లో రూ.35 లక్షల నగదు, రూ.70 లక్షలతో వారాసిగూడలో త్రీ ఫ్లోర్ బిల్డింగ్ నిర్మాణం, వెర్నా కారు, టయోటా కారు, మారుతి ఆల్టో కారు, హోండా యాక్టివా టూ వీలర్, పశ్చిమగోదావరి జిల్లా వెంకటాయపాలెంలో 9.49 ఎకరాల వ్యవసాయ భూమి, పశ్చిమగోదావరి జిల్లా కరగపాడులో 8.73 ఎకరాల వ్యవసాయ భూమి, అతడి నివాసంలో కేజీ బంగారం, బ్యాంకు లాకర్‌లో 1.5 కేజీల బంగారం, నాలుగు కేజీల వెండి, తొమ్మిది లక్షల బ్యాంకు బ్యాలెన్స్, రూ.0.89 లక్షల నగదు, రూ.6 లక్షల విలువచేసే గృహోపకరణాలు, రూ.33 లక్షల విలువ చేసే చిట్ ఎమౌంట్‌ను ఏసీబీ అధికారులు గుర్తించారు. మొత్తం విలువ రూ.3.57 కోట్లు ఉండవచ్చని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గాంధీని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అవి రాజకీయ సమన్వయ సమితులే!

● సీఎం కేసీఆర్‌కు దాసోజ్ శ్రావణ్ బహిరంగ లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతుల సంక్షేమం పేరుతో ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితి పక్కా రాజకీయ సమన్వయ సమితి అని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. కరువు కాటకాలతో అల్లాడి ఆత్మహత్యలు చేసుకున్న రైతులను ఈ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఇతర పార్టీల నుంచి కొనుగోలు చేసిన ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డికి రాజకీయ పునరావాసం కల్పించేందుకు రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేశారని, రైతుల సంక్షేమం కోసం కాదంటూ శనివారం ఆయన సీఎం కేసీఆర్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. రాజకీయ నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న టీఆర్ఎస్ శ్రేణులకే ఈ కమిటీలో ప్రాధాన్యత కల్పించారని, నిజమైన రైతులకు అవకాశం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.

నిరుద్యోగులను మోసగిస్తున్న సర్కార్


● పీసీసీ సేవాదళ్ చైర్మన్ కనుకుల ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేపట్టకుండా నిరుద్యోగులతో చెలగాటం ఆడుతోందని టీపీసీసీ సేవాదళ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో 1లక్ష68 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. నాలుగేళ్లలో నాలుగో వంతు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. శనివారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నియామకాలు చేపట్టడం లేదని టీఆర్ఎస్ ఆందోళనలు చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని, వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు.

బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పిస్తాం

● కేంద్ర మంత్రి రాందాసు అత్వాలే హామీ




హైదరాబాద్,ఆంధ్రప్రభ: జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదింప చేస్తామని కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాసు అత్వాలే హామి ఇచ్చారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ప్రతినిధులు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంటులో పాస్ చేయించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని కృష్ణయ్య తెలిపారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ నాయకులు నీల వెంకటేష్, భూపేష్ సాగర్, తదితరులు ఉన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లుకు కొన్ని ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని, వాటిని అధిగమించి ఈ సమావేశాల్లోనే ఆమోదింప చేస్తామని కేంద్ర మంత్రి అత్వాలే హామి ఇచ్చారని ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు జాతీయ స్థాయిలోనూ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని కోరారు.

మూల్యాంకనను బహిష్కరించిన హిందీ టీచర్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలుగును తప్పనిసరి చేసి మిగిలిన ద్వితీయ భాషలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో హిందీ అధ్యాపకులు ఇంటర్మీడియట్ మూల్యాంకనాన్ని బహిష్కరించారు. తెలుగును తప్పనిసరి చేసిన నేపథ్యంలో హిందీ ఇతర భాషలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని, దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని హిందీ భాష అధ్యాపక సంఘం నాయకులు జబీఉల్లా డిమాండ్ చేశారు. తమకు జరిగే అన్యాయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంతో గత రెండు రోజులుగా హిందీ మూల్యాంకనాన్ని బహిష్కరించి ఆందోళన కొనసాగిస్తున్నట్టు వారు తెలిపారు.

ఉద్యోగుల విభజనకు విధివిధానాలు

● రూపకల్పనకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైద్యవిధాన పరిషత్తు ఉద్యోగుల విభజన ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన విధి విధానాలను నాలుగు వారాల్లో రూపొందించాలని ఏపీ, తెలంగాణ వైద్య విధాన పరిషత్తు వైద్య, ఆరోగ్య శాఖలను హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత ఎనిమిది వారాల్లో ఉద్యోగుల విభజన ప్రక్రియను పూర్తి చేయాలని రెండు తెలుగు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలకు హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు ఆధ్వర్యంలోని కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రిలో ప్రోగ్రామింగ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎస్.సుజాత, డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ ఎం.సుబ్బరాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న పి.వెంకటేశ్వరరావు వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలన్నింటికీ వర్తించేలా ధర్మాసనం (కామన్ ఆర్డర్) ఉత్తర్వులు వెలువరించింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..పిటిషనర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారన్నారు. తమను ఏపీకి పంపాలని తెలంగాణ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఏపీలో స్థానం కల్పించి, సర్వీసు నిబంధనల ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని ఏపీ వైద్యవిధాన పరిషత్తు కమిషనర్లు, వైద్యఆరోగ్య శాఖకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అయితే వీటిని అధికారుల పట్టించుకోలేదన్నారు. తెలంగాణలో తగిన సీనియారిటీ ఉన్నా, ఏపీ స్థానికులనే కారణంతో మరొకరికి పదోన్నతి కల్పించారని విన్నవించారు. తెలంగాణలో పని చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్‌లోనూ పదోన్నతులు కల్పించలేదన్నారు. తమను ఇక్కడ విధుల నుంచి రిలీవ్ చేసేలా తెలంగాణ అధికారులను, అక్కడ ఏపీలో విధులు అప్పగించి, పదోన్నతులు కల్పించేలా ఏపీ అధికారులను ఆదేశించాలని అభ్యర్థించారు.

దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని తేలుస్తారని ప్రశ్నించింది. కొట్లాడకుండా కూర్చొని తగిన విధి విధానాలను 4 వారాల్లో ఖరారు చేసి, 8 వారాల్లో ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వైద్య, ఆరోగ్య శాఖలను ధర్మాసనం స్పష్టం చేసింది.

బీసీ రెసిడెన్షియల్ కాలేజీల ప్రవేశాలకు తుది గడువు ఏప్రిల్ 11

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబాపులే వెనుకబడిన తరగతుల సంక్షేమ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో చేరుటకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించినట్టు గురుకుల సొసైటీ కార్యదర్శి మల్లయ్య బట్టు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 26న నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్ష ఫీజు రూ. 150గా నిర్ణయించినట్టు చెప్పారు. పరీక్షను తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నిర్వహించనున్నారు. జూనియర్ కాలేజీలు బాలికలకు 7, బాలురకు 12 ఉన్నట్టు తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాలను చేపడతామని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో 22న రాష్ట్ర బీసీ సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీల బడ్జెట్‌ను పెంచాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీలకు నిధులను తక్కువగా కేటాయించారని, జనాభాకనుగుణంగా నిధులు కేటాయించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ బీసీలను నిరాశ పరిచిందని విమర్శించారు. బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్ ఊసేలేదని మండిపడ్డారు. 54 శాతం ఉన్న బీసీలకు కేవలం 3 శాతం నిధులను కేటాయించడం దారుణమన్నారు. బీసీ నివేదిక ప్రస్తావనలేదని, బీసీల కోసం కొత్తగా ఒక్క పథకాన్ని ప్రవేశ పెట్టలేదని అన్నారు. బీసీలకు బడ్జెట్‌లో రూ. 10వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ 22న బీసీ సంఘాల సంఘాల రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల బడ్జెట్ కేటాయింపులపై పునరాలోచన చేయాన్నారు.

నకిలీ విత్తనాలపై కొరడా

● జిల్లాలవారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలు

● వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ విత్తనాలపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి తెలిపారు. జిల్లాల వారీగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి శనివారం రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి సీడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు రాష్ట్రంలో అవలంబించాల్సిన విధానాలు, నియంత్రణ చర్యలపై మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, ముఖ్యంగా రైతులను నట్టేట ముంచుతున్న బీటీ పత్తి విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. కొన్ని విత్తన సంస్థలు ప్రభుత్వ అనుమతి లేకుండా బీజీ-3 హెచ్‌డీ పత్తి విత్తనాలను మార్కెట్లోకి తీసుకువస్తున్నారని, ఈ విత్తనాలను నియంత్రించాల్సిన బాధ్యత టాస్క్‌ఫోర్స్ అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

చట్టవిరుద్ధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేస్తున్న బీజీ-3 హెచ్‌డీ విత్తనాలు పర్యావరణానికి తీవ్రమైన ముప్పు తెస్తాయని, ఈ విషయంతో అప్రమత్తంగా ఉంచి రైతులను చైతన్యపర్చాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు హెచ్చరించిందని తెలిపారు. నకిలీ విత్తనాల నియంత్రణలో 1966 నాటి చట్టాలే ఇంకా అమలవుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని, పట్టుబడిన సంఘటనలు అనేకం ఉన్నప్పటికీ చట్టప్రకారం బాధ్యులపై కేవలం రూ.500 మాత్రమే జరిమానా విధించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పోలీసు అధికారులు, కిందిస్థాయి యంత్రాంగం చిత్తశుద్ధితో నకిలీ దందాను నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు.

రాష్ట్రస్థాయిలో సీడ్ టాస్క్‌ఫోర్స్ అధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఐజీ నాగిరెడ్డి మాట్లాడుతూ, పట్టుబడ్డ నకిలీ విత్తనాలను నియంత్రించడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయం చేసుకుంటూ చర్యలకు పూనుకోవాలని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు అమ్మాలంటేనే భయం పుట్టుకొచ్చే విధంగా చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కమిషనర్ డాక్టర్ జగన్మోహన్, విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఆచార్యుల పోస్టుల భర్తీ మరింత ఆలస్యం

● కొత్త మార్గదర్శకాలిచ్చిన యూజీసీ ● డిపార్ట్‌మెంట్ల వారీగా రిజర్వేషన్ల అమలు

● రాష్ట్ర యూనివర్సిటీలకు వర్తింపుపై యూజీసీకి ఉన్నత విద్యా మండలి లేఖ

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టుల భర్తీ మరింత ఆలస్యం కానుంది. యూనివర్సిటీల్లో ఆచార్య పోస్టుల భర్తీకి ఇప్పటి వరకు ఉన్న మార్గదర్శకాలు కాకుండా కొత్త మార్గదర్శకాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) రూపొందించింది. మార్చిన మార్గదర్శకాల ప్రకారం యూనివర్సిటీలోని ఆచార్యుల పోస్టుల రిజర్వేషన్లను యూనివర్సిటీ యూనిట్‌గా కాకుండా డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా కొనసాగించాలని యుజిసి కొత్త నిబంధనలను రూపొందించింది. ఈ నిబంధనల మేరకు ఆచార్యుల పోస్టులను భర్తీ చేయాలని యుజిసి సూచించింది.

యుజిసికి లేఖ రాసిన ఉన్నత విద్యామండలి

యుజిసి రూపొందించిన కొత్త నిబంధనలు కేవలం కేంద్రీయ విశ్వవిద్యాలకే వర్తిస్తాయా? లేకపోతే రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు కూడా వర్తిస్తాయా? అనేది రాష్ట్రానికి స్పష్టత లేదు. దీనిపై స్పష్టత కోరుతూ యుజిసి తెలంగాణ ఉన్నత విద్యా మండలి యుజిసికి లేఖ రాసింది. యుజిసి నుంచి స్పష్టత రావల్సి ఉంది. అయితే ఒకవేళ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు కూడా అమలు చేయాలని సూచిస్తే అప్పుడు రాష్ట్రంలో ఆచార్యుల పోస్టుల భర్తీ ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది. కారణం ఇప్పుడు ఉన్న యూనివర్సిటీ యూనిట్ ప్రకారం రోస్టర్ పాయింట్లు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను రూపొందించారు. మారిన విధానం ప్రకారం డిపార్ట్‌మెంట్ల వారీగా రోస్టర్ పాయింట్లు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను రూపొందించాల్సి ఉంటుంది. అలా రూపొందించడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఈ ఏడాది జూన్ నాటికి ఆచార్యుల పోస్టుల భర్తీ పూర్తి కావడానికి అవకాశం లేదు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం...

ఇప్పటి వరకు యూనివర్సిటీ యూనిట్‌గా అధ్యాపక పోస్టులకు రిజర్వేషన్లను అమలు చేసేవారు. ఇకపై యూనివర్సిటీ యూనిట్‌గా కాకుండా కేవలం డిపార్ట్‌మెంట్ వారీగా రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. యూనివర్సిటీ వారీగా జరిపే అధ్యాపక నియామకాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి రిజర్వేషన్లను అమలు చేయడానికి వీలవుతుంది. అలా కాకుండా డిపార్ట్‌మెంట్‌ను యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరగనుంది. ఇప్పటి వరకు జరిగే నియామకాల్లో యూనివర్సిటీని యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లను అమలు చేస్తున్నారు. అలా చేయడం వలన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారు తగిన విధంగా అధ్యాపక పోస్టుల్లో భర్తీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పుడు అలా కాకుండా కేవలం డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా అధ్యాపక నియామకాలకు రిజర్వేషన్లను అమలు చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిర్ణయించింది. 2017 ఏప్రిల్‌లో అలహాబాద్ హైకోర్టు తీర్పు నేపథ్యంలో యుజిసి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధనలను అమలు జరిపితే యూనివర్సిటీల్లో జరిగే అధ్యాపకుల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. ఉదాహరణకు ఒక యూనివర్సిటీలో మొత్తం 100 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉంటే వాటి నియామకాల్లో యూనివర్సిటీ యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లను అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరుగుతుంది. అలా కాకుండా డిపార్ట్‌మెంట్ యూనిట్‌గా తీసుకుంటే ఒక్కో డిపార్ట్‌మెంట్‌లో పోస్టులు 10లోపే ఉంటాయి. వాటిలో రిజర్వేషన్ల అమలు చేయాల్సి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్నింటికి వచ్చే అవకాశం ఉండదు.

1061 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అంగీకారం

రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో కలిపి 1061 అధ్యాపక పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి యూనివర్సిటీల వారీగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా నిర్ణయించారు. ఆచార్య పోస్టుల భర్తీకి సంబంధించిన మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం జారీ చేసింది. త్వరలోనే యూనివర్సిటీలు ఎగ్జిక్యూటివ్ కమిటీల సమావేశాలను ఏర్పాటు చేసుకుని నోటిఫికేషన్ ఇవ్వడానికి యూనివర్సిటీలు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఈ నేపథ్యంలో యుజిసి కొత్త నిబంధనలను రూపొందించడంతో భర్తీ ప్రక్రియ తిరిగి మొదటికొచ్చింది. యుజిసి స్పష్టత ఇచ్చి, తరువాత యూనివర్సిటీలు డిపార్ట్‌మెంట్ల వారీగా రోస్టర్ పాయింట్లు, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు నిర్ణయించిన తరువాతనే భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

మాజీ సైనిక కుటుంబాలకు టీచర్ల విరాళం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ సైనికుల కుటుంబాలకు రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు తమ ఒక రోజు మూలవేతనం విరాళంగా ఇచ్చాయి. ది జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (జాక్టో) తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఎ), తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీటీజేఏసి), తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్)లకు చెందిన సభ్యుల ఒక రోజు మూలవేతనాలు స్వీకరించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.ఈ మేరకు వారి వేతనాల చెల్లింపులో మినహాయిస్తున్నట్లు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను సైనిక సంక్షేమ నిధి, సైనికుల కుటుంబాలకు వినియోగిస్తారు.

హైదరాబాద్‌లో ప్రారంభమైన ఉమెన్ సర్జన్స్ సమ్మిట్-18

● ఆప్తమాలజిస్టులకు అవగాహనా సదస్సు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు హోటల్‌లో ఆప్తమాలజిస్టుల జాతీయ సమ్మిట్-2018 ప్రారంభమయింది. సమ్మిట్‌ను ఎవరెస్టును అధిరోహించిన దివ్యాంగురాలు అరుణిమా సిన్హా శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ఆప్తమాలజిస్టులు పాల్గొన్నారు. ఉమెన్ సర్జన్స్ సమ్మిట్‌లో డాక్టర్ శ్రీలక్ష్మి నిమ్మగడ్డ, డాక్టర్ మోహిత శర్మ, డాక్టర్ నివేదిత నారాయణన్, డాక్టర్ నమ్రత శర్మ, డాక్టర్ సుజాతా మోహన్, డాక్టర్ నీతా షా తదితరులు పాల్గొన్నారు. విన్ విజన్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ శ్రీలక్ష్మి నిమ్మగడ్డ మాట్లాడుతూ ఆప్తమాలజిస్టుల్లో సుమారు 40 శాతం మంది మహిళలే ఉన్నారన్నారు. వీరిలో చాలా మంది తమ పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదని, కొందరైతే ప్రాక్టీస్ చేయడమే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ఆప్తమాలజిస్టులందరికీ అత్యాధునిక ధోరణులు, ప్రొఫెషనల్‌గా ఉన్నటువంటి అవకాశాలను తెలిపేందుకే సమ్మిట్‌ను నిర్వహించినట్టు తెలిపారు.

చేయి కోల్పోయిన కార్మికునికి వేతనం

● హైకోర్టుకు నివేదించిన విద్యుత్ సంస్థ


హైదరాబాద్, ఆంధ్రప్రభ : విద్యుత్ ప్రమాదంలో కుడి చేయిని కోల్పోయిన ఓ కార్మికునికి కార్యాలయ సహాయకుని ఉద్యోగానికి గాను నెలకు రూ.12 వేలు వేతనంగా ఇవ్వనున్నట్లు టీఎస్ ఎస్పీడీసీఎల్ అధికారులు హైకోర్టుకు నివేదించారు. రూ. 5వేల నుంచి రూ.12 వేలకు పెంచడంపై ఆ కార్మికుడు సంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో అధికారులపై దాఖలైన కోర్టు ధిక్కరణ వ్యాజ్యంపై విచారణను మూసి వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ తో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. నాగర్ కర్నూలు జిల్లా, రాచూరు గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వర్లు 2011లో ఓ గుత్తేదారు కింద కార్మికునిగా పని చేస్తూ విద్యుత్ ప్రమాదానికి గురై తన కుడి చేయిను కోల్పాయారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం ..పిటిషనర్ విద్యార్హతల ఆధారంగా మానవతా దృక్పథంతో తాత్కాలిక ఉద్యోగం ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దీనితో పాటు అధికారులు ఇస్తామన్న రూ.లక్ష ఎక్స్ గ్రేషియాను అంగీకరించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అయితే ఆ కార్మికునికి ఉద్యోగం కల్పించే విషయంలో అధికారులు వెనుకంజ వేయడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీంతో ఆఫీసు సబార్డినేట్‌గా నియమించి, నెలకు రూ.5 వేల వేతనంగా నిర్ణయించినట్లు విద్యుత్ పంపిణీ సంస్థ తరపు న్యాయ వాది కోర్టుకు వివరించారు .కేవలం రూ.5వేలు వేతనంగా నిర్ణయించడంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. రూ.5వేలతో కార్మికుని కుటుంబం ఎలా జీవిస్తుందని నిలదీసింది. దీంతో ఆ కార్మికునికి రూ.12 వేలు వేతనంగా చెల్లిస్తామని అధికారులు కోర్టుకు వివరాలిచ్చారు.

బొజ్జ రాములు మృతికి బాబు సంతాపం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జనగాం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ తండ్రి రాములు మృతిపట్ల ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం తెలిపారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖరరెడ్డి తదితరులు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తమ సానుభూతి వ్యక్తంచేశారు. రాములు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ఏప్రిల్ 6, 7 తేదీల్లో పౌరహక్కుల మహాసభలు

● పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులను రాజ్యమే అమలు చేయకుండా పౌర ప్రజాస్వామిక హక్కులపై అణచివేత బలీయంగా కొనసాగుతోందని, ఈ నేపథ్యంలో పౌర, ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం అన్నారు. ఏప్రిల్ 7,8వ తేదీలలో తెలంగాణ పౌర హక్కుల సంఘం ప్రథమ మహా సభలు ఇక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నాయి. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను స్థానిక ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. 80వ దశకంలోని ఆట-మాట-పాట బంద్‌ను తెలంగాణ ప్రభుత్వం పునరావృతం చేస్తోందని, మొద్దుగుట్ట (శృతి, సాగర్), ఎన్‌కౌంటర్ నుండి మేడ మదుగు(టేకులపల్లి) ఎన్‌కౌంటర్ వరకు ప్రభుత్వ హంతక సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయని ఆరోపించారు. 2015 డిసెంబర్‌లో గుంటూరులో జరిగిన పౌర హక్కుల సంఘం 17వ ఉమ్మడి రాష్ట్ర మహాసభల్లో పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీగా విస్తరించిందని తెలిపారు. నేడు ఉమ్మడి రాష్ట్ర పౌర హక్కుల సంఘం 18వ మహాసభలను జరుపుకుంటోందన్నారు. ప్రభుత్వ హింసలో హక్కుల నేతలు గోపి రాజన్న, డాక్టర్ రామనాథం, తదితరులు ప్రాణాలు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో అరుంధతీరాయ్, ప్రొఫెసర్, నందిని సుందర్, ఆనంద్ తేల్ తుంబై, ప్రొఫెసర్ శేషయ్య, ప్రొఫెసర్ హరగోపాల్, ఎస్.నారాయణరావు, వి.రఘునాథ్ పాల్గొంటున్నారన్నారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

పాఠశాల విద్యపై నీతి అయోగ్ ప్రాజెక్ట్



న్యూఢిల్లీ: పాఠశాల విద్యలో వ్యవస్థీకృత రూపాంతీకరణకు జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలతో కలసి నాంది పలుకుతున్నట్టు నీతి అయోగ్ పేర్కొంది. ఈ మేరకు శనివారం ట్వీట్ చేసింది. విద్యలో మానవ మూలధన రూపాంతీకరణ కోసం ఒక నిలకడైన కార్యక్ర మం(ఎస్ఎటిహెచ్-ఇ)కు నీ తి అయోగ్ ఒక సమగ్రమైన మార్గ సూచీ, పూర్తి కాలవ్యవధిని నీతి అయోగ్ విడుదల చే స్తుందని ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. 2018 నుంచి 2020 మధ్య కాలంలో అమలయ్యే మార్గ సూచీని పాఠశాల విద్యలో ఆదర్శనీయ రాష్ట్రాలుగా అవతరించడం లక్ష్యంగా జార్ఖండ్, మధ్య ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు అనుసరిస్తాయి. నీతి అయోగ్ చేపట్టిన ఎస్ఎటిహెచ్-ఇ ప్రాజెక్టు దేశ వ్యాప్తంగా వ యోజన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధ్యాయ శిక్షణ, తరగతి గదులలో సాంకేతికతను ప్రవేశపెట్టడాన్ని ప్రోత్సహిస్తుంది. డ్రాపవుట్లపై ప్రత్యేక దృష్టి పెడుతూ అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టు పనిచేస్తుంది.



మద్దతు ధరపై దిగులు వద్దు

- రైతు సంక్షేమానికి నమూనా చట్టాలు
- రాష్ట్రాలు అమలు చేయాలి
- కృషి ఉన్నతి మేళాలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: పంటల ఉత్పాదక వ్యయానికి ఒకటిన్నర రె ట్లు ఉండేలా కనీస మద్దతు ధర(ఎంఎస్పి) పై బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయంపై గందరగోళం సృష్టిస్తున్నారని ప్రధా ని నరేంద్ర మోడీ విపక్షాలను పరోక్షంగా విమర్శించారు. ఎంఎస్పిని నిర్ధారించేటప్పుడు అన్ని ప్రధానమైన ఖర్చుల ను జోడిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు నిర్ధారిత ఎంఎస్పి నుంచి లబ్ది పొందేలా కేంద్రం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలతో కార్యాచర ణకు ఉపక్రమించిందని ప్రధాని తెలిపారు.

సాగు రంగానికి సమస్యలు దూరం చేస్తాం

కేంద్రం రైతుల సంక్షేమం కోసం అనేక నమూనా చట్టా లను తీసుకువచ్చిందని తెలిపారు. వాటిని అమలు చేయా లని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. రైతులు తాజా విత్తనాలు, అవసరమైనంత విద్యుత్తు పొందడంలో, మార్కెట్ సౌలభ్యాన్ని పొందడంలో ఎలాంటి సమస్య లే కుండా వారి పంటకు సరైన ధర దక్కించుకోవ డానికి అవస రమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపడుతున్నది అని మోడీ వివరించారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కూడా మేళాను ఉద్దేశించి ప్రసంగించారు.

రైతుల కష్టానికి అధిక ఆదాయం

పంట దిగుబడికి అయ్యే ఖర్చులో కూలీలకు కిరాయి, వారి(రైతులు) సొం త లేదా అద్దెకు తీసుకున్న యంత్రా లతో పాటుగా పశుగణానికి అయ్యే ఖర్చులు, విత్తనాలు, ఎరువుల కుఅ య్యే ఖర్చు, సాగునీ టిపై వ్యయం, ప్రభుత్వానికి సమ కూర్చే ఆదా యం, ని ర్వ వాణ మూలధనం పై వడ్డీ, భూమికి చెల్లించే కౌలు, తదితరా లు ఉంటా యని న రేంద్ర మోడీ వివరిం చా రు. అందులో రై తు లు, వారి కుటుంబాల కాయ కష్టం కూడా ఉంటుం ది. ఇది ఆరు గాలం కష్టించే రైతుల ఆదా యానికి సంబంధిం చిన ఒక ముఖ్యమైన నిర్ణయం అని అన్నారు.

ప్రధాని నరేం ద్ర మోడీ శనివారమిక్కడ ప్రారంభమైన మూడు రోజుల కృషి ఉన్నతి మేళా- 2018ని ఉద్దేశించి ప్రసంగిస్తూ పంట వ్యర్థాలను తగులబెట్ట వద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. తద్వారా కాలుష్యాన్ని అరికట్టాలని సూచించారు. నూనె గింజల దిగుబ డిని వృద్ధి చేయడం ద్వారా వంట నూనె దిగుబడిపై ఆధారపడ టాన్ని తగ్గించాలని కోరారు.

యూరియా వాడకాన్ని సగానికి సగం తగ్గించాలి

యూరియా వినియోగాన్ని 2022 నాటికి కనీసం సగానికి సగం తగ్గించాలని సైతం రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు వారి పంటకు సరైన ధరలు దక్కే లా ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో ఒక నిర్ణయం తీసు కుందని పునరుద్ఘాటించారు.

అదనపు ఆదాయానికి మోడీ మార్గాలు

రైతులు అదనపు ఆదాయం కోసం తేనెటీ గల పెంపకం, సౌర విద్యుత్‌తో సాగుబడి, సేంద్రీ య వ్య వసాయం, వెదురు సేద్యం, జీవ వ్యర్థాల నిర్వ్హణ సా గించాలని మోడీ విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ యంత్రాల వినియోగంతో పంట వ్యర్థాలను తగులబెట్టడాన్ని ఆపి వేయాలని రైతులకు సూచించారు.

సాగు సవాళ్ళను అధిగమిద్దాం

వ్యవసాయ రంగానికి అనేక సవాళ్ళతో రైతుల ఆదాయం దెబ్బ తింటున్నదని ప్రధాని అన్నారు. ప్రభుత్వం ఈ సవాళ్ళను అ ధిగమిం చడానికి ఒక సమగ్రమైన మార్గంపై పనిచేస్తున్నదని తెలి పారు. అలా గే 2022 నాటికి రైతుల ఆదాయం రెండింతలు చేసి, వారి జీవనాన్ని సులభతరం చేయడానికి కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.



జైవిక్ ఖేతి.. అన్నదాతకు భారీగా లబ్ది

ఈ సందర్భంగా ప్రధాని సేంద్రియ ఉత్పత్తులకు ఉద్దేశించిన ఇ-మార్కెటింగ్ పోర్టల్ జైవిక్ ఖేతిని కూడా ప్రారంభించారు. ఈ వేదిక వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణ లో ఒక కొత్త అధ్యాయం అని వర్ణించారు. దీనివలన రైతుల కు భారీగా లబ్ది చేకూరుతుందని భరోసా ఇచ్చారు. ప్రభు త్వం ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించే నిమిత్తం భూసార పరీక్ష కార్డు, వేప నూనె పూతతో కూడిన యూరియా లాంటి చర్యలను చేపట్టింది. అంతేకాక అపరిష్కృతంగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి రూ.80,000 కోట్లు కేటాయించింది.



కృషి విజ్ఞాన కేంద్రాలకు శంకుస్థాపన

ప్రధాని ఈ సందర్భంగా 25 కృషి విజ్ఞాన కేంద్రా లకు శంకుస్థాపన చేశారు. దీంతో దేశంలో వాటి మొత్తం సంఖ్య700కు చేరుకుంది. ఆయన కృషి కర్మ న్ పు రస్కారం, పండిత దీన్‌ద యాళ్ ఉపాధ్యాయ కృషి పురస్కా రా న్ని ప్రదానం చేశారు. ఈ మేళాలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు, పలు సంస్థలు 800కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశాయి.రైతుల ఆదా యం పెంపు దలకు ఉపకరించే సూక్ష్మ నీటి పారుదల, వేప పూత యూరియా, భూసా ర పరీక్ష కార్డు, ఎరువు ల సమర్థ వినియో గంతో ఇన్ పుట్ ఖర్చుల తగ్గింపు, పంట బీమా పథకం సమ ర్థత, ఆదాయాన్ని సమకూ ర్చే పశుగణాభివృద్ధి, తేనెటీగల పెం పకం, కోళ్ళ పెంప కం లాంటి ఇతి వృత్తాలతో కూడిన ప్రదర్శ న శాలలను మేళాలో ఏర్పాటు చేశారు.

ఎయిర్‌టెల్ ఖాతాలోకి 15 లక్షల సబ్‌స్క్రైబర్లు

చెన్నై : ఎయిర్‌సె ల్‌కు చెందిన సుమారు 15 లక్షల కంటే ఎక్కువ మంది కస్టమర్ల కు తమ నెట్‌వర్క్‌లో చేరారని టెలికం దిగ్గజం భారతి ఎయిర్ టెల్ శుక్రవారం నాడు ప్రకటించిం ది. దీంతో తమిళనాడు మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య రెండు కోట్లకు చేరిందని తెలిపింది. మొత్తానికి చూస్తే నెంబర్ పోర్ట్‌బిలిటి ప్రకారం చూస్తే 50 శాతం వరకు భారతీఎయిర్‌టెల్‌కు కస్టమర్లు మారారని భారతి ఎయిర్‌టెల్ హబ్ సీఈవో తమిళనాడు, కేరళ మనోజ్ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌సెల్ కస్టమర్ల కు చాలా మంది ఎయిర్‌టెల్‌ను ఎంపిక చేసుకోవడం సంతోషంగా ఉందని ఆయన వ్యాఖ్యానిచారు. వచ్చిన కస్టమర్లకు స్వాగతం పలుకుతున్నామని.. వారికి ప్రపంచస్థాయి సేవలందిస్తాని ఆయన అన్నారు.

ఆన్‌లైన్‌లో ఆధార్... బీ కేర్‌ఫుల్

న్యూఢిల్లీ: ఇంటర్నెట్‌పై సేవల కోసం ఆధార్ లాంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను యుఐడిఎఐ హెచ్చరించింది. గూగుల్ సెర్చ్‌లో మేరా ఆధార్, మేరీ పెహ్‌చాన్ అని కొడితే ఆధార్ పిడిఎఫ్ అందుబాటులోకి వస్తుందంటూ వస్తున్న వార్తలను ఒక ప్రకటనలో తోసిపుచ్చింది. వాటితో ఆధార్, ఆధార్ డేటాబేస్‌కు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసింది. కొందరు నీతి, నియమాలు లేని వ్యక్తులు ఆధార్ కార్డులను ప్రచురించడం లేదా పోస్ట్ చేసినంత మాత్రాన యుఐడిఎఐ, ఆధార్ భద్రతకు ఏమీ కాదని తెలిపింది. ఇతర గుర్తింపు పత్రాల తరహాలోనే ఆధార్ ఎలాంటి ఆంతరింగక పత్రం కాదని స్పష్టం చెసింది. ఎవరైనా అనధికారికంగా ఒకరి ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, బ్యాంక్ ఖాతా, ఫొటో తదితర వ్యక్తిగత సమాచారాన్ని ప్రచురించిన పక్షంలో అలాంటి వారిపై తన గోప్యత హక్కుకు భంగం వాటిల్లదంటూ సదరు వ్యక్తి పరువు నష్టం దావా వేయవచ్చని యుఐడిఎఐ వెల్లడించింది.



'పన్ను'తో తేడాలొస్తున్నాయ్!

- భారత్‌తో వాణిజ్యం అత్యంత సంక్లిష్టం
- పరస్పర వాణిజ్యం ఉభయ తారకం
- మోటారు సైకిళ్ళపై సుంకం ఇబ్బందికరం
- ట్రంప్ వ్యాఖ్యలకు శ్వేతసౌధం ఊతం



వాషింగ్టన్: భారత్‌తో అమెరికా అత్యంత పటిష్టమైన బం ధాలను పంచుకుంటున్నదని శ్వేత సౌధం పేర్కొంది. ఆ దేశంతో స్వేచ్ఛాయు త, సముచిత, పరస్పర వాణిజ్యానికి అనుకూ లంగా ఉందని శ్వేత సౌధం అధికారి ఒకరు తెలిపారు. అయితే ఇరుదేశాల మధ్య అనుబం ధంలో ఒకటైన ద్వైపాక్షిక వాణిజ్యం అత్యంత సం క్లిష్టమైన అనుభవాన్ని మిగిల్చింద ని వెల్లడించారు. భారత్ దిగు మతి చేసుకుంటు న్న అమెరికన్ మోటార్ సైకిళ్ళపై దిగుమతి సుంకం కేవలం నెల రోజుల వ్యవధిలో కనీసం మూడింతలు పెరిగిన వైనాన్ని అమెరికా అధ్య క్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల బాహటంగా ప్రస్తావించారు. భారతీయ దిగుమతులపై పరస్పర సుంకం విధిసామని బెదిరించారు. సంబంధాలపై ఇరు ప క్షాలు ఒక పటిష్టమైన నిబద్ధతను కలిగి ఉన్నాయి. కానీ ద్వైపాక్షిక వాణిజ్యం మాత్రం అత్యంత సంక్లిష్టం గా మారిందని సదరు అధికారి మీడియాతో అన్నా రు. పేరు వెల్లడికి అధికారి నిరాకరించారు. భారత్ సహా దక్షిణాసి యాతో అమెరికా సంబంధాలకు సంబంధించి పలు అంశా లపై స్పష్టత ఇచ్చారు. భా రత్‌తో వాణిజ్య లోటుపై ఆందోళనలు నెలకొన్నా యని చెప్పారు. కానీ అమెరికా ఇంధన రంగానికి సంబంధించి భారత్ చేసుకున్న దిగుమతులతో ఇటీవల అది కాస్త తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ఈ ప్రభుత్వం(అమెరికా ప్రభుత్వం) భారత్‌తో ఒక స్వేచ్ఛాయుత, పారదర్శక వాణిజ్యం కోసం చూస్తున్నది. హార్లీ డేవిడ్‌సన్ మోటార్ సైకిళ్ళు లాంటి వాటిపై సుంకాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆశిస్తున్నదని అధికారి చెప్పారు. భారత్‌తో వాణిజ్య పెట్టుబడి పెంపుదలకు అవకాశాల శోధనకు అమెరికా కృత నిశ్చయంతో ఉన్నదని తెలిపారు. అదే సమయంలో వాణిజ్య అంశాలపై కొంతవరకు పరస్పర లావాదేవీలను ఆశిస్తున్నదని చెప్పారు. అమెరికాకు దిగుమతి అవుతున్న భారతీయ మోటారు సైకిళ్ళపై ఎలాంటి సుంకాలు విధించడంలేదని ఆయన తెలిపారు. ఆ క్రమంలో భారత్‌తో ఒక సముచితమైన పరస్పర వాణిజ్యం నెరపడానికి తాను చూస్తున్నట్టు అధ్యక్షుడు స్పష్టం చేశారని శ్వేత సౌధం అధికారి చెప్పారు.





నోవార్టిస్ ఎండీ జావెద్ రాజీనామా

న్యూఢిల్లీ: నోవార్టిస్ ఇండియా వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జావేద్ జియా పదవుల నుంచి వైదొలగాలని నిర్ణయిం చుకున్నట్టు కంపెనీ తెలిపింది. మే 31వ తేదీన వైస్ ఛైర్మన్, ఎండీ పదవుల నుంచి వైదొలగాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని జావేద్ జియా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు తెలియప రిచారని నోవార్టిస్ ఇండియాకంపెనీ బిఎస్ ఇకి సమాచారం అం దించింది. కంపెనీ వైస్ ఛైర్మన్, ఎండీ పదవికి అర్హమైన వారిని గుర్తించి సిఫార్సు చేయాల్సిందిగా నియా మకం, వేతన కమిటీని బో ర్డు కోరినట్టు తె లిపింది. ఔషధ వా ణిజ్యానికి చెందిన నోవార్టిస్ ఇండియా లిమిటెడ్ భారత్‌లో బోన్ అండ్ పెయిన్, కాల్షియం పోర్ట్‌ఫోలియా, గై నకాలజీ, న్యూరో సైన్స్‌పై దృష్టి కేంద్రీక రించింది. అలాగే కంపెనీకి చెందిన జెనరిక్ బిజినెస్ గైనకాలజీ, యాంటీ - టిబి, యాంటీ-ఇన్‌ఫెక్టివ్స్ నడుస్తున్న ది.

ఇంటింటికీ వంటగ్యాస్

- మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో ఇంటింటికి వంటగ్యాస్ ప్రభుత్వ లక్ష్యం అని ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్ వెల్లడించారు. వంట గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఉండకూడదనేదే ప్రభుత్వ ఉద్దేశం అని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వంట గ్యాస్ కనెక్షన్ మంజూరు చేసే ప్రక్రియను ఈ సంవత్సరాంతానికి పూర్తి చేస్తామని వెల్లడించా రు. గ్రామీణ మహిళలు వంట గ్యాస్ కనెక్షన్ తీసుకొనేందుకు ముందుకు రావాలని కోరారు. తెలంగాణ ఎల్‌పిజీ డిస్ట్రిబ్యూటర్స్ మీట్ 2018ను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడారు. దీపం కనెక్షన్ కింద పేదమహిళలకు వంట గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేయడానికి మొదటి బడ్జెట్‌లోనే రూ. 150 కోట్లు కేటాయించామన్నారు. అడిగిన వారందరికీ కనెక్షన్‌లు మంజూరు చేశామన్నారు. రాష్ట్రానికి 10 లక్షల గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరితే అడిగిన మేరకు వంట గ్యాస్ కనెక్షన్‌లను మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కుటుంబాల కంటే కూడా వంట గ్యాస్ కనెక్షన్‌లు అధికంగా ఉన్నాయని , కొత్త వారు వంట గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేయాలని దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. వంట గ్యాస్ సరఫరాలో కొరత లేదు, పంపంణీలో అంతరాయం లేదు అందుకే అందరికీ వంట గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేయాలనే ఆలోచనతో ఉన్నామని మంత్రి వివరించారు. డిస్ట్రిబ్యూటర్లు నిజాయితీతో వ్యాపారం చేయాలని ఈ సందర్భంగా హితవు పలికారు. ప్రత్యక్ష లబ్ది పథకం అమలులోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్ అక్రమాలు తగ్గాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో సిలిండర్లను తక్కువ బరువుతో సరఫరా చేస్తున్నట్టుగా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇలాంటి అక్రమాలను సహించబోమన్నారు. గ్రామీణ వంటగ్యాస్ వినియోగదారులకు సక్రమంగా, సకాలంలో సిలిండర్లను సరఫరా చేయాలని కోరారు. డిస్ట్రిబ్యూటర్ల సమస్యలను సానుభూతితో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంటు సభ్యులు పసునూరి దయాకర్ మాట్లాడుతూ చిన్న డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. డెలివరీబాయ్స్ చేసే తప్పులకు డీలర్లపై కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ఎల్‌పిజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లతో పాటు పలువురు డిస్ట్రిబ్యూటర్లు సమావేశంలో పాల్గొన్నారు.



వలస వస్త్ర పరిశ్రమలకు
కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో స్థలాలు

- ఎంసీపీసీడీ పథకం కింద పవర్‌లూమ్ క్లస్టర్లు
- టీఎస్-ఐఐసీ ఛైర్మన్ బాలమల్లు
- సూరత్ పవర్‌లూమ్ యజమానులతో సమావేశం




హైదరాబాద్, ఆంధ్రప్రభ : టెక్స్‌టైల్ రంగా నికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పెద్దపీట వేస్తున్నందున ఇతర రాష్ట్రాలకు వలస వెళ్ళిన తెలంగాణ వస్త్ర పరిశ్రమల యజమానులు సొంత రాష్ట్రానికి తిరిగి రావాలని టిఎస్-ఐఐసి ఛైర్మన్ గ్యాదరి బాలమల్లు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కును, సిరిసిల్ల అపెరల్ పార్కును పెద్దఎతున అభివృద్ధి చేస్తున్నామ ని ఆయన చెప్పారు. సూరత్, షోలాపూర్, బీవండి ఇతర ప్రాంతాల నుంచి వెనక్కివచ్చి సొంత రా ష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసుకునే వారికి కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కులో స్థలాలను కేటాయిస్తామని ఆయన చెప్పారు. తెలంగాణ నుంచి వలస వెళ్ళిన సూరత్ వస్త్ర పరిశ్రమల య జమానులు బాలమల్లును కలిసి వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి మహబూబాబాద్‌లో 200 ఎకరాల స్థలం ఇప్పించాలని శనివారం వినతిపత్రం సమర్పించారు. సూరత్‌కు వలస వెళ్ళిన తాము 550 మంది సభ్యులతో ఇక్కడ వీరభద్రస్వామి టెక్స్‌టైల్స్ మ్యానుఫ్యాకర్చర్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నామని మాడిఫైడ్ కాంప్రెన్సివ్ పవర్‌లూమ్ క్లస్టర్ డవలప్‌మెంట్ స్కిమ్ కింద టెక్స్‌టైల్స్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనువుతులు, స్పెషల్ ప్యాకేజీ మంజూరయ్యేలా చూడాలని ప్రాజెక్టు రిపోర్టును బాలమల్లుకు అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించి తగు చర్య లు తీసుకోవాలని టిఎస్-ఐఐసి జీఎం విఠల్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో వీరభద్రస్వామి టెక్స్‌టైల్స్ మ్యానుఫ్యాక్చర్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వీరన్న, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నా రు.వస్త్ర పరిశ్రమకు పూర్వవైభ వం తెచ్చేందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారని బాలమల్లు తెలిపారు. వరంగల్ లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు తొలిదశలో 1200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్కులో నూలిపోగు నుంచి రెడిమేడ్ వస్త్రాల దాకా ఉత్పత్తి చేయడం జరుగుతుం దన్నారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, ఈ రంగంలో రాష్ట్రానికి భారీఎత్తున వస్తున్న పెట్టుబడులను దృష్టిలో ఉంచుకొని టెక్స్‌టైల్స్ పార్కు విస్తరణకు మరో వెయ్యి ఎకరాలను సేకరించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని వెల్లడించారు. సిరిసిల్లలో అపెరల్ పార్కును 148 ఎకరాల్లో అభివృద్ధి చేసి వస్త్ర పరిశ్రమల యూనిట్లకు కేటాయిస్తామన్నా రు. డిమాండ్‌ను బట్టి ఇతర ప్రాంతాల్లోనూ టెక్స్‌టైల్స్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రూపొందించామని, ఇవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని బాలమల్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఈ రంగంలోని తెలంగాణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేం దుకు భారీఎత్తున టెక్స్‌టైల్స్ పార్కును, చిన్నతరహా టెక్స్‌టైల్ క్లస్టర్ ఏర్పాటు చేస్తోందన్నారు. రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమల యజమానులకు స్థలాలతో పాటు పారిశ్రామిక సబ్సిడీలు, ప్రోత్సాహకాలను ప్రభుత్వం నుంచి అందేలా చూస్తామని బాలమల్లు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంతో నైపుణ్యత కలిగిన వస్త్ర పరిశ్రమల యజమానులు, కార్మికులు తిరిగి సొంత రాష్ట్రానికి తిరిగి రావలన్నది సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ లక్ష్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాలకు వలస వెళ్ళిన వస్త్ర పరిశ్రమల యజమానులు తమ సొంత రాష్ట్రానికి తిరిగివచ్చి వస్త్ర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు సూరత్ వస్త్ర పరిశ్రమ యజమానుల సంఘాలు, సొసైటీల నాయకులు చొరవ తీసుకోవాలని బాలమల్లు కోరారు.

ఆర్థిక వ్యవస్థలో లోపమే పీఎన్‌బీ స్కాం

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో చోటు చేసుకొన్న రూ. 13వేల కోట్ల స్కాం దేశాన్ని కుదిపేస్తే.. ఈ స్కాంను ప్రపంచబ్యాంకు తేలికగా కొట్టి పారేసింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థలో లోపమని తేల్చి పారేసింది. దీనికి వ్యతిరేకంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) మాత్రం వ్యవస్థలో సమూల మార్పు లు తీసుకొచ్చి భవిష్యత్తులో ఇలాంటి కుంభకోణాలు జరగకుండా నివారించు కోవాలని సూచించింది.

స్కాంలు జరిగినప్పుడు దానిపై లోతుగా పరిశీలన జరపా ల్సిన అవసరం ఎంతైనా ఉందని నియంత్రణాసంస్థలు విఫలం అయ్యాయని, బ్యాంకింగ్ వ్యవస్థలో లోపాలు కాదని ఖచ్చితంగాచెప్పుకోవచ్చు నని, మొత్తానికి వ్యవస్థలో లోపాల వల్ల స్కాం జరిగిందని ప్రపంచబ్యాంకు భారత్ డైరెక్టర్ జునైడ్ కమాల్ అహ్మద్ శుక్రవారం నాడు చెప్పారు. ఆయన ఇక్కడ జరుగుతున్న లాజిస్టిక్ సదస్సులో మాట్లాడుతూ.. ఒక్క స్కాం వల్ల వ్యవస్థలో లోపాలున్నాయని కూడా చెప్పలేమన్నారు.

అవసరమైతే...సైన్యం బోర్డర్ దాటుతుంది



న్యూఢిల్లీ: దేశరక్షణ కోసం భారత సైన్యం అవసరమైతే నియంత్రణరేఖ దాటి పోరాడి తమ సత్తా చాటుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. జమ్ముకాశ్మీర్ భారత్‌లోని అంతర్భాగం అన్నారు. కాశ్మీర్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రధాని మోదీ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని, కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం ఎవరితోనైనా చర్చించేందుకు ప్రధాని సిద్ధంగా ఉన్నారన్నారు. దేశ రక్షణ కోసం అవసరమైతే సరిహద్దు దాటి పోరాడేందుకు వెనుకాడమన్నారు. పాకిస్థాన్‌తో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేందుకు సుముఖంగానే ఉన్నా ఆ దేశం మాత్రం శాంతి మార్గంపై ఆసక్తి చూపటంలేదన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాది, ముంబై వరుస పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయిద్‌ను పాకిస్థాన్ రాజకీయవేత్తగా గుర్తించటం చూస్తే ఉగ్రవాదంపై ఆ దేశం ఎంతగా ఆధారపడుతుందో తేటతెల్లమవుతుందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రధాని మోదీ చేస్తున్న పోరాటానికి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు లభించిందన్నారు. కాగా గత సెప్టెంబర్ 2016లో భారత సైన్యం జమ్ము కాశ్మీర్లోని నియంత్రణ రేఖ దాటి సరిహద్దు వెంబడి ఉన్న ఉగ్రవాద శిబిరాలుపై మెరుపు దాడి చేసి వాటిని ధ్వంసం చేసిన సంగతి విదితమే.


హార్వర్డ్ లైబ్రరీలో శ్రీవారి పుస్తకాలు

హైదరాబాద్: ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరునిపై రచించిన 10 పుస్తకాలును అమెరికాలోని హార్వర్డ్ లైబ్రరీలో ఉంచారు. శ్రీవారిపై రచించిన ఇన్ని తెలుగు పుస్తకాలును ఈ లైబ్రరీలో ఉంచడం ఇదే ప్రథమం. విశ్వపతి అనే కలం పేరుతో ప్రసిద్ధులైన టీవీఆర్‌కే మూర్తి ఇప్పటివరకూ 25 ఆధ్యాత్మిక పుస్తకాలు రచించారు. ఈ సందర్భంగా విశ్వపతి మూర్తి మాట్లాడుతూ స్వామివారిపై తాను రాసిన పుస్తకాలును అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హార్వర్డ్ లైబ్రరీలో ఉంచడం తనకెంతో ఆనందం కలిగించిందన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో శ్రీవారిపై రాసిన పుస్తకాలును శాశ్వతంగా భద్రపరచడం వలన ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆ శ్రీనివాసుని భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్వతహాగా ఇంజినీర్ అయిన విశ్వపతి 1984నుంచి 1990వరకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కార్టూన్లు వేశారు. 1998 నుంచి లోగో డిజైన్‌రంగంలో విస్తృతంగా సేవలు అందిస్తున్నారు. తాజాగా హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో విశ్వపతి రచించిన శ్రీవారి దర్శన్, శ్రీ వేంకటేశ్వర దర్శనం, శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం, శ్రీ వేంకటేశ్వర వైభవం, శ్రీ వేంకటాద్రి వైభవం, మహాలక్ష్మి మహాత్మ్యం, గోవింద పథం తదితర పుస్తకాలు హార్వర్డ్ విద్యాలయంలో ఉంచిన సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు రచయిత విశ్వపతిని అభినందించారు.



పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తం

- యువతతో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు
- జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్



అమరావతి, ఆంధ్రప్రభ : గుంటూరులో పారిశుధ్యం వ్యవస్ద అస్తవ్యస్తం కావడం, ప్రజలప్రాణాలు పోతున్న పట్టించుకోకపోవడం పాలన వ్యవస్ద వైఫల్యానికి అద్దంపడుతోందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. శనివారం రాత్రి విజయవాడలోని పార్టీ తాత్కాలిక కార్యాలయంలో గుంటూరు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన యువతతో ఆయన భేటీ అయ్యారు.పాలనా వైఫల్యాలను పార్టీ ఎండగట ్టడమే కాకుండా ప్రజారోగ్యం,పారిశుద్యం పరిరక్షణ ,పర్యవేక్షణకు కమిటీని నియమిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. పన్నులు కట్టించుకుంటున్న ప్రభుత్వం ప్రజల కనీస అవసరమైన శుద్దమైన తాగునీరు , మెరుగైన వైద్యసేవలు కూడా అందించలేకపోతుందన్నారు. ఈ విధానంలో మార్పు తెచ్చేలా కమిటీ పని చేస్తుందని తెలిపారు. గుంటూరు నగరంలో బాధితులను చూస్తే నగరపాలక సంస్ధ ఆ ప్రాంతాలను కనీసం పట్టించుకోవడం లేదని అర్దమవుతుందన్నారు. గుంటూరుకు సంబంధించి ప్రజారోగ్యం, పారిశుధ్యం పరిరక్షణ,పర్యవేక్షణకు అడహక్ కమిటీని పవన్‌కల్యాణ్ ప్రకటించారు.

నేడు ఉద్దండరాయునిపాలెంకు జనసేనాని

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన లంక భూములకు చెందిన దళిత రైతులతో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం భేటీ కానున్నారు. సంబంధిత రైతులు శనివారం విజయవాడలోని జనసేన తాత్కాలిక పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌ను కలిశారు. రాజధాని భూసేకరణ సందర్బంగా ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం చెల్లించే విషయంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని రైతులు ఆయన ముందుంచారు. ఆదివారం ఉదయం ఉగాది పర్వదినాన ఉద్దండరాయునిపాలెం గ్రామానికి రావాలని పవన్‌కల్యాణ్‌ను దళిత రైతులు ఆహ్వానించారు. అందుకు సుముఖత వ్యక్తం చేసిన జనసేనాని ఆదివారం ఉదయం 10 గంటలకు ఆ గ్రామానికి వెళ్లేందుకు సిద్దమవుతున్నారు.

ఇసుక విధానం భేష్!

- ఏపీ ప్రభుత్వ చర్యలపై ప్రజల హర్షం
- 47 నుంచి 84 శాతానికి చేరిన సంతృప్తి స్థాయి
- ఇసుక ధరల నియంత్రణకు చేపట్టిన చర్యలు భేష్



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఇసుక మాఫియా నియంత్రణకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలపై ప్రజలనుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక దందాలు నియంత్రించ డానికి, ఇసుక సామాన్యులకు లభించేలా చేయడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపట్ల ప్ర జల్లో సంతృప్తి పెరిగింది. ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించకముందు 47 శాతం మంది ప్రజలు ఇసుక విధానం, ప్రభుత్వ చర్యలపట్ల సంతృప్తి వ్యక్తం చేస్తే ఇప్పుడు ఆ సంతృప్తి స్థాయి 84 శాతానికి పెరగడం విశేషం. ఇసుక అక్రమ రవాణ అరికట్టడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున తనిఖీలు చేయడం, వాహనాలు స్వాధీనం చేసుకోవడం, జరిమానాలు విధించడం లాంటి కఠిన చర్యలు తీసుకుంది. రియల్ టైమ్ గవర్నెన్స్ ఆధీనంలోని పరిష్కార వేదిక 1100 కాల్ సెంటర్‌కు ఇసుకపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణం యంత్రాంగం స్పందించేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా ఇసుక అక్రమ రవాణాకు చాలా వరకు అడ్డుకట్ట వేయగలిగినట్లయింది. ఇసుక మాఫియా పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న కఠిన వైఖరిపట్ల అధిక శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇసుక ధరల నియంత్రణకు దోహదపడుతున్నాయని అత్యధికశాతం ప్రజలు అభిప్రాయపడ్డారు.

రేషన్ సంతృప్తి ఆల్‌టైమ్ హై :

రాష్ట్రంలో పౌరసరఫరాల వ్యవస్థపైనా ప్రజల్లో సంతృప్తి స్థాయి గణనీయంగా పెరిగింది. రేషన్ కార్డుల జారీ, వాటి అమలు, పౌరసరఫరాల వ్యవస్థలో బయోమెట్రిక్ విధానం అమలు, సకాలంలో రేషన్ సరకులు అందించడంతోపాటు చౌక దుకాణాల్లో ఎక్కడా కూడా అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ చర్యలపై ప్రజల్లో సంతృప్తి పెరుగుతోంది. గతేడాది డిసెంబర్‌లో పౌరసరఫరాల వ్యవస్థ, రేషన్ కార్డుల నిర్వహణపై 68 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు ఏకంగా 76 శాతానికి పెరిగింది. ఇది ఆల్‌టైం హైగా అధికార వర్గాలు పరిగణిస్తున్నాయి.

ప్రభుత్వంపనితీరు భేష్ :

అన్ని రంగాల్లోనూ ప్రభుత్వం పనితీరుపైన ప్రజల్లో సంతృప్తి బాగా కనిపించింది. ప్రభుత్వ పనితీరుపట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయి 57 శాతం నుంచి 62 శాతానికి పెరిగింది. ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రియల్ టైమ్ గవర్నెన్స్ లాంటి వినూత్న వ్యవస్థలను ప్రభుత్వంలో ఏర్పాటు చేయడంతో పాటు ప్రజా సమస్యలను రియల్ టైమ్‌లో పరిష్కరించడానికి యంత్రాంగా తీసుకుంటున్న చొరవ పట్ల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమైంది. దాంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అం దించడానికి అత్యాధునిక టెక్నాలజీలను, పాలనా పద్దతులను పాటిస్తున్నారు. ఇవి ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శప్రాయంగా మారుతున్నాయి.

రియల్ టైమ్‌లో సమీక్ష:

ప్రజలకు రియల్ టైమ్‌లో సేవలు అందించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ మరింత పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని ప్రభుత్వ విభాగాలపైనా ఇకపై రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలని నిర్ణయించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ స్టేట్ కమాండ్ కేంద్రంలో రోజా ప్రభుత్వ విభాగాలపైన సమీక్ష నిర్వహించనున్నారు. ఆయా శాఖలో ఎన్ని ప్రజా సమస్యలున్నాయి, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు, సమస్యల పరిష్కారానికి అవలంభించాల్సిన పద్దతులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి ఇక్కడ అధికారులతో పరిశీలన చేయనున్నారు.

సెల్ బ్రాడ్ కాస్టింగ్ :

పెపిడుగుల సమాచారాన్ని ప్రజలకు మరింత ముందస్తుగా తీసుకెళ్లి ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా ఉండేలా చూడటానికి ప్రభుత్వం సెల్ బ్రాడ్ కాస్టింగ్ అనే నూతన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది.

ఈ టెక్నాలజీ ద్వారా పిడుగు పడే సమయాన్ని ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంతంలోని ప్ర జలను అప్రమత్తం చేస్తూ వారి మొబైల్ ఫ్లాన్లకు హెచ్చరిక సందేశాలను పంపుతుంది. హెచ్చరిక సందేశానికి ఆయా ప్రాంత ప్రజల మొబైల్ ఫోను చదివి వినిపించి వారిని అప్రమత్తం చేస్తుంది.

చెరువు మింగేసింది

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. అక్కడ పెద్దవారు ఎవరూ లేకపోవడంతో ఒకరితర్వాత ఒకరు నీటిలో పడి చనిపోయారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్లారని ఎవరిని అడిగినా సమాధానం లేకపోవడంతో రిజర్వాయర్ వద్దకు వెళ్లి చూస్తే నీటిలో ఐదుగురు చిన్నారుల శవాలు కనిపించాయి. ఆ దంపతులు రిజర్వాయర్ వద్దనే కుప్పకూలిపోయారు. తమ క ుమారులు తమ కళ్ల ముందే ఆడుకుంటూ కనిపించి ఇలా శవాలుగా మారడంతో వారు తల్లడిల్లిపోయారు. మూడు కుటుంబాలు గుడితండాకు చెందిన వారు కావడంతో ఆ తండా అంతటా విషాదచాయలు అలుముకున్నాయి. తెల్లవారితే ఆ తండాలో ఉగాది వేడుకలు చేసుకునే గంటల సమయంలోనే ఆ తండాలో విషాధచాయలు అలుముకున్నాయి.

ఆ గిరిజన కుటుంబాలు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగించేవారు కళ్ల ముందే తమ చిన్నారులు ప్రాణాలు వదలడంతో తల్లిదండ్రులు దుఖఃసాగరంలో మునిగిపోయారు. చిన్నారుల మృతదేహానికి దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో లింగ్యనాయక్, ఎస్‌హెచ్‌వో రామకృష్ణ, ఎంపిపి మేకల శ్రీనివాస్ యాదవ్ లు దేవరకొండ ఆసుపత్రికి చేరుకొన్నారు.

24 గంటలపాటు తేమగాలులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అరేబియా సముద్రం నుంచి తేమగాలులు తెలంగాణ మీదుగా వీస్తుండడంతో వాతావరణం చల్లబడిందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీంతో బంగాళాఖాతంలో ఏర్పడిన స్వల్ప అల్పపీడనం కారణంగా మరో 24 గంటలపాటు తెలంగాణ వ్యాప్తంగా అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. హైదరాబాద్‌లో ఉదయం ఉంచి అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. భానుడి ప్రతాపానికి ఇళ్ళ నుంచి బయటకు రావడానికి జంకిన జనం శుక్రవారం వాతావరణం చల్లబడడడంతో కొంతసేపు సేద తీరారు.

విదేశీ విద్యోన్నతి లబ్ధిదారులకు కౌన్సెలింగ్

అమరావతి, ఆంధ్రప్రభ : ఎన్‌టీఆర్ విదేశీ విద్యోన్నతి పథకం కింద బీసీ,ఈబీసీ లబ్దిదారులను ఎంపిక చేసే కౌన్సిలింగ్‌ప్రక్రియను శనివారం నిర్వహించినట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.ఉమాదేవి శనివారం తెలిపారు. గతంలో ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్ధులకు విజయవాడ తాడిగడపలోని సంస్ధ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకించి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 185 మంది అభ్యర్ధులు పథకానికి దరఖాస్తు చేసుకోగా 113 మంది కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని చెప్పారు. దరఖాస్తులు, ధృవపత్రాలను పరిశీలించడం జరిగిం దన్నారు.

పురుగుల మందు తాగి


తండ్రి, కూతురు ఆత్మహత్య





మహబూబాబాద్, ప్రభన్యూస్ : పురుగుల మందు సేవించి తండ్రి, కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని అనంతారం గ్రామ శివారులో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై పత్తిపాక జితేందర్, గ్రామస్థుల కథనం ప్రకారం మహబూబాబాద్ పాత బజార్‌కు చెందిన సుందనంపల్లి శివకుమార్, కూతురు కళావతి (8) ఇరువురు ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామస్థుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు శివకుమార్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుడి వేధింపులకు విద్యార్థిని బలి



మొయినాబాద్, ప్రభన్యూస్ : విద్యాబుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే కీచకుడుగా మారాడు. పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుని వేధింపులు భరించలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండల పరిధిలోని చిల్కూర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిల్కూర్ రెవెన్యూలో గల శివసాయి ఇంటర్నేషనల్ పాఠశాలలో మెదక్ జిల్లా, నర్సాపూర్ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. తొమ్మిదవ తరగతి చదువుతున్న తేజశ్విని(15) ప్రేమిస్తున్నానని ప్రశాంత్ కొంతకాలంగా వేధిస్తున్నాడని , గత మూడు రోజులు క్రితం కొత్త మోబైల్ ఫోన్ ఇచ్చేందుకు ప్రశాంత్ యత్నించాడు. ఫోన్ తీసుకునేందుకు తేజశ్విని తిరస్కరించిందని తద్వారా వేధింపులు అధికమవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తేజశ్విని శుక్రవారం రాత్రి కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన తల్లిదండ్రులు ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతి చెందడంతో తల్లిదండ్రులు పీఈటీపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఇన్నోవా

- ఇద్దరు మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు



కడ్తాల్, ప్రభ న్యూస్ : రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయ ఆవరణలో శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఏడుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రహదారిపై ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి ఇన్నోవా కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్ మలకపేటకు చెందిన సయ్యద్ సమీర్ (24), మాదన్నపేటకు చెందిన ఫిరోజ్ (25)లు అక్కడికక్కడే మృతి చెందారు. ఎండీ.మోహిన్, వాహేజ్, సయ్యద్ అబ్దుల్ కరీమ్, ఎండీ.కరీఫ్, అజ్గర్‌అలీ, రియాజ్ ఏక్బాల్, ఎండీ.అప్సర్, ఫిరోజ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జేసీబీ సహాయంతో అతి కష్టం మీద బయటకు తీసి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు, మృతి చెందిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ ఆధ్వర్యంలో సంఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఆమనగల్లు ఎస్ఐ మల్లీశ్వర్ సందర్శించారు. సంఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే గుంటూరు ఘటన

- ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు హెచ్చరిక



బాధిత ప్రాంతాలలో పైప్‌లైన్ లను పరిశీలిస్తున్న ఏపీ మంత్రి నారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ: ఒక వ్యక్తి వైఫల్యంతో పది మంది మృతి చెందారని, దీని వల్ల ప్రభుత్వానికి అప్రతిష్ఠ వచ్చిందని గుంటూరు అతిసార ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికార యంత్రాంగంపై మండిపడ్డారు. ఇది శాఖపరమైన వైఫల్యమంటూ ధ్వజమెత్తారు. కిందిస్థాయి సిబ్బంది వైఫల్యం చెందితే చక్కదిద్దాల్సిన ఉన్నతస్థాయి యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించిందంటూ అసహనం వ్యక్తం చేశారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార యంత్రాంగం పనితీరు ప్రభుత్వం గౌరవం పెంచేలా ఉండాలని ఏ ఒక్క తప్పుకు ఆస్కారం ఇవ్వకూడదన్నారు. ఒకవేళ ఎక్కడైనా చిన్నపొరపాటు జరిగితే సకాలంలో సమర్ధవంతంగా సరిదిద్దాలే తప్ప ఉదాసీనంగా వ్యవహరించకూడదని హితబోధ చేశారు. గుంటూరు అతిసార ఘటన పరిణామాలను మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కన్నబాబు, ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ఈ ఘటనలో పది మంది మృతి చెందడం బాధాకరమని విపత్తు ఏదైనా వస్తే దానిని చక్కదిద్దే వరకు వదిలి పెట్టకూడదని హుద్‌హుద్ స్ఫూర్తి ఏమైదంటూ అధికారయంత్రాంగాన్ని ప్రశ్నించారు. దీనిపై ఇప్పటికే విచారణ చేపట్టామని తాగునీటి పైపులైన్లను యుద్ధ ప్రాతిపదికన మార్చడమే కాకుండా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని వివరించారు. వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సంఘటన జరిగిన వెంటనే బాధితులను పరామర్శించలేకపోవడమే కాకుండా ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని క ూడా వెంటనే అందించలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో పైప్‌లైన్లలీకేజీలపై ప్రత్యేక దృష్టిపెట్టి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీలన్ని శుభ్రం చేయాలని శిధిలావస్థకు చేరిన పాతపైప్‌లైన్‌ను తక్షణమే తొలగించి కొత్త లైన్లు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇష్టానుసారంగా రోడ్లను తవ్వడం, గుంతలు పూడ్చకుండా వదిలేస్తున్నారని దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్లను నియమించుకోవడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మండిపడ్డారు. పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణ బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఏ మాత్రం నిర్లక్ష్యం, ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. ఎప్పటికప్పుడు తాగునీటి నమూనాలను సేకరించడంతో పాటు రక్షిత నీటిని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడికక్కడ సెన్సార్ల ద్వారా నీటి కాలుష్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

గుంటూరు ఘటన లాంటివి రాష్ట్రంలో ఎక్కడా పునరావృతం కాకుడదని, దీనికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గుంటూరు కమిషనర్‌పై బదలీ వేటు

- నూతన కమిషనర్‌గా బాలాజీరావు



అనూరాధ

గుంటూరు, ప్రభ న్యూస్ బ్యూరో: గుంటూరు నగర కమిషనర్ చల్లా అనూరాధపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆమె స్థానంలో విజయనగరం జాయింట్ కలెక్టర్ బాలాజీరావును బాధ్యతలు స్వీకరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 4న నగరంలోని పాత గుంటూరు తాగునీటి సరఫరా అయ్యే పైపుల్లో కలుషిత నీరు కలిసి డయేరియా వ్యాధి సోకి ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈనెల 5న ముగ్గురు, 6న ఐదుగురు కలుషిత నీటి ప్ర భావంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే 15, 16 తేదీల్లో నలుగురు చనిపోవడంతో ఈ సంఖ్య మొత్తం 14 మందికి చేరింది. దీంతో పభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పురపాలక శాఖామంత్రి నారాయణపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రోజుల నుంచి ఈ సంఘటనలు చోటు చేసుకుంటూ ఉంటే, ఇప్పటి వరకు మీరేమి చేశారంటూ ప్రశ్నించారు. ప్రధానంగా దీనిపై బాధ్యతగా వ్యవహరించాల్సిన కమిషనర్‌ను వెంటనే తొలగించి నూతన కమిషనర్‌ను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో కమిషనర్‌పై అనూరాధపై బదిలీ వేటు పడింది.

సెప్టిక్ ట్యాంకులో పడి నలుగురి మృతి

- అందరూ ఒకే కుటుంబీకులు

నక్కపల్లి, ప్రభ న్యూస్: విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో శనివారం విషాదం చోటుచేసుకుంది. సెప్టిక్ ట్యాంకు నుంచి వెలువడిన విషవాయువు కారణంగా నలుగురు అక్కడికక్కడే మృతి చెందాడు. అపస్మారక స్థితికి చేరుకున్న మరొకరిని గ్రామస్తులు సకాలంలో ఆసుపత్రికి చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉపమాక గ్రామంలో ఎస్సీ కాలనీలో నివాసముంటున్న కాండ్రకోట అప్పారావు తన ఇంటిలో సెప్టిక్‌ట్యాంకు నిండిపోవడంతో ఆ ట్యాంకును అనుకుని మరొక ట్యాంకు నిర్మించాడు. శనివారం 11 గంటల సమయంలో తన కుమారుడు కాండ్రకోట రాజశేఖర్ సహాయంతో ట్యాంకులోకి నిచ్చెన వేసుకుని దిగి పాత ట్యాంకులో నిల్వ ఉన్న మల నిల్వను కొత్త ట్యాంకులోకి మళ్లించేందుకు రంధ్రం చేశాడు. ఒక్కసారిగా దుర్వాసన వెదజల్లడంతో ఊపిరాడక అప్పారావు(50) స్పృహతప్పి పడిపోయాడు. తండ్రిని రక్షించేందుకు రాజశేఖర్(26) కూడా ట్యాంకులోకి దిగాడు. అతను కూడా ఊపిరాడక ట్యాంకులో పడిపోయాడు. ఇదే సమయంలో అక్కడే ఉన్న అప్పారావు సోదురుడి కుమారుడు సత్తిబాబు కూడా ట్యాంకులోకి దిగే ప్రయత్నం చేశాడు. ఊపిరాడక కేకలు వేయడంతో స్థానికులు పైకిలాగి రక్షించారు. ఇతనిని హుటాహుటిన నక్కపల్లి 30 పడకల ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స చేసి సత్తిబాబు ప్రాణాలు కాపాడారు. ఏమి జరిగిందో తెలియక అప్పారావు సోదరుడు కృష్ణ (28) ట్యాంకులోకి దిగాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో ఇతనిని రక్షించేందుకు నాగేశ్వరరావు(30) ట్యాంకులోకి దిగి అతను కూడా విషవాయువు సోకి ఊపిరాడక పడిపోయాడు. ఇలా ఒకరి తరవాత ఒకరు పడిపోవడంతో స్థానికులు తాళ్ల సహాయంలో నలుగురిని పైకిలాగారు. స్థానిక ఎస్ఐ పైల సింహాచలం ఈ నలుగురిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి వారంతా మరణించినట్లు ధృవీకరించారు. మృతులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరడం కాలేదు.



బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే అనిత, జేసీ సృజన

ఉపమాక గ్రామంలో నలుగురు మృతి చెందిన విషయం తెలుసుకున్న పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత జేసీ సృజనలు ఆసుప్రతికి చేరుకుని వివరాలు అడిగితెలుసుకొని మృతుల కుటంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు రెండు లక్షల రూపాయిలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉపాధి, గృహ నిర్మాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీవో కోరాడ సూర్యారావు, తహసీల్దార్ రాణి అమ్మాజీ మృతుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వర రావు, ఈవోఆర్డీ పిఎస్‌కుమార్, సీఐ రుద్రశేఖర్‌లు ఆసుపత్రికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధర్మమే భారతదేశానికి బలం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ బాబ్డే



విశాఖ ఎడ్యుకేషన్, ప్రభ న్యూస్: మనం అనుసరించే ధర్మమే దేశానికి బలాన్ని చేకూరుస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి శరద్ అరవింద్ బాబ్డే అన్నారు. శనివారం ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ అంబేద్కర్ న్యాయ కళాశాల నిర్వహించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ధర్మనిధి ప్రసంగంలో ఆయన రూల్ ఆఫ్ లా అంశంపై ప్రసంగించారు. ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ జయం కలుగుతుందన్నారు. ధర్మం అనేది భవనాలు, భూభాగంగా ఉండదని మన మనసు, మెదడుకు సంబంధిం చిన అంశమన్నారు. న్యాయ సూత్రాలు అనగానే న్యాయస్థా నాలు గుర్తుకు వస్తాయన్నారు. సత్యమే ధర్మమన్నారు. ధర్మం కంటే ఉన్నతం ఏదీకాదన్నారు. రాజులకే రాజుగా ధర్మం నిలుస్తుందన్నారు. ధర్మం కంటే ఎవరూ ఉన్నతులు కాబోరన్నారు. బలవంతుడినుంచి బలహీనుడిని ధర్మం పరిరక్షిస్తుందన్నారు. వేరొకరి స్వేచ్ఛను జీవనాన్ని హరించే హక్కు ఎవరికీ లేదన్నారు. ధర్మమే సమాజానికి బలమ న్నారు. మతం ప్రజలను విభజిస్తే ధర్మం ప్రజలకు ఐక్యం చేస్తుందన్నారు. భారతదేశంలో ఆంగ్లేయులు రాకపూర్వమే న్యాయ సూత్రాలు అమలులో ఉన్నాయన్నారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం సర్.సి. ఆర్ రెడ్డి తో ప్రారంభమై, సర్వేపల్లి రాధాకృష్ణన్, సచ్చిదానంద మూర్తి, ఆవుల సాంబ శివరావు వంటి మహా నీయుల మార్గదర్శకంతో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. జి.ఎం.సి బాలయోగి, ఎర్రం నాయు డు వంటి పూర్వ విద్యార్థులు వర్సి టికి ఎంతో పేరుతెచ్చారన్నారు. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ విశ్వవిద్యా లయం పూర్వ విద్యార్థి కావడం ఎంతో గర్వకారణమన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ జస్టిస్ చలమేశ్వర్‌తో తన అనుబంధాన్ని వివరించారు.

'అవిశ్వాసంతో ఇబ్బందిలేదు'

బెంగళూరు: తెలుగు దేశం పార్టీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానంతో మోడీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత కుమార్ స్పష్టం చేశారు. పార్లమెంటు వెలుపల, లోపల కూడా ఎన్డీయేకి స్పష్టమైన మెజార్టీ ఉందని అన్నారు. అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మోడీ ప్రభుత్వానికి మూడింట రెండొంతుల మెజార్టీ ఉందని తెలిపారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, శనివారం నిర్వహించిన సేవ్ బెంగళూరు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా ఇవ్వనందుకే తెదేపా బయటకు వెళ్లిందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ, కొన్ని విషయాలు మనసులో పెట్టుకుని వారు ఈవిధంగా వ్యవహరించారు. రాష్ట్ర విభజన తర్వాత మోడీ సర్కార్ ఆంధ్రప్రదేశ్‌కు రూ. 24వేల కోట్ల రూపాయలు అదనపు గ్రాంటు ఇచ్చిందని గుర్తుచేశారు. దేశంలో మరే ఇతర రాష్ట్రానికి లేనంతగా, ఏపీకి సాయం అందించడం జరిగిందన్నారు. రాజధాని నిర్మాణం, అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారులు, ఇరిగేషన్ తదితర రంగాల్లో ఆంధ్రకు విరివిగా నిధులు కేటాయించినట్లు అనంతకుమార్ చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు బీజేపీ ఇప్పటికీ కట్టుబడి ఉందన్నారు. అన్ని సమస్యలపైనా చర్చించేందుకు ఎన్డీయే సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే సభను అడ్డుకుంటోందని ఆరోపించారు.

ఎన్డీయేలో లుకలుకలు?

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్, బీహార్ లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలవడం.. విభజన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ తెలుగుదేశం పార్టీ ఎన్డీయే కూటమి నుంచి బయటకు వెళ్లిపోవడం.. లోక్‌సభలో తెదేపా, వైకాపా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడం వంటి పరిణామాలు జాతీయ రాజకీయాలను వేడెక్కించాయి. నిస్తేజంగా ఉన్న ఎన్డీయేతర పార్టీల్లో కదలికను తీసుకువచ్చాయి. ఈక్రమంలో అసమ్మతి రాగాలు తీస్తున్న శివసేన, ఎల్‌జేపీలను బుజ్జగించే పనిలో బీజేపీ నిమగ్నమైంది. చాలా కాలంగా శివసేన ఎంపీ సంజయ్ రౌత్ మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ వచ్చారు. ఏదో ఒక క్షణంలో పొత్తు వికటించడం ఖాయమన్న సంకేతాలు కూడా వచ్చాయి. మరోవైపు ఎల్జేపీ సైతం ఎన్డీయే పట్ల అసంతృప్తితో ఉంది. ఆ పార్టీ అధినేత, కేంద్ర మంత్రి రాంవిలాస్‌పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ పలుమార్లు అసంతృప్తిని వెళ్లగక్కాడు. 2019 ఎన్నికల్లో పొత్తు ఉంటుందని అనుకోవడం లేదన్న ఆయన వ్యాఖ్యలు మోడీ ప్రభుత్వానికి ముందస్తు హెచ్చరికలుగానే భావించొచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు సొంత పార్టీలోని సీనియర్ నేతల వ్యతిరేకత కూడా మోడీకి ఆందోళన కలిగించే అంశమేనని చెబుతున్నారు.

ఏపీ భవన్‌లో కాంగ్రెస్ సంబరాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో తొలి రోజే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలు గురించి ప్రస్తావించడంపై ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి నేతృత్వంలో ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ వేదికగా పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రఘువీరా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్లీనరీ సమావేశాల తొలి రోజు చరిత్రలో నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికిచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంశాలను తీర్మానంలో చేర్చినందుకు రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఉదయం ప్లీనరీ సమావేశాలకు వెళ్లే ముందు రాజ్‌ఘాట్‌లోని మహాత్మా గాంధీ సమాధి వద్ద మౌనదీక్ష చేయనున్నట్టు రఘువీరా ప్రకటించారు.మరో సీనియర్ నేత, మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికిచ్చిన హామీలను అమలు చేసే విషయంలో ప్రస్తుత పార్టీలన్నీ విఫలమయ్యాయని, అందుకే కాంగ్రెస్ పార్టీ మళ్లీ బాధ్యత తీసుకుందని అన్నారు.

అందరూ మనవైపే

• అవిశ్వాసానికి అనేక పార్టీల మద్దతుంది • సోమవారం ఓటింగ్‌కు పట్టుబట్టండి • మూడు పార్టీల మహాకుట్ర బట్టబయలు

• జగన్‌పై కేసులు కొట్టివేస్తారనే ప్రచారం జరుగుతోంది • టీడీపీ ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్రంపై తెలుగుదేశం పార్టీ చేస్తున్న పోరాటం, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో దేశం యావత్తు ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తోందని, ఇలాంటి అత్యంత కీలక సమయంలో ఎంపీలంతా చురుకుగా ఉత్సాహంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అవిశ్వాసం పెట్టిన గంటలోనే పలు పార్టీలు సానుకూలంగా స్పందించాయని, ఇది జాతీయ స్థాయిలో పార్టీ విశ్వసనీయతకు నిదర్శనమని అన్నారు. వైకాపాను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని, అందుకే వారి అవిశ్వాస తీర్మానానికి ఎలాంటి స్పందన రాలేదన్నారు. శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి తెలుగుదేశం పార్టీ ఎంపీలు, అసెంబ్లీ స్ట్రాటజీ కమిటీ సభ్యులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో సోమవారం ఓటింగ్‌కు పట్టుబట్టి, డివిజన్ అడగాలని దిశానిర్దేశం చేశారు. ఈ రెండు రోజులపాటు ఆరుగురు సభ్యుల ఎంపీల బృందం ఢిల్లీలోనే ఉండాలని ఆదేశించారు. అన్ని పార్టీల నేతలు వ్యక్తిగతంగా కలిసి పార్టీ ప్రతిపాదించిన అవిశ్వాసానికి మద్దతు కూడగట్టాలని సూచించారు. అవిశ్వాసంపై సరైన సమయంలోనే సరైన నిర్ణయం తీసుకున్నామని, అదే సమయంలో మూడు పార్టీలు పన్నిన మహాకుట్రను బట్టబయలు చేయగలిగామనే అభిప్రాయం, చర్చ, ప్రజల్లో జరుగుతోందని జగన్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించకుండా తనను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై పోరాటం చేస్తున్న సమయంలో తనను బలహీనపరిచి ఎవరికి లాభం చేకూరుస్తున్నారో ప్రజలకు అర్థం అవుతోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రజల మనోభావాలను గళమెత్తి వినిపించాలని ఎంపీలకు మార్గదర్శకం చేశారు. ప్రస్తుత సమయంలో రాజకీయాలు అవసరం లేదని రాష్ట్రానికి న్యాయం జరగడమే లక్ష్యంగా పనిచేయాలని నిర్దేశించారు.

జగన్‌పై కేసులు కొట్టివేస్తారనే ప్రచారం ..

రేపోమాపో జగన్‌పై ఉన్న కేసులను కొట్టివేస్తారనే ప్రచారం బలంగా జరుగుతోందని, ఈ పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కేసుల మాఫీ కోసం ఏ-2 నిందితుడు విజయసాయిరెడ్డి కేంద్ర పెద్దలకు పాదాభివందనాలు చేస్తూ ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. జగన్ అనుచరులు కూడా ప్రధాని కార్యాలయంలోనే ఉంటున్నారని అందుకే కేసుల్లో సడలింపులు జరుగుతున్నాయంటూ చంద్రబాబు కుట్ర రాజకీయాలపై మండిపడ్డారు. సరైన సమయంలో ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెబుతారన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభలో తన ప్రకటన అనంతరం జరిగిన పరిణామాలను కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి ముఖ్యమంత్రికి వివరించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై గళమెత్తారని చెప్పారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తన ప్రసంగాన్ని అడ్డుకోవాలని చూసినప్పటికీ సమర్థవంతంగా రాష్ట్ర ప్రజల మనోభావాలను సభ దృష్టికి తీసుకువచ్చానని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లోక్‌సభలో అశోక్‌గజపతిరాజు, రాజ్యసభలో సుజనా చౌదరి సమర్థవంతమైన వాదనను రాష్ట్ర ప్రజల తరుపున వినిపించారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పోరాటం చేయాలని, రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు కొనసాగించాలని స్పష్టం చేశారు. టీడీపీ లోక్‌సభ పక్షనేత తోట నర్సింహం మాట్లాడుతూ ఇప్పటి వరకు తాము కలిసిన పార్టీ నేతలు వారు వెల్లడించిన అభిప్రాయాలను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. అనేక పార్టీలు రాష్ట్రానికి మద్దతుగా నిలుస్తున్నాయని న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. జాతీయ ఛానల్‌లో జరుగుతున్న చర్చల వివరాలను ఎంపీ రామ్మోహన్‌నాయుడు వివరిస్తూ ప్రధాని మోడీని విమర్శించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను టార్గెట్ చేయడం ఏమిటని మీడియా ప్రతినిధి ప్రశ్నిస్తే పవన్ కల్యాణ్ సమాధానం చెప్పకుండా దాటవేశారని తెలిపారు. లోకేష్‌పై చేసిన ఆరోపణలకు ఆధారాలను చూపాలని తాము సవాల్ చేయగా పవన్ నుంచి ఎలాంటి జవాబు రాలేదని చెప్పారు.

దీనిపై చంద్రబాబునాయుడు కూడా స్పందిస్తూ పవన్ కల్యాణ్ ఆరోపణలు చేసిన మరుసటి రోజే మళ్లీ మీడియాతో అందరూ అంటున్నారు కాబట్టే తాను అంటున్నానని జవాబు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో జగన్ మీడియా చేసిన ఆరోపణలని పవన్ చేశారని, వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని చంద్రబాబు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరించనున్నదని, దీని కోసం ఫ్రంట్ ఏర్పాటు చేస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోందని ఎంపీ సీఎం రమేష్ అధినేత దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పక్కదారి పట్టించేలా ప్రచారం జరుగుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి మాట్లాడకుండా జాతీయ రాజకీయాలపైన మీడియా దృష్టి పెట్టడం సరికాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్రం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని జాతీయ మీడియాలో హైలెట్ అయ్యేలా ఎంపీలు దృష్టి సారించాలని కోరారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఎంపీలు, అసెంబ్లీ స్ట్రాటజీ కమిటీ సభ్యులు, రాష్ట్రమంత్రులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలే కీలకం

• రాజ్‌దీప్ సర్దేశాయ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రాల వారిగా రాజకీయ పార్టీల మధ్య కుదిరే పొత్తులతోనే కేంద్రంలో భారతీయ జనతా పార్టీని నియంత్రించడం సాధ్యం కాగలదని ప్రముఖ టీవీ న్యూస్ యాంకర్ రాజ్‌దీప్ దేశాయ్ అభిప్రాయపడ్డారు. దక్షిణాదిలో పోటీ చేసే జాతీయ పార్టీలకు తక్కేవేనన్నారు. రాబోవు కాలంలో ప్రాంతీయ పార్టీలే ఢిల్లీలో కీలక భూమిక పోషించగలవన్నారు. మీడియా ఇన్ న్యూస్ అనే అంశంపై ఏర్పాటు చేసిన చర్చాగోష్టిలో ఆయన పాల్గొన్నారు. మీడియా సామాన్యుని శక్తిగా మారవలసి ఉందని మోడరేటర్‌గా వ్యవహరించిన కామినీ షరప్ అన్నారు. సామాన్యుల కళ్లు, చెవులు మీడియానేనన్నారు. మీడియా సమాజ ప్రగతిని ఆశించి వాస్తవికంగా వ్యవహరించవలసి ఉందన్నారు. మీడియా ద్వారా సామాన్యుల గొంతును పాలకులు వినవలసి ఉంటుందన్నారు. కాని పరిస్థితులకు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యూస్ ఛానల్స్ మధ్య పెరిగిన పోటీతో వార్తల్లో నాణ్యత లోపిస్తుందని, నిర్ధారించుకొనే ఓపిక లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీ స్టూడియోలు, న్యూస్ రూమ్‌లు కోర్టు గదులుగా, ట్రాయల్ హాల్స్‌గా మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వార్తలకు తక్కువ స్థలం కేటాయించి కథనాలకు ఎక్కువ స్థలం కేటాయించడం వార్త పత్రికల ధోరణిగా మారిపోయిందన్నారు. టెలివిజన్ రేటింగ్ పాయింట్ల కోసం ఛానల్స్ వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేటు కుటుంబ కంపెనీగా మారిపోయిందని, రాష్ట్ర స్థాయి కూటములే కేంద్రంలో బీజేపీని నియంత్రించగలవని, విశ్వసనీయతతో కూడిన మీడియా దేశానికి ఎంతో అవసరమని ఆయన అన్నారు. మీడియా తీరు మారవలసి ఉందన్నారు. ఎన్నికల నిధుల పై నిఘా ఉండాలని, దాపరికం లేని పద్ధతులు ఆచరణలోకి రావలసి ఉందని అన్నారు. చెల్లింపు వార్తలు క్యాన్సర్‌తో సమానం అన్నారు. రాజకీయాల్లో హూందాతనం బలపడవలసి ఉందన్నారు. హేయమైన రాజకీయాలకు భారత్ నెలవు కారాదన్నారు.



ప్రాయోజిత మిత్రులే!

• 2002 గోద్రా అల్లర్ల నుంచే మోడీ పట్ల విముఖత • రాష్ట్ర విభజనతో ఎన్డీయేకి చేరువైన చంద్రబాబు

• 2014 సార్వత్రిక విజయం కోసం మోడీ స్నేహ హస్తం • 2019 ఎన్నికల వ్యూహంలో పొత్తు చిత్తు?

న్యూఢిల్లీ: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నది నానుడి. కేవలం శాశ్వత ప్రయోజనాలే రాజకీయాలకు పరమావధి అన్నది సారాంశం. అదేవిధంగా రాజకీయాల్లో భావోద్వేగాలకు కూడా చోటు ఉండదట. కానీ, వాస్తవికంగా గమనిస్తే, రాజకీయాల్లో వ్యక్తిగత సంబంధాలు కీలక పాత్ర పోషిస్తాయని గత అనుభవాలను బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్డీయే నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగడం వెనుక కూడా ఇలాంటి సంబంధాలే కారణమని ప్రచారం జరుగుతోంది. మోడీ, చంద్రబాబు మధ్య అంతర్లీనంగా ఉన్న పరస్పర విభేదాలు, అయిష్టాలే తాజా పరిస్థితికి దారితీసిందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అసలు వీరిద్దరి మధ్య విభేదాలేంటి? అన్న విషయానికొస్తే 15 ఏళ్లు వెనక్కివెళ్లాల్సిందే.

అది 2002. నాటి ఎన్డీయే కూటమిలో చంద్రబాబు కింగ్ మేకర్. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా. అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయికి అత్యంత సన్నిహితుడిగా మెలిగేవారు. అదే సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ ఉన్నారు. గోద్రా అల్లర్ల నేపథ్యంలో మోడీని సీఎం పదవి నుంచి తొలగించాలని వాజ్‌పేయికి చంద్రబాబు సూచించారు. దీనిపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. కానీ, ఆర్ఎస్ఎస్ బలవంతం మీద మోడీని సీఎంగా కొనసాగించేందుకే వాజ్‌పేయి మొగ్గుచూపారు.

ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్దమొత్తంలో వరి ధాన్యం కొనుగోలు చేసేలా చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించగలిగారు. ఈ విషయంలో గుజరాత్‌కు ఆంధ్రప్రదేశ్ మధ్య పోటీ నెలకొంది. గుజరాత్‌ను కాదని ఏపీకి మేలు జరిగేలా వాజ్‌పేయిని బాబు ఒప్పించగలిగారు. ప్రధానికి ఏపీ సీఎంకి మధ్య సత్సంబంధాలు కొనసాగుతూ వచ్చాయి. కానీ, మోడీతో మాత్రం మొక్కుబడి స్నేహమే మిగిలింది.

2003లో గణేష్ ఉత్సవాల నేపథ్యంలో నరేంద్ర మోడీ హైదరాబాద్ రాకను చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాదు ఒకవేళ మోడీ ఇక్కడ అడుగుపెడితే అరెస్టు చేయాలని నాటి హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. అతను వస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ముస్లింలు ఆందోళనకు దిగే ప్రమాదం ఉందన్న ఉద్దేశంతో బాబు ఈవిధంగా వ్యవహరించారు. ఏపీ సీఎం ధోరణి గమనించిన మోడీ చివరకు పర్యటనను వాయిదా వేసుకున్నారు.

> జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా నియమించడంలోనూ, ముస్లిం వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ప్రకటించడంలోనూ చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరించి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి విజయం సాధించారు.


> 2014 సార్వత్రిక ఎన్నికల్లో దురదృష్టవశాత్తు బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఎన్డీయే అవసరం లేకుండానే సొంతంగా మెజార్టీ సీట్లు సాధించింది. నరేంద్ర మోడీ ప్రధాని పదవి చేపట్టారు. మిత్రపక్షాలకు ప్రభుత్వంలో చోటు లభించింది. రాష్ట్ర విభజన పరిస్థితుల దృష్ట్యా కేంద్ర సహాయం తప్పనిసరి అయింది. కొత్త రాజధాని నిర్మాణం, అభివృద్ధికి నిధులు, ప్రాజెక్టులు వంటి కారణాల రీత్యా పాతస్మృతులను పక్కనబెట్టి మోడీతో చెలిమి చేయాల్సి వచ్చింది. అయినా కేంద్రం నుంచి ఏపీకి సరైన సహకారం లభించలేదు.

2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో అక్కడ ఎన్డీయే, ఇక్కడ తెదేపా అధికారానికి దూరమయ్యాయి. దాంతో ఢిల్లీలో చక్రం తిప్పే అవకాశం బాబుకు లభించలేదు.

ఇక 2011లో భవిష్యత్ బీజేపీ ప్రధాని అభ్యర్థి మోడీ పేరు తెరపైకి వచ్చింది. దీంతో చంద్రబాబులో కలవరం మొదలైంది. మోడీకి మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని 2012లో చంద్రబాబు ప్రకటించారు. 2013లోనూ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. మోడీ తరహా భావజాలం కలిగిన వ్యక్తి ప్రధాని పదవికి ఆమోదయోగ్యం కాదన్నారు. కానీ ప్రాంతీయ పార్టీగా బీజేపీతో చెలిమి అనివార్యమైంది.

వీటన్నిటికి తోడు సొంత రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు.. జాతీయ స్థాయిలో బీజేపీ ప్రతిష్ట మసకబారుతుండటం.. వైకాపాకు కమలనాథులు దగ్గరవుతున్నారన్న సంకేతాలు.. వెరసి 2019 ఎన్నికలకు రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాల్సిన అవసరం చంద్రబాబుకు ఏర్పడింది.


ఈ నేపథ్యంలోనే అనూహ్య నిర్ణయాలతో, శరవేగంగా పావులు కదిపి జాతీయ రాజకీయాలను సుప్తావస్థ నుంచి చలనగతిలోకి తీసుకు రావడానికి చంద్రబాబు కారణమయ్యారు.



> వాజ్‌పేయి హయాంలో ఏది కావాలంటే అది సాధించుకుని వచ్చేవారు చంద్రబాబు. కానీ మోడీతో ఉన్న సంబంధాల దృష్ట్యా అది సాధ్యం కాలేదు. అప్పట్లో ప్రధానితో అపాయింట్ మెంట్ ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరికేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిభిన్నం. అపాయింట్ మెంట్ సంగతెలా ఉన్నా, కనీసం దేశ రాజకీయాల్లోనే సీనియర్ నాయకుడైన బాబుకు ఎన్డీయేలో సరైన గుర్తింపు కొరవడింది.



ఎన్డీయేకి అవిశ్వాస గండం?



2008 లో హైడ్రామా

ఇండో-యూఎస్ అణు ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలన్న డిమాండ్‌తో వామపక్షాలు యూపీఏ ప్రభుత్వానికి మద్దతు ఉప సంహరించింది. దీంతో 2008 జులైలో యూపీఏ అవిశ్వాసాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ సందర్భంలో యూపీఏ, విపక్ష పార్టీలు ఎంపీల మద్దతు కోసం నానాపాట్లు పడ్డాయి. ఆసుపత్రుల్లో , జైళ్లలో ఉన్న ఎంపీలను ఓటింగ్‌కు తోడ్కొని వచ్చారు. చివరకు 269 మంది మద్దతుతో ప్రభుత్వం అవిశ్వాస పరీక్షనెగ్గింది. 11 మంది తటస్థంగా ఉండగా, ఒకరు ఓటు వేయలేదు.

నాటి అవిశ్వాస తీర్మాన చర్చలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీజేపీ ఎంపీలు హై డ్రామాకు తెరలేపారు. ప్రభుత్వానికి మద్దతుగా ఓటేయాలని కోరుతూ తమకు సమాజ్‌వాది నేత అమర్‌సింగ్ ముడుపులు ఇచ్చారంటూ ముగ్గురు బీజేపీ ఎంపీలు (అశోక్ అగర్వాల్ - మోరెనా), (ఫగ్గన్ సింగ్ కులస్తే - మాండ్ల), (మహావీర్ భగోరా -సాలుంబర్) నోట్లకట్టలతో స్పీకర్ ముందుకు వెళ్లారు. వీరి ఆరోపణలను అమర్‌సింగ్ తోసిపుచ్చారు. ఈఘటనపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించారు. చివరకు సరైన ఆధారాల్లేవంటూ 15 డిసెంబర్ 2008న కమిటీ నివేదిక ఇచ్చింది.

న్యూఢిల్లీ: నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోబోతున్నది. కూటమి నుంచి తెదేపా వైదొలగినా వచ్చిన ముప్పేమీ లేదు. కానీ, అవిశ్వాసంతో గతంలో ఎన్డీయే ప్రభుత్వాలు కూలిన సందర్భాలున్నాయి. అందువల్ల ఈసారి ఎలాంటి అనూహ్య పరిణామాలు జరుగుతాయోనన్న ఆసక్తి కొంతమేరకు రాజకీయ వర్గాల్లో ఉంది. 1999లో ఒక్క ఓటు తేడాతో ఆనాటి వాజ్‌పేయి ప్రభుత్వం గద్దెదిగాల్సి వచ్చింది. ఎన్డీయే పతనానికి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత కారణమైంది. రెండు సార్లు అవిశ్వాసాన్ని ఓడిన ప్రధానిగా అటల్‌జీ రికార్డు సృష్టించారు. అంతేకాదు అతి తక్కువ ఓట్లతో ఓడిన ఘనత కూడా ఎన్డీయే ఖాతాలోకే వచ్చిపడింది. ఈ అనుభవం బీజేపీ పాలకులను ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుంది. ఇప్పుడు నరేంద్ర మోడీ మనసులోను కొంచెం అలజడి ఉండేవుంటుంది. సొంతపార్టీలో నివురుగప్పిన అసంతృప్తి బద్దలైతే, అద్వానీ, మనోహర్‌జోషి, యశ్వంత్ సిన్హా, శతృఘ్నసిన్హా వర్గం చీలిక దిశగా అడుగులేస్తే.. అన్న సందేహాలు కాషాయ శ్రేణుల్లో గుబులు పుట్టిస్తున్నాయి.17 ఏప్రిల్ 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం తొలిసారి అవిశ్వాసాన్ని ఎదుర్కొంది. ఒక్క ఓటు తేడాతో అధికారాన్ని కోల్పోయింది. ఎన్డీయేకి మద్దతిస్తానని మాట ఇచ్చిన బీఎస్పీ అధినేత్రి చివరి క్షణంలో మాట మార్చేసింది. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఎంపీ ప్రొఫెసర్ సైఫుద్దీన్ సోజ్‌తోపాటు ఒడిశా ముఖ్యమంత్రిగా ఉండి పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేయని గిరిధర్ గమాంగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారు. 2003లో ఎన్డీయేపై కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం ఇచ్చింది. వాజ్‌పేయి ప్రభుత్వం పరీక్షను ఎదుర్కొంది. చివరకు 314 ఓట్లు తీర్మానానికి అకూలంగా, 189 ఓట్లు వ్యతిరేకంగా వచ్చాయి.

ఐదుగురు పీఎంలు పదవులు కోల్పోయారు..

- మొదటి రెండు లోక్‌సభలు సజావుగా నడిచాయి. అవిశ్వాసానికి తావులేకుండా ముందుకు సాగాయి. తొలిసారి లోక్‌సభలో జవహర్‌లాల్ నెహ్రూకి వ్యతిరేకంగా 1963 ఆగస్టులో సోషలిస్టు నేత ఆచార్య కృపలానీ అవిశ్వాసానికి తెరలేపారు.
- స్వాతంత్ర్య భారతంలో రెండో ప్రధాని అయిన లాల్‌బహదూర్ శాస్త్రి ముచ్చటగా మూడు పర్యాయాలు అవిశ్వాసాన్ని ఎదుర్కొన్నారు. 1964, 1965 (రెండుసార్లు) ఎదుర్కొన్న అవిశ్వాస గండాల నుంచి బయటపడ్డారు.
- భారత రాజకీయ చరిత్రలో ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరాగాంధీ అత్యధి కంగా 15 సార్లు అవిశ్వాసాన్ని ఎదుర్కొన్నారు.
- రాజీవ్‌గాంధీ ఒకసారి (1987), పీవీ నరసింహారావు మూడుసార్లు (1991-96) సార్లు అవిశ్వాసాన్ని ఎదుర్కొన్నారు.
- మొత్తంగా లోక్‌సభ సభలో 13 అవిశ్వాస తీర్మానాలపై చర్చ జరగగా, ఐదుగురు ప్రధాన మంత్రులు పదవీచ్యుతులు అయ్యారు.

మిషన్ భగీరథ పథకం
కలలాంటి నిజం
స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి



గణపురం, ప్రభన్యూస్: మిషన్ భగీరథ పథకం ఓ కలలాంటి నిజమని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలంలోని గాంధీనగర్ సమీపంలోని మైలారం గుట్టపై నిర్మాణదశలో ఉన్న ఫిల్టర్‌బెడ్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తుందని అన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. మరో 50 ఏళ్లకు కూడ తాగునీరు సరిపోయే విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు తయా రు చేసిందన్నారు. గణపసముద్రం సరస్సులో రూ.5 కోట్లతో ఇంటెక్‌విల్ నిర్మాణం జరుగుతుందని, అదే విధంగా గాంధీనగర్ సమీపంలోని మైలారం గుట్టపై ఫిల్టర్‌బెడ్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ రూ.15 కోట్లతో నిర్మించటం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ రాంచంద్రనాయక్, ఈఈ నిర్మల, డీఈ పరమేశ్వరి, జడ్పీటీసీ శివశంకర్, మండల శాఖ అధ్యక్షులు దివి ప్రసాద్‌నాయుడు, సర్పంచ్ మారగాని శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, తహశీల్దార్ జివాకర్‌రెడ్డి, ఏఈలు ఉప్పయ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రబీ ధాన్యం సేకరణపై సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రబీ ధాన్యం సేకరణ పైన పౌరసరఫరాలు, ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లు సమీక్షలో పాల్గొన్నారు. రైతులకు ఇబ్బంది కలగని విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిం చారు. మిల్లుల సామర్థ్యం మేరకు కస్టమ్స్ మిల్లింగ్ రైస్ ను మిల్లర్లకు అందచేయడం జరుగుతుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు, రైతులకు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించడం తదితర అంశాలను మంత్రి సమీక్షించారు.

భిన్నత్వంలో ఏకత్వం శ్రీశైలం

కర్నూల్ బ్యూరో , ప్రభ న్యూస్ : భిన్నత్వంలో ఏకత్వం శ్రీశైలం మహా పుణ్య క్షేత్రమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. శనివారం శ్రీశైలం మహా పుణ్య క్షేత్ర ఆలయ అధికారులతో పాటు పాలక మండలితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రత్యేకంగా శ్రీశైలం మహా పుణ్య క్షేత్రంపై మాట్లాడారు. దేశంలోని 18 శక్తి పీఠాలలో శ్రీశైలం మహా పుణ్య క్షేత్రం ప్రముఖమైనదని, యుగయుగాల నుంచి ఈ దేవాలయానికి ప్రత్యేకత ఉందన్నారు. తెలుగు ప్రజల నూతన ఉగాది తెలుగు సంవత్సర సందర్భంగా ప్రత్యేకంగా తెలుగు ప్రజలకు నరేంద్రమోడీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్లీనరీపై ఎవరు ఏమన్నారంటే..

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశ రాజధానిలో జరుగుతున్న కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపుతున్నాయి. ఏపీ, తెలంగాణా నుంచి వచ్చిన నేతలు, స్టేజీ మీద నాయకులు చేస్తున్న ప్రసంగాలను శ్రద్ధగా ఆలకించారు. మీడియా పాయింట్ వద్దకు వచ్చి ఢిల్లీ పాత్రికేయులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అధిష్టానం తమకు దిశా నిర్దేశం చేస్తోందని వారు చెప్పుకొచ్చారు.

యూనివర్సిటీలో అడుగు పెట్టినట్టుంది

ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీలోకి రావడం కాలేజీ నుంచి యూనివర్సిటీలో అడుగు పెట్టినట్టుంది. తొలిసారి కాంగ్రెస్ ప్లీనరీలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఎన్నికల సంవత్సరం కాబట్టి ప్రజల్లో నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఈ సమావేశాలు బాగా ఉపయోగ పడతాయి. రాష్ట్ర, కేంద్ర ప్రజలు మోడీ, కేసీఆర్ చేతుల్లో దారుణంగా మోసపోతున్నారు. విశ్వసనీయత కలిగిన నాయకుడు కాంగ్రెస్ పార్టీని నడుపుతున్నారు. రాహుల్ గాంధీ మా పార్టీకే కాదు. దేశానికీ అధ్యక్షత వహించే స్థాయికి ఎదుగుతారని నమ్ముతున్నాము.

రాహుల్ గాంధీ

యువశక్తికి ప్రతీకగా రాహుల్

దేశంలో యువతకు, యువశక్తికి ప్రతీకగా రాహుల్ నిలుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మార్గ నిర్దేశం చేస్తూ యువత నాయకత్వాన్ని తీసుకొని దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళబోతోంది.

కేవీపీ రామచంద్రరావు, రాజ్యసభ సభ్యుడు

దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం

రాజకీయ పరిస్థితులు, నిరుద్యోగ సమస్య, రైతుల ఆందోళన, ఆత్మహత్యలు మితిమీరిపోయాయి. కేంద్రం దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. నోట్ల రద్దు, జీఎస్టీ విధి విధానం సరిగ్గా లేకపోవడంతో చిన్న చిన్న పరిశ్రమలు మూతబడ్డాయి. లక్షలాది మంది నిరుద్యోగులవుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోకుండా మౌన ముద్ర వహిస్తోంది. దేశంలో నిరుపేదల డబ్బులు బ్యాంకుల్లోకి వస్తే ఆ డబ్బులను నీరవ్ మోడీ వంటి వ్యక్తులకు దోచి పెడుతోంది. మోడీ దేశీయ, విదేశీ విధానాలు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి.

మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు

ప్రజలకు స్పష్టత

భారతదేశ పరిస్థితిపై కాంగ్రెస్ పార్టీ ఆలోచన ఏ విధంగా ఉండ బోతోందో తీర్మానాల్లో చూపిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఏం చేయబోతోందని ప్రజలు చూస్తున్నారు. ఈ ప్రజలకు ప్లీనరీలో స్పష్టత వస్తుంది.

పళ్ళంరాజు, మాజీ కేంద్రమంత్రి

సెక్యులర్ శక్తులను ఏకం చేస్తాం

ఒక వైపు పార్టీకి దిశానిర్దేశం చేస్తూనే రాహుల్ గాంధీ మరోవైపు సెక్యులర్ శక్తులను ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా అందరినీ ఏక తాటిపై తీసుకురావడానికి ప్రయత్నం చేయడంతో పాటు వారికి నాయకత్వం వహించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉంది. ప్రజాస్వామ్య విలువలను కాలరాసే ప్రయత్నాన్ని, మతపరమైన శక్తులు దేశంలో ఏ విధంగా ప్రజల్లో ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నాయో వాటికి ధీటుగా నిలబడడానికి యువ నాయకుడు రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది.

మర్రి శశిధర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత

యువతకు ప్రాధాన్యత

రాహుల్ నేతృత్వంలో జరుగుతున్న మొదటి ప్లీనరీ సమావేశాల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నలభై ఏళ్ళలోపు వారందరినీ భాగస్వాములను చేస్తున్నారు. యువతకు ఏఐసీసీలో ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడాన్ని ప్లీనరీలో ప్రవేశపెట్టే రాజకీయ తీర్మానంలో చేర్చి ఆమోదించడం సంతోషం.

గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ నాయకుడు

రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు

130 ఏళ్ళ చరిత్ర కలిగి భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కారణమైన కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీలో పాల్గొనడం సంతోషంగా ఉంది. 130 కోట్ల ప్రజలు రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఎదురు చూస్తున్నారు. రాహుల్ ఎప్పుడు ప్రధాని అవుతాడా ఎప్పుడు అవకాశాలు వస్తాయా అని యువత ఎదురు చూస్తోంది.

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత

నూతన అధ్యాయానికి నాంది

భారతదేశ రాజకీయాల్లో నూతన అధ్యాయానికి ప్లీనరీ సమావేశాలు నాంది పలుకుతున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఎన్నిక నూతన మార్పులు తీసుకురానుంది. అట్టడుగు స్థాయి నుండి వచ్చిన కార్యకర్తగా ఈ 84వ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొనడాన్ని గర్వంగా భావిస్తున్నాను.

సంపత్, కాంగ్రెస్ నాయకుడు

మహిళా రక్షణకు వన్‌స్టాప్ సెంటర్లు

• తొలిదశలో పది జిల్లాల్లో ఏర్పాటు • డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : వేధింపులు, హత్యాచారాలు, గృహహింసల భారీ నుంచి మహిళలకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన వన్ స్టాప్ కేంద్రాలను రాష్ట్రంలోని 31వ జిల్లాల్లో ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాలు మహిళలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శనివారం హన్మకొండలో ఏర్పాటుచేసిన వన్ స్టాప్ సెంటర్‌ను శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలిదశలో తెలంగాణలోని పాత పది జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. కొత్తగా ఏర్పాటైన 21వ జిల్లాల్లో కూడా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. కేంద్రం అందుకు అంగీకరించిందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారి భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, అన్నారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల హింసల నుంచి రక్షణ కల్పించడానికి అనేక సహాయ సంస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని, షీటీంలు, 181 హెల్ప్‌లైన్, డివి సెల్స్ గతంలో పని చేస్తున్నాయని అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వన్ స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా మహిళలు ఎదుర్కొంటున సమస్యలను ఈ కేంద్రం ద్వారా పరిష్కరించేందు కు దోహదపడుతుందని, వేధింపులు, హింసల నుంచి రక్షణ కల్పించడానికి వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి వన్‌స్టాప్ సెంటర్ కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.పద్మ ఎంఎల్‌సీ శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్ఏ వినయ్‌భాస్కర్, ఆరూరి రమేష్, మహిళా కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జి. సుధారాణి, కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు రాములు, ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ, సర్వోదయ స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ దామోదర్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలకు వేదిక

గతంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు జరిగిన, గృహ హింస చేసిన మహిళలు అనేక కేంద్రాలకు తిరగవలసి వచ్చేదని సమస్య పరిష్కారానికి ఫిర్యాదు చేయడానికి ఇంకా అలాంటి ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, మహిళా సమస్యలకు ఒక వేదిక ద్వారా పరిష్కరించడానికి దోహదపడుతాయని ఆయన అన్నారు. ఇప్పటికే వన్ స్టాప్ సెంటర్లను తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, వీటితో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన 21 జిల్లా కేంద్రాల్లో కూడా వన్ స్టాప్ మహిళా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం కూడా మిగితా జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్‌లను మంజూరు చేయడానికి సూత్రప్రాయంగా అంగీకరించిందని, త్వరలోనే మిగితా జిల్లాల్లో వన్ స్టాప్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మహిళా సమస్యలను ఒకే వేదిక ద్వారా పరిష్కరించవచ్చన్నారు.

స్వామిగౌడ్‌కు ప్రముఖుల పరామర్శ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కంటి కి గాయమై కొలుకుంటున్న తెలం గాణ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ ను కిస్మత్‌పూర్‌లోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు పరామర్శించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ రాజేశం గౌడ్, రాష్ట్ర జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి , ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు స్వామిగౌడ్‌ను కలిసి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు.

వ్యవసాయ వర్సిటీలో ముగిసిన అగ్రానమిస్ట్ శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన మేరకు మండల వ్యవసాయ అధికారులకు నిర్వహించిన అగ్రానమిస్ట్ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. రాష్ట్రంలోని మండల వ్యవసాయ అధికారులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని, విస్తరణ విద్యాకేంద్రంలో 11 బ్యాచ్‌లలో శిక్షణ కల్పించారు. శనివారంతో రాష్ట్రంలోని వ్యవసాయ అధికారులందరికీ అగ్రానమిస్ట్ శిక్షణ పూర్తయింది. 10, 11వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావుతో కలిసి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ఆలోచన ప్రకారం రాష్ట్రంలోని వ్యవసాయ అధికారులను అగ్రానమిస్టులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా అందించిన ఈ శిక్షణ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడానికి దోహదం చేస్తుందన్నారు. నేటి అవసరాలకు అనుగుణంగా శిక్షణా అంశాలను రూపొందించి, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించే లక్ష్యంతో ఇచ్చిన ఈ శిక్షణవల్ల అధికారుల పనితీరులో సానుకూల మార్పు రావాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి మంచి సూచనలు, సలహాలు అందివ్వాలని సూచించారు. అలాగే కిందిస్థాయిలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులకు కూడా శిక్షణ కల్పించాలని సూచించారు.

ఏఐసీసీ ప్లీనరీలో టీ కాంగ్రెస్ నేతలు

తెలంగాణ నుంచి ఎమ్మెల్యే సంపత్‌కు మాట్లాడే అవకాశమిచ్చిన హైకమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏఐసీసీ ప్లీనరీ సమావేశానికి రాష్ట్రం నుంచి కాంగ్రెస్ ముఖ్య నేతలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన పార్టీ నేతలు కూడా హాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగా ఈ ప్లీనరీ సమావేశాలు మూడు రోజుల పాటు జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా శనివారం 84వ ప్లీనరీ సమావేశం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్నాయి. రాష్ట్రం నుంచి టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ, టీ పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ, టీపీసీసీ నాయకులతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ సీనియర్ నేతలు ఢిల్లీకి వెళ్లారు. కాగా తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన అలంపూర్ ఎమ్మెల్యే, సంపత్‌కుమార్‌కు ప్లీనరీలో మాట్లాడే అవకాశం దక్కడం ప్రత్యేకత సంతరించుకున్నది. వ్యవసాయం, దళితుల సమస్యలు, ఇటీవలనే తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశం సందర్భంగా గవర్నర్ ప్రసంగంలో జరిగిన అంశాలపై సంపత్ మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం కుదేలు అవుతోందన్నారు. పంటలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ వ్యాప్తంగా దళిత వర్గాలపై దాడులు, హత్యలు పెరిగాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలోని టీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టడంతో.. కాంగ్రెస్ పార్టీపై కక్షతో వ్యవ హరిస్తోందని వివరించారు. గవర్నర్ ప్రసంగంపై అసెంబ్లీలో నిరసన తెలిపితే.. ఇద్దరి ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా ప్రధాన ప్రతిపక్ష నేతతో పాటు ఎమ్మెల్యేలు, మండలిలో ఎమ్మెల్సీలను బడ్జెట్ సమా వేశాల మొత్తం సస్పెన్షన్ వేటు వేశారని ఆయన వివరించారు. కాగా సంపత్‌కు ఏఐసీసీ ప్లీనరీలో మాట్లాడే అవకాశం దక్కడంపై పలువురు పార్టీ నేతలు అభినందించారు.



పరిశ్రమల రాయితీ బకాయిలు
రూ.1,793 కోట్లు

- రెండేళ్లుగా చెల్లింపుల్లేవు
- ఆచరణకు నోచుకోని ప్రభుత్వహామీలు
- ఆందోళనలో పారిశ్రామిక వర్గాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు భారీగా రాయితీలు ఇస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం మొండిచేయి చూపుతోంది. నూతన పారిశ్రామిక విధానంలో పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా టిఎస్-ఐపాస్ రూపొందించి భారీగా రాయితీలు, సబ్సిడీలు ఇస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. రాష్ట్రంలో ఉన్న వనరులు, రాయితీలు, ప్రోత్సాహకర విధానాలతో పెట్టుబడులు పెట్టేందుకు అనేక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. నూతన విధానంతో సూక్ష్మస్థాయి నుంచి భారీ పరిశ్రమల వరకు లక్ష కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కంపెనీల కేటగిరిని బట్టి రాయితీలు, ప్రోత్సాహకాలు నిర్ధారించారు. అలాగే ఎస్సీ ఔత్సాహికులకు ప్రత్యేక రాయితీలు ప్రకటించి ప్రభుత్వం తన ఉదాసీనత చాటుకుంది. కానీ పారిశ్రామిక విధానం మేరకు, ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడంలో మాత్రం ఆశించిన మేర ఆచరణలో చూపలేకపోయింది.

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ప్రభుత్వం ఇచ్చే రాయితీలపైనే ఆశలు పెట్టుకున్నాయి. మరోవైపు మధ్య తరహా, భారీ పరిశ్రమలకు భూ మార్పిడి, విద్యుత్ టారీఫ్‌లపై సబ్సిడీ ఇస్తే వెసులుబాటు కలుగుతుందని ఆశించాయి. పరిశ్రమలు పెట్టేపుడు చూపించిన చొరవ, శ్రద్ధ ఆ తర్వాత కనిపించిన దాఖలాలు లేవని పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 12వ తేదీనాటికి రూ.1,793.41 కోట్ల మేరకు పరిశ్రమలకు రాయితీ బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయితే ఇందులో రూ.50 కోట్ల వరకు ఎల్‌వోసీ ఇచ్చి నిధుల విడుదలకు ఉత్తర్వులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో జనరల్ కేటగిరిలో రూ.1,255.58 కోట్లు, ఎస్‌సిపి కేటగిరిలో రూ.329.96 కోట్లు, టిఎస్‌పి కేటగిరిలో రూ.207.87 కోట్ల మేరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి పారిశ్రామిక కమిటీ సమావేశంలో ఈ అంశంపై ఇటీవల చర్చించినప్పటికీ నిధుల విడుదలపై అధికారుల నుంచి స్పష్టత రాలేదని తెలుస్తోంది. ఇందులో విద్యుత్ టారీఫ్‌పై రాయితీలు, పావలా వడ్డీ, ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, సేల్స్‌ట్యాక్స్, స్టాంప్ డ్యూటీ, భూమి, భూమి మార్పిడి, తనఖాసుంకం, నైపుణ్యశిక్షణ కింద ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు అందాల్సి ఉంది. ఇందులో విద్యుత్ రాయితీనే దాదాపు రూ.400 కోట్ల మేరకు ప్రభుత్వం పారిశ్రామిక సంస్థలకు చెల్లించాల్సి ఉంది. అలాగే పావలా వడ్డీ కింద దాదాపు రూ.180 కోట్లు, సేల్స్ ట్యాక్స్ రూ.1000 కోట్లకుపైగా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గత రెండేళ్ళుగా జిల్లాస్థాయి పారిశ్రామిక కమిటీలు సిఫారసు చేసిన నిధులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.1,793 కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు



ఆంధ్రప్రభ, హైదరాబాద్ వక్ఫ్ భూముల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ చెప్పారు. ఈ చర్యల్లో భాగంగానే భూ రికార్డుల ప్రక్షాళనలో వక్ఫ్ భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శనివారం హజ్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా మసీదుల మరమ్మతులు, లీకేజీలు, వైట్ వాషింగ్, విద్యుత్ మరమ్మతులు వంటి అంశాలపై సమీక్షించారు. 196 మసీదుల్లో సంబంధిత పనుల కోసం మొదటి విడతగా 50 శాతం నిధులు రూ. 93 లక్షల విలువైన చెక్కులను ఆయా మసీదు కమిటీలకు హోంశాఖ మంత్రి నాయినితో కలిసి ఆయన అందజేశారు. మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యతోనే మార్పు సాధ్యమవుతుందనే సంకల్పంతో 204 మైనార్టీ గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ తమది సెక్యులర్ ప్రభుత్వమని, అన్ని పండుగలను అందరి సంప్రదాయాలను ప్రభుత్వం గౌరవిస్తుందని చెప్పారు. షాదీ ముబారక్‌ద్వారా పేద మైనార్టీ కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధిలో మెదక్ ముందడుగు

జిల్లా ప్రగతికి పాస్‌పోర్టు కార్యాలయం నాంది

ఉపసభాపతి పద్మాదేవేందర్ రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ, ప్రభ న్యూస్ : మెదక్ జిల్లా కావడం పాస్‌పోర్టు కార్యాలయం రావడంఅభివృద్ధికి నాంది అని మెదక్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రమైన పోస్టాఫీస్‌లో పాస్‌పోర్టు కార్యాలయాన్ని పద్మాదేవేందర్‌రెడ్డి, ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెదక్ ఖ్యాతిని ఎల్లలు దాటించాలనే సంకల్పంతో అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. మెదక్‌కు పాస్‌పోర్టు కార్యాలయం రావడం మెదక్ ఎంపీ కృషియేనని ఆమె తెలిపారు. మెదక్ ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం పాస్‌పోర్టు ఎంక్వైరీలో పోలీసులు నెంబర్ 1గా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి, ఎస్పీ చందనాదీప్తి, శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జడ్పీచైర్మన్ రాజమణి మురళియాదవ్, ఫుడ్‌కార్పోరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, పోస్టల్ సూపరిండెంట్ సురేష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో
నిందితుల పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హెచ్‌సీయూలో విద్యార్థిపై అత్యాచారయత్నం కేసులో నలుగురు నిందితులను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటనకు సంబం ధించిన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 6.10 నిమిషాలకు ఈ ఘటన చోటు చేసుకుంది. నిందితులు పేర్లు అనిల్‌కుమార్ లోధా, ఉడిగి రేవంత్, రాము, రాములు. వీరిలో ఇద్దరు పాత నేరస్తులు ఉన్నారని పోలీసులు తెలిపారు. తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి మాట్లాడుకోవడానికి యూని వర్సిటీలో నల్లగుంట్ల లేక్ వద్దకు ఆమె వెళ్లింది. అదే సమయంలో ఈ నలు గురు అక్కడికి చేరుకుని తొలుత డబ్బులు డిమాండ్ చేశారు. భయపడి తమ వద్దనున్న డబ్బులను వారికి ఇచ్చేశారు. అయినా సరే ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఇద్దరూ ఆ నలుగురిని అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. యువతీ, యువకుడు ఇద్దరూ కలిసి ఆ నలుగురు యువ కులను ఎదుర్కోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇదే సమయంలో ఆ నలుగురు అమ్మాయిపై లైంగిక దాడికి యత్నించారు. కానీ, ఆ యువతి, యువతి స్నేహితుడు ప్రవీణ్ కలిసి ఎదుర్కొని బయటపడి పోలీసులకు రాత్రి 10.30కు ఫిర్యాదు చేశారు. మొదట పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు భయ పడ్డారు. కానీ, యూనివర్సిటీ మిత్రుల సహాయంతో వారు సేఫ్‌గా బయటపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పట్టుబడ్డ నలుగురు నిందితులు చిన్నా చితక పనులు చేసుకునేవారు. డాగ్‌స్క్వాడ్, యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ నలుగురు నిందితులను పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గుల్ మెహర్ పార్కు నుంచి ఆ నలుగురు వచ్చినట్లు గుర్తించి కనుగొన్నామన్నారు. కాగా, నలుగురు నిందితులు మైనర్లేనని, వారిలో ఇద్దరు పాత నేరస్తులని డీసీపీ విశ్వ ప్రసాద్ తెలిపారు.

రాష్ట్రం మారినా పేరు మారలేదు

రెవెన్యూ, రాబడుల పుస్తకంలో ఇంకా ఆంధ్రప్రదేశ్ పేరే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ఆర్థికశాఖ ఇంకా ఆంధ్రప్రదేశ్ యావ నుంచి బయటపడినట్లు లేదు. అందుకే బడ్జెట్ పుస్తకాల్లోనూ తెలంగాణకు బదులు ఆంధ్రప్రదేశ్ అని ప్రింట్ చేయించింది. వాస్తవానికి పుస్తకాలు ప్రింటింగ్‌కు వెళ్ళేటపుడు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, జాయింట్ సెక్రటరీలు పరిశీలిస్తారు. కానీ ఆంధ్రప్రదేశ్ అనే పదం వారెవరికీ కనిపించకపోవడం గమనార్హం. 'రెవెన్యూ, రాబడులు సవరించిన అంచనాలు' పేర పుస్తకంలోని 6వ పేజీలో కన్సాలిడేటెడ్ ఫండ్ మొత్తాన్ని చూపే క్రమంలో 'టోటల్-1 కన్సాలిడేటెడ్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. నిజానికి ఇక్కడ కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ తెలంగాణ అని ఉండాలి. కానీ ఆర్థికశాఖ అధికారులు ఉమ్మడి రాష్ట్ర పుస్తకాల నుంచి సమాచారాన్ని తీసుకునే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌గానే ఉంచేశారు.

తిరుమలకు ఎలక్ట్రిక్ బస్సులు



తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల ఘాట్‌రోడ్డులలో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టిన కరెంట్‌బస్సు శనివారం తిరుమలకు చేరుకుంది. ట్రైల్‌రన్‌లో భాగంగా తిరుపతి నుంచి తిరుమలకు చేరుకుంది. ఇందుకు గాను అలిపిరి, తిరుపతి డిపోలకు చెందిన కొంతమంది డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ బస్సులో 31 మంది కూర్చునేందుకు ఏర్పాటు చేశారు. లోపలిభాగంలో ఆకుపచ్చని సీట్లతో గో గ్రీన్, లైవ్ గ్రీన్ అంటూ పర్యావరణ రహితంగా ఉంది. తిరుమల చేరుకున్న ఈ బస్సును చూడడానికి చూడడానికి భక్తులు పోటీపడ్డారు.

జీఎస్ఎల్వీ ప్రయోగం విజయవంతం కావాలి



తిరుమల, ప్రభన్యూస్: కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మొదటిసారిగా దర్శించుకున్నానని ఇస్రో చైర్మన్ శివన్ అన్నారు. ఆయన శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ స్వామివారిని మొదటిసారిగా దర్శించు కోవడం చాలా ఆనందంగా ఉందని ఈనెలాఖరు లోపు జిఎస్ఎల్వీ నింగిలోకి దూసుకెళ్ళడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రయోగం విజయవంతం కావాలని అందుకోసం స్వామివారి ఆశీస్సులు పొందడానికి వచ్చానన్నారు. అలాగే పిఎస్ఎల్వి జిషాట్‌లెవెల్ అనే అతిపెద్ద శాటిలైట్‌ను లాంచ్‌చేయ డానికి అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సముద్రంలో చేపలవేటకు వెళ్ళే వారికోసం ఒక కొత్తయాప్‌ను సిద్ధం చేసినట్లు త్వరలోనే ఈ విధానాన్ని వాడుకలోకి తేనున్నట్లు తెలిపారు. వీటన్నింటికి మోడీ ప్రభుత్వం చాలా సహకారం అందిస్తుందని ఆయన విలేకరులకు చెప్పారు.

డబ్ల్యూటీవో భేటీకి పాక్ నో

- దౌత్యాధికారులపై వేధింపులను కారణంగా చూపుతున్న పాకిస్తాన్
- రేపు, ఎల్లుండి ఢిల్లీలో ప్రపంచ వాణిజ్య సదస్సు సమావేశం



న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య గత కొన్ని రోజులుగా దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. తమ రాయబారులు వేధింపులకు గురవుతున్నారంటూ ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలో ఢిల్లీలో జరగబోయే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) సమావేశానికి తాము హాజరుకాలేమని పాక్ చెప్పింది. ఈమేరకు ఆ దేశ దౌత్య వర్గాలు వెల్లడించినట్టు సమాచారం. మార్చి 19, 20 తేదీల్లో ఢిల్లీ వేదికగా డబ్ల్యూటీవో మంత్రిత్వ స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని పాక్ వాణిజ్య శాఖ మంత్రి పర్వేజ్ మాలిక్‌కు గత నెలలో భారత్ ఆహ్వానం పంపింది. అయితే ప్రస్తుతం ఆయన ఈ సమావేశానికి రావడంలేదట. 'ఇటీవల ఇరు దేశాల మధ్య చోటుచేసుకున్న విభేదాల నేపథ్యంలో డబ్ల్యూటీవో సమావేశం నుంచి పాక్ తప్పుకుంటోంది' అని పాక్ దౌత్యవర్గాలు తెలిపాయి. సదస్సుకు రాకూడదని పాక్ చివరి నిమిషంలో నిర్ణయం తీసుకుందని, దీనిపై తాము స్పందించ బోమని భారత అధికారులు చెబుతున్నారు. ఇటీవల భారత్, పాక్ మధ్య దౌత్యాధికారుల విషయమై విభేదాలు తలెత్తిన విషయం విదితమే.

భారత్‌లో తాము వేధింపులకు గురవుతు న్నామంటూ పాక్ హైకమిషన్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన భారత్ దీనిపై విచారణ చేపడతామని హామీ ఇచ్చింది. అయితే, ఇస్లామాబాద్‌లోని భారత్ హైకమిషన్ సిబ్బంది కూడా ఏళ్ల తరబడి వేధింపులకు గురవుతున్నారని భారత్ కూడా ఆరోపించింది. కానీ పాక్‌లా తాము మీడియా దృష్టికి తీసుకెళ్లకుండా దౌత్యపరంగా చర్చించుకోవాలనుకుంటున్నామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే డబ్ల్యూటీవో సమావేశం ఏర్పాటు చేసినట్టు భారత్ పేర్కొంది.

రాహుల్ ట్విట్టర్ ఖాతా మారింది



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఎట్టకేలకు తన ట్విట్టర్ ఖాతా పేరును మార్చుకున్నారు. ఆఫీస్ ఆఫ్ ఆర్జీ నుంచి రాహుల్ గాంధీగా ట్విట్టర్ ఖాతా పేరును మార్చేశారు. పాత పేరుపై నెటిజన్ల నుంచి విమర్శలు, కామెంట్లు రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆఫీస్ ఆఫ్ ఆర్జీ పేరుపై పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించడమే కాకుండా.. రాహుల్ గాంధీ తన ట్విట్టర్ ఖాతాను వేరేవ్యక్తులతో నడుపుతున్నారని, పేరుకూడా సిల్లీగా ఉందని విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలో గతంలో తన ఖాతాను తన పెంపుడు శునకం పిడీ రన్ చేస్తుందని రాహుల్ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. సన్నిహితులు, ఐటీ నిపుణులు కూడా ఇచ్చిన సలహా మేరకు రాహుల్ గాంధీ తన ట్విట్టర్ ఖాతా పేరును మార్చివేసినట్లు సమాచారం.

నీరవ్ భూముల్లో రైతుల పాగా



అహ్మద్‌నగర్: మహారాష్ట్ర అహ్మద్ నగర్ జిల్లాలో నీరవ్ మోడీకి చెందిన 250 ఎకరాల భూములను రైతులు ఆక్రమించుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వేలాది కోట్ల రుణాలను ఎగవేసిన కేసులో ప్రధాన నిందితు డు అయిన మోడీ,మార్కెట్ రేటు ప్రకారం ఎకరా ఇరవైలక్షల రూపాయిలు ఉన్న తమ భూములను మోడీ, ఆయన అనుచరులు పదివే ల రూపాయిల వంతున అక్రమ పద్ధతుల్లో, అధికారుల సాయంతో కొనుగోలు చేశారని రైతులు ఆరోపించారు. తమ భూము లను కారుచౌ క ధరకు కొనుగోలు చేసి,మరో వంక బ్యాంకులకు టోపీ పెట్టి విదేశా లకు పారిపోయిన నీరవ్ మోడీపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని స్థానిక మీడియా పేర్కొంది. రైతులు నీరవ్ భూములను ఆక్రమించుకుని వాటిని సాగు చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారని మీడియా తెలిపింది.కాగా,నీరవ్ మోడీ అహ్మద్ నగర్ జిల్లాలో అక్రమంగా భూములు కొనుగోలు చేసిన వ్యవహారంపై గాంధేయ వాది అన్నా హజారే కూడా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై మార్చి 23వ తేదీన ఢిల్లీలో ఆందోళన జరిపేందుకు ఆయన స మాయత్తమవుతున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆయన ఓ లేఖ రాశారు.

భారత్‌లో తీరని హాకింగ్ కోరిక

దివ్యాంగులకు చారిత్రాక కట్టడాల సందర్శన తేలిగ్గా ఉండేలా చూడాలని సూచన



న్యూఢిల్లీ: ప్రపంచ ప్రసిద్ధి చెందిన దిగ్గజ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్‌కు తీరని కోరిక ఒకటి మిగిలిపోయింది. ఈ విషయం ఒక లేఖ ద్వారా వెల్లడైంది. స్టీఫెన్ గత బుధవారం దివంగతుడైన విషయం విదితమే. 17 ఏళ్ల క్రితం స్టీఫెన్ భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ (ఎన్‌సీపీఈడీఎల్) డైరెక్టర్ జావేద్ అబిదికి ఒక లేఖ రాశారు. భారత్‌లో చారిత్రాత్మక ప్రదేశాలైన హుమాయున్ సమాధి, జంతర్ మంతర్, కుతుబ్ మినార్, తాజ్‌మహల్ వంటి ప్రదేశాలు చూడాలని ఉందని ఆ లేఖలో వెల్లడించారు. అవయవ లోపం ఉన్నవారు ఆ పర్యటనను తేలిగ్గా చేసేలా ఏర్పాట్లు చేయమని కోరారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకూ అటువంటి లేఖనే పంపారు. కానీ ఆ అధికారులు 'ఒక్క ఇటుక కూడా కదిలించం. యథాతథ స్థితిలోనే చూడాల్సి ఉంటుంది' అన్నట్లు వ్యవహరించారు. దీంతో హాకింగ్ కేవలం కుతుబ్ మినార్, జంతర్‌మంతర్ మాత్రమే చూడగలిగారు. అక్కడ కూడా తాత్కాలికంగా ఏర్పాటుచేసిన ర్యాంప్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అయితే ఆయన పర్యటన దేవంలోని ప్రముఖ కట్టడాలు దివ్యాంగులు చూడటానికి అనుకూలంగా మారడానికి కారణం అయ్యాయి. ఈ ఏర్పాట్ల కోసం దివ్యాంగులు ఎప్పటినుంచో పోరాటం చేస్తున్న విషయం విదితమే. అయితే, మన దేశంలో హాకింగ్ పర్యటన అనంతరం అప్పటి పర్యాటక శాఖ మంత్రి అనంతకుమార్ తాజ్‌మహల్ సహా మిగతా కట్టడాలన్నింటిని అందరూ చూడగలిగే ప్రదేశాలుగా మారుస్తామని ప్రకటించారు. హాకింగ్ భారత్‌లో పర్యటించిన 15 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిజబిలిటీస్ 50 చారిత్రక కట్టడాల్లో దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించాయి. వాటిలో భాగంగా దివ్యాంగులకు అనుకూలమైన టాయిలెట్లు, రెయిలింగ్స్, ర్యాంపులు నిర్మిస్తారు. హాకింగ్ తాజ్‌మహల్‌ను చూడలేకపోయినా ఆయన రావడం వల్లే ఇప్పుడు అనేక మంది దివ్యాంగుల కోరిక నెరవేరుతోంది.

'తమిళ ఉగాది'న కొత్త పార్టీ

- అదేరోజు పార్టీ విధి విధానాల ప్రకటన
- జెండా అజెండా ఖరారు




చెన్నై: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ తాను ప్రారంభించే కొత్త పార్టీ పేరును ఏప్రిల్ 14వ తేదీన ప్రకటించే అవకాశం ఉందని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఆయన ప్రస్తుతం హిమాలయాల్లో తన గురువు ఆశ్రమంలో ధ్యాన ముద్రలో ఉన్నారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత కొత్త పార్టీ పేరు ప్రకటించ వచ్చనీ, 35 ఏళ్ళ లోపు వారినితమ పార్టీలో చేర్చుకోవచ్చని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. రాజుమహాలింగం, సుధాకర్‌లు ఆయన పార్టీకి రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైనట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

రాజకీయాలు మమ్మల్ని విడదీస్తాయి రజనీతో మైత్రిపై కమల్

సూపర్ స్టార్ రజనీకాంత్ తానూ మంచి మిత్రులమనీ, రాజకీయాలు తమను విడదీస్తాయనీ,అది సహజమని తమిళనటుడు,ఆల్ రౌండర్ కమల్ హసన్ అన్నారు. తాను కొత్తగా రాజకీయ పార్టీని పెట్టినట్టే, రజనీకాంత్ కూడా పార్టీ పెట్టాలని నిర్ణయించు కున్నారనీ, ఇద్దరి రాజకీయ దృక్పథాలు వేరైనందున కలిసే అవకాశం లేదనీ, అంతమాత్రాన తాము వ్యక్తిగతంగా విరోధులం కామనీ, మంచి మిత్రలమని కమల్‌హసన్ ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

రజనీకాంత్ మానవీయ కోణంలో ఎన్నో మంచి కార్యక్రమాలను చేశారనీ, అలాగే, ఆయన గొప్ప ఆధ్యాత్మిక చింతనా పరుడని ప్రశంసిస్తూనే, ఆయనవి ఆధ్యాత్మిక రాజకీయాలంటూ చురక అంటించారు.సినీ రంగంలో కూడా రజనీ పోషించిన పాత్రలకూ,తాను పోషించిన పాత్రలకూ చాలా తేడా ఉందని కమల్ హసన్ అన్నారు.తాను అన్ని మతాలనూ గౌరవిస్తాననీ, తనకు ఫలానా మతం అనేదిలేదని ఆయన అన్నారు.

నేడు కశ్మీర్‌లో దలైలామా పర్యటన




జమ్ము: టిబెటన్ ఆధ్యాత్మిక నేత దలైలామా నేడు జమ్ము కాశ్మీర్లో పర్యటించనున్నారు. జమ్ము సెంట్రల్ యూనివర్సిటీ ప్రథమ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ సందర్భంగా కాశ్మీర్ రాష్ట్ర మంత్రి డోర్జే, సీఎం సలహాదారు అమితాబ్ మట్టూ ఆయనకు హార్థిక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త దలైలామా మాట్లాడుతూ ఇక్కడ ప్రజలకు నా ప్రత్యేక అభినందనలు తెలపాలనుకుంటున్నాను అన్నారు. మనమంతా ఎల్లప్పుడూ ప్రశాంతమైన మనసు కలిగి ఉండాలన్నారు. కోపం మనల్ని అధిగమించకుండా చూసుకోవాలన్నారు. ఆగ్రహం మన జ్ఞానానికి అడ్డుగా నిలుస్తుందన్నారు. క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం కనుగొనకుండా నిరోధిస్తుందన్నారు. ఏ ప్రాంతంలోని మనుషులైనా శారీరకంగా, మానసికంగా ఒకేవిధంగా స్పందిస్తారన్నారు. ప్రతిఒక్కరూ ఆనందంగా ఉండాలనే కోరుకుంటారన్నారు. ప్రశాంతమైన మనసే ఆనందానికి మూలం అని దలైలామా అన్నారు.

రోహింగ్యాలపై సుప్రీం జోక్యం తగదు

న్యూఢిల్లీ: రోహింగ్యా ముస్లిం శరణార్థుల విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోరాదని కేంద్రం కోరింది. ఈ మేరకు కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. భారత్ విదేశీ చొరబాటుదార్లనుంచి ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటుందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సరిహద్దు దేశాల నుంచి అక్రమంగా వస్తున్న వలసదారులతో ఉగ్రవాదం పెనవేసుకునే అవకాశం ఉందన్నారు. ఉగ్రవాదం వల్ల దేశంలో ఇప్పటికే ఎంతోమంది అమాయకులు, రక్షక దళ సిబ్బంది తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. చట్టపరంగా సార్వభౌమ దేశాల సరిహద్దులను భద్రంగా ఉంచడం తప్పనిసరి అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్రానికి ఎటువంటి ఆదేశం జారీ చేయరాదని ఈ సందర్భంగా అభ్యర్థిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. శరణార్థుల విషయంలో ఐక్యరాజ్యసమితిలో భారత్ ఎటువంటి ఒప్పందంపై సంతకం చేయలేదని ఈ సందర్భంగా కేంద్రం గుర్తు చేసింది.

ఉప ఎన్నికల రిజల్ట్స్ ఎఫెక్ట్ సివిల్స్ అధికారుల బదలీ



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో తాజాగా గోరఖ్‌పూర్, ఫూల్పూర్ నియోజకవర్గాల్లో జరిగిన రెండు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఘోర పరాజయం చవిచూసిన నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 16 మంది జిల్లా కలెక్టర్లు సహా మొత్తం 37 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. గోరఖ్‌పూర్ స్థానంలో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఇక్కడ బీజేపీ పరాజయం పొందగా, సమాజ్‌వాదీ పార్టీ ఘనవిజయం సాధించింది. కాగా, ఉప ఎన్నికల ఫలితాలు వెలువడి నాలుగు రోజులు కూడా కాకముందే ఆదిత్యనాథ్ ప్రభుత్వం భారీ ఎత్తున ఉన్నతాధికారులకు బదిలీలు చర్చనీయాంశమయింది. స్థానచలనం పొందిన వారిలో గోరఖ్‌పూర్ కలెక్టర్ రాజీవ్ రౌతెలా కూడా ఉన్నారు. గత బుధవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజీవ్ కౌంటింగ్ కేంద్రంలో మీడియాకు అనుమతి నిరాకరించి వార్తల్లోకి ఎక్కారు. తాజాగా ఆయన స్థానంలో గోరఖ్‌పూర్ కలెక్టర్‌గా డివిజనల్ కమిషనర్ దేవీపాటన్‌కు పదోన్నతి కల్పించారు. అయితే, రాష్ట్రంలో మతోన్మాదం పెరుగుతోందంటూ ఇటీవల సోషల్‌మీడియాలో వివాదం రేపిన బరేలి కలెక్టర్ రాఘవేంద్ర సింగ్‌పైనా బదిలీ వేటుపడింది.

న్యాయం ఖరీదైపోయింది

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవేదన



కటక్: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ భారతీయ న్యాయవ్యవస్థ పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అది ఖరీదైనదిగా, అంతులేని జాప్యాలకు పేరుగాంచిందని అన్నారు. రాష్ట్రపతి శనివారం ఇక్కడి నేషనల్ లా యూనివర్శిటీ వద్ద మూడవ వ్యవస్థాపక దినోత్సవ ప్రసంగం చేస్తూ ధనికులతో సమంగా న్యాయం పేదలకు అందుబాటులో లేని పక్షంలో అది మన గణతంత్ర నైతికతలకు అవరోధమవుతుందని వ్యాఖ్యానించారు. అడ్వకేట్లు ఒక అత్యవసరానికి స్పందించడానికి బదులుగా న్యాయ ప్రక్రియల్లో జాప్యం కోసం వాయిదాల ఉపకరణాన్ని ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారని అన్నారు. కక్షిదారు కోసం న్యాయాన్ని పణంగా పెడుతున్నారని వ్యాఖ్యానించారు. న్యాయం అందించేలా కోర్టుకు సాయమందించడం న్యాయవాదుల విధి అని రాష్ట్రపతి తెలిపారు. కేవలం మన:పూర్వకంగా కాకుండా హృదయపూర్వకంగా న్యాయవాద వృత్తిని చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. వారు(న్యాయవాదులు) తమ ఆలోచనాపరిధికి ఆవల, నాల్గవ పారిశ్రామిక విప్లవం కోసం, కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కోసం నియమాలు, న్యాయ చట్రాలను రూపొందించాలని కోవింద్ కోరారు. డ్రైవర్ రహిత కార్లు కావొచ్చు, వ్యవసాయం, వైద్యంలో ఆవిష్కరణలు కావొచ్చు మానవులు, యంత్రాల మధ్య సరికొత్త సమీకరణల కోసం వారు చట్టాలు రాయాలి అని రాష్ట్రపతి సూచించారు. కార్యక్రమానికి హాజరైన భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా మాట్లాడుతూ యూనివర్శిటీ నుంచి పట్టభద్రులైన విద్యార్థులు స్వేచ్ఛ, న్యాయం, సమానత్వానికి మూల స్తంభాలుగా మారాలని అన్నారు.

నెహ్రూ విగ్రహానికి నల్లరంగు



బుర్ద్వాన్: భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విగ్రహంపై నల్లరంగు పూ సిన ఘటన పశ్చిమ బెంగాల్లోని కాత్వాలో జరిగింది. మైదానంలో ఉన్న నెహ్రూ విగ్రహానికి నల్లరంగు పూసి ఉండటాన్ని ఉదయాన్నే స్థానికులు గుర్తించి పోలీసుల కు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈనేపథ్యంలో సమాచారం అందుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు నెహ్రూ విగ్రహంపై దుశ్చర్యకు పాల్పడినవారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన ఫిర్యాదును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ఘటనపై స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నేతలు సైతం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నెహ్రూ విగ్రహాన్ని శుభ్రం చేయటంతో వివాదం సద్దుమణిగింది. కాగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ బీజేపీ నేతలే ఈ దుశ్చర్యకు పూనుకున్నారని ఆరోపించగా కాషాయ పార్టీ నేతలు తోసిపుచ్చారు. తమ కార్యకర్తలు ఎవరూ ఈ ఘటనకు పాల్పడలేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వారం.. వారం.. జనగణమన

- మారుమూల గ్రామంలో వెల్లివిరిసిన దేశభక్తి
- వారంలో ఒకరోజు జాతీయగీతాలాపన
- 52 సెకన్లపాటు పనులకు బ్రేక్
- విద్యార్థులతో గొంతు కలుపుతున్న గ్రామస్థులు



అభయ్‌నగర్: అదో మారుమూల గ్రామం..గ్రామంలో చదువుకున్నవారు చాలా తక్కువ.. అయితేనేం దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారంలో ఒక రోజు అంకితభావంతో స్కూల్ విద్యార్థులతో గొంతుకలుపుతున్నారు.జాతీయగీతాన్ని ఆలపిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలోని అభయ్‌నగర్ వాసులు దేశ భక్తిలో తమకు సాటి లేరని నిరూపించుకుంటున్నారు. వారంలో ఒక రోజు జాతీయగీతాన్ని ఆలపించడంలో తమదైన శైలితో ఆకట్టుకుంటున్నారు. కేవలం స్కూల్ విద్యార్థులే కాకుండా గ్రామంలోని ప్రజలంతా వారంలో ఒక రోజు ఉదయం 10.50 గంటలకు సరిగ్గా 52 సెకన్ల పాటు ఏ పనిలో ఉన్న వాటిని పక్కనబెట్టి జాతీయ గీతం ఆలపిస్తున్నారు. అభయ్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వారాంతం రోజు జాతీయ గీతాన్ని ఆలపించేసమయంలో గ్రామంలోని ప్రజలు కూడా పనులు మానుకుని వారితో గొంతుకలుపుతున్నారు. స్కూల్ పరిసరాల నుంచి దాదా పు 100 ఫీట్ల వరకు విద్యార్థుల ఆలపించే జాతీయ గీతం వినబడేలా లౌడ్ స్పీకర్లు కూడా ఏర్పాటు చేయడంతో..చిన్నా, పెద్దా, ఆడ, మగ తేడా లేకుండా విద్యార్థులతో పాటే జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారు. స్కూల్‌లో మొత్తం 115 మంది విద్యార్థులున్నారు. వారు కూడా వారివారి కుటుంబీకులను జాతీయగీతాలాపనపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో, గ్రామ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు వారాంతం రోజు ప్రత్యేకంగా జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. జాతీయ గీతాలాపన సమయంలో ఎవరు ఏ పనిలో ఉన్నా విద్యార్థులతో కలిసి గొంతు కలపాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశాం. వారు కూడా మా అభ్యర్థనను మన్నించి జాతీయగీతాలాపనలో భాగస్వాములౌతున్నారు.

భారత్ నమ్మదగిన దేశం అమెరికా



వాషింగ్టన్: భారత్ అమెరికాకు అత్యంత ముఖ్యమైన, ప్రధానమైన వ్యూహాత్మక భాగస్వామి అని అమెరికా-ఆసియా పసిఫిక్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ హ్యారీ హారీస్ అన్నారు. భారత్ అమెరికా మిత్ర దేశాల్లో అతి పెద్ద దేశమని ఆయన అన్నారు. ఇరుదేశాలూ ప్రజాస్వామ్య విలువలు,సంప్రదాయాలకు కట్టుబడి ఉన్నాయనీ, అలాగే,ఉగ్రవాదంతో సహా అనేక సమస్యలపై ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నాయని ఆయన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. భారత్ అణ్వస్త్ర సంపన్నదేశమైనప్పటికీ, శాంతికాముక దేశమనీ, అన్ని విధాల నమ్మదగినదేశమని ఆయన అన్నారు. ఆయన సెనేట్ సాయుధ దళాల కమిటీ సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తూ,భారత్,జపాన్,ఆస్ట్రేలియా, అమెరికాలు కూటమిగా ఏర్పడాలన్నది మంచిఆలోచన అనీ,ఈ కూటమి ఏర్పడితే ప్రపంచానికి మేలు జరుగుతుందని ఆయన అన్నారు.ఈ నాలుగు దేశాలు అనేక అంశాలపై ఏకాభిప్రాయాన్ని కలిగి ఉన్నాయని, శాంతినే కోరుతున్నాయని ఆయన అన్నారు.

చైనా శాశ్వత అధ్యక్షుడు జిన్‌పింగ్

- కలిసొచ్చిన రాజ్యాంగ సవరణ
- జీవితకాలం అధ్యక్ష పదవిలో కొనసాగింపు
- సంస్కరణలకు పెద్దపీట
- అవినీతిపై ఉక్కుపాదం



బీజింగ్: జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ)కు అత్యంత విశ్వాస పాత్రుడిగా ఉన్న జిన్‌పింగ్ సంస్కరణలకు పెద్దపీట వేసిన ఆయనకు జీవిత కాలం వరకు అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తూ పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేశారు. గతంలో చైనాలో ఏ వ్యక్తి అయిన రెండుసార్లకు మించి అధ్యక్ష పదవిని అలంకరించేందుకు అనర్హులు.

ఈ లెక్కన జిన్‌పింగ్ కూడా 2023 తర్వాత అధ్యక్ష పదవికి పోటీపడే అవకాశం ఉండేది కాదు. అయితే ఇటీవల రాజ్యాంగ సవరణ చేసిన చైనా పార్లమెంట్ ఇక మీదట చైనా అధ్యక్షుడికి కాలపరిమితి ఉండబోదని పాత నిబంధనలను తొలగించారు. దీంతో జిన్‌పింగ్ జీవితకాలం అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం లభించింది. చైనా అధ్యక్ష పదవితో పాటు సర్వ సైన్యానికి హైకమాండ్‌గా వ్యవహరించే అత్యంత శక్తివంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ అధినేతగా కూడా జిన్‌పింగ్ ఎంపిక య్యారు.

కొత్త ప్రభుత్వంలో ప్రధాని లీ కెకియాంగ్ మినహా ఉన్నత స్థాయి అధికారులు, మంత్రిమండలి, సెంట్రల్ బ్యాంకు గవర్నర్ మారబోతున్నారు. చైనాలోని అధికార కమ్యూనిస్ట్ నేషనల్ పార్టీ అధ్యక్షుడి, ఉపాధ్యక్షుడి పదవీకాల పరిమితిని ఎత్తేస్తూ ప్రతిపాదించిన చట్ట సవరణను ఈనెల 11న నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌కు చెందిన 2900 మంది డిప్యూటీలు ఆమోదించారు.


అవినీతిపై జిన్‌పింగ్ యుద్ధం

2013లో చైనా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జిన్‌పింగ్ పరిపాలనలో అత్యంత కఠినంగా వ్యవహరించారు. అవినీతి విషయంలో ముక్కుసూటిగా వ్యవహరించడంతో పాటు.. విదేశీ విధానంలో అత్యంత రాజకీయ చతురతను ప్రదర్శించారు. ముఖ్యంగా దక్షిణ సముద్రంపై చైనా ఆధిపత్యం పెరగడంతో జిన్‌పింగ్ ముద్ర ఎంతగానో ఉంది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా కూడా జిన్‌పింగ్‌కు పెద్దపీట వేసింది. ఆయన తీసుకున్న ప్రతీ నిర్ణయం సబబేనని స్పష్టం చేసింది.

ఉపాధ్యక్షుడిగా వాంగ్

చైనా ఉపాధ్యక్షుడిగా వాంగ్ ఎన్నికయ్యారు. జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమం వాంగ్ ఆధ్వర్యంలో జరుగుతోంది. వాంగ్ ఇప్పటికే వంద మంది మంత్రులు సహా 1.5మిలియన్ల మంది అధికారులకు శిక్షలు వేశారు.

రామజన్మభూమిపై ఆర్డినెన్స్ తెండి



న్యూఢిల్లీ: అయోధ్యలో వివాదాస్పద స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం ద్వారా రామజన్మభూమి నిర్మాణానికి మార్గాన్ని సుగమం చేయాలనీ, ఇందుకు అవసరమైన ఆర్డినెన్స్‌ను తీసుకుని రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి రాసిన లేఖలో బీజేపీ ఎంపీ డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి డిమాండ్ చేశారు. వివాదాస్పద ప్రదేశాన్ని స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌నితీసుకుని రావాలనీ, ఆ తర్వాత ఆ భూమిని హిందూ మతాధిపతులు,ఆగమశాస్త్ర పండితులతో కూడిన కమిటీకి స్వాధీనపర్చాలనీ, తద్వారా రామాలయం నిర్మాణానికి మార్గాన్ని సుగమం చేయాలని ఆయన ప్రధానిని కోరారు.రామజన్మ భూమి కేసు పరిష్కారం కాకుండా కాంగ్రెస్ నాయకులు లాయర్లను ప్రభావితం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రామాలయం నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి రాజ్యాంగాన్నీ, చట్టాన్ని ఆయుధంగా చేసుకుని పోరాటం సాగిస్తామని ఆయన అన్నారు.

క్రీడాప్రభ

చేదెవరికో... తీపెవరికో..

నిదహాస్ ట్రోఫీ.. శ్రీలంకకు స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు కావస్తున్న సందర్భంలో ఆదేశం నిర్వహిస్తున్న టోర్నీ. కప్పు గెలవాలని ఆశించిన ఆతిథ్య జట్టు కనీసం ఫైనల్‌కు కూడా చేరలేకపోయింది.ఇక మిగిలింది సాటి ఆసియా జట్లు ఇండియా, బంగ్లాదేశ్‌లు. మరీ ఉగాదినాడు రోహిత్ సేన విజయంతో తీపి పంచుతుందా లేక ఓటమితో చేదునిస్తుందా?

- 'ఉగాది' పండగ చేస్తారా..
- నేడే ట్రై సిరీస్ ఫైనల్
- బంగ్లాతో భారత్ ఢీ

అనుకున్నట్టుగానే టైటిల్ ఫేవరేట్ భారత్ ఫైనల్‌కు చేరింది. అనుకోనివిధంగా, పలు నాటకీయ పరిస్థితులను దాటుకుంటూ ఒకప్పటి తూర్పు పాకిస్తాన్ కూడా ఫైనల్‌కు చేరింది. ఇప్పటివరకూ సిరీస్‌లో బంగ్లాపై ఆడిన రెండు మ్యాచ్‌లను గెలిచి ఆత్మవిశ్వాసంతో భారత్ వుంటే.. భారత్‌ను ఓడించే సత్తా వుందనే నమ్మకంతో బంగ్లా కనిపిస్తోంది. సిరీస్ ఆరంభంతో పోలిస్తే ఇరు జట్ల ఆటతీరులోనూ గణనీయమైన మెరుగు కనిపిస్తోంది కాబట్టి నేటి ఫైనల్ పోటాపోటీగానే వుంటుందనడంలో సందేహం లేదు.

సమతూకంగా బ్యాటింగ్

బ్యాటింగ్ దగ్గరికి వస్తే ఇరు జట్లూ సమతూకంగా కనిపిస్తున్నాయి. సిరీస్ ఆరంభంలో రోహిత్ శర్మ విఫలమవుతూ వస్తుండటం, రైనా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయకపోవడం, శిఖర్ మంచి ఆరంభాలు ఇచ్చినా జట్టు భారీ స్కోర్ సాధించడంలో విఫలమవడం వల్ల మెన్ ఇన్ బ్లూ బ్యాటింగ్‌లో బ్యాలెన్స్ లోపించినట్టు కనిపించేది. కానీ ఫైనల్‌కు చేరే గమనంలో అందరూ కుదురుకున్నారు. ఇదే తరహా తీరు బంగ్లాదేశ్‌లోనూ కనిపిస్తోంది. స్టార్ బ్యాట్స్‌మన్ మహ్మదుల్లా విఫలమవుతూ వస్తుండడం, మిడిలార్డర్ భారమంతా ముష్ఫికర్ మీద పడుతుండడం, ఓపెనర్లు ధాటిగా ఆడుతున్నా నిలదొక్కుకోలేకపోవడం ఇదీ ఆ జట్టు పరిస్థితి. ఫైనల్‌కు చేరే సమయానికి మహ్మదుల్లా ఫామ్‌లోకి రావడమే గాక ఆ జట్టును ఫైనల్‌కు చేర్చే ఇన్నింగ్స్ ఆడాడు. ఒత్తిడిలో, జట్టుకు అత్యంత అవసరమైన సమయాల్లో రాణించడం మహ్మదుల్లా నైజం. కాబట్టి అతడినుంచి మరో అద్భుత ఇన్నింగ్స్‌ను ఆశించొచ్చు. ఇక షకిబుల్ తిరిగి జట్టులోకి చేరడం మరింత లాభం చేకూర్చే విషయం.

చేజింగ్ కే లాభం

సిరీస్ ఆద్యంతం చేజింగ్ చేసిన జట్లకు అనుకూలంగా సాగింది. ఇప్పటి వరకూ జరిగిన 6 మ్యాచుల్లో ఐదింట్లో చేజింగ్ చేసిన జట్టు విజయం సాధించింది. చేజింగ్ చేస్తూ ఓడిపోయిన ఏకైక జట్టు బంగ్లాదేశ్ అయితే.. అది భారత్ మీదే కావడం విశేషం. ఆ మ్యాచ్‌లోనూ బంగ్లాదేశ్ దాదాపు గెలిచినంత పనిచేసింది అనేది గుర్తుంచుకోవాల్సిన అంశం. కాబట్టి మరోసారి టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునేందుకే అవకాశాలు ఎక్కువగా వున్నాయి.

ప్రేక్షకుల మద్దతు భారత్‌కే

సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వ్యవహరించిన తీరు కారణంగా శ్రీలంక ప్రేక్షకులు భారత్‌కే మద్దతు తెలుపుతారనే విషయం అర్థమవుతోంది. అంపైర్లు తప్పిదం చేసినారన్న నెపంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు బయటికి వెళ్లిపోతామంటూ బెదిరించడం, డగౌట్‌లో కూర్చున్న నూరుల్ హుసేన్ లాంటి వాళ్లు వచ్చి కెప్టెన్ పెరీరాతో గొడవకు దిగడం లాంటి అంశాల కారణంగా ప్రస్తుతం బంగ్లాదేశ్ జట్టు మీద ఆతిథ్య ప్రేక్షకుల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. దానికి తోడు మ్యాచ్ ముగిసిన తర్వాత బంగ్లాదేశ్ ఆటగాళ్లు రెచ్చగొట్టే విధంగా చేసిన నాగిని డ్యాన్స్‌పై కూడా లంక అభిమానులు గుర్రుగా వున్నారు. 19వ ఓవర్‌లో షకిబుల్ క్యాచ్ పట్టిన దనంజయ ఆనందంతో నాగిని డ్యాన్స్ చేయగా... మ్యాచ్ అనంతరం అదే రీతిలో బంగ్లా జట్టు మొత్తం డ్యాన్స్ చేశారు.




షకిబుల్, నూరుల్‌లకు ఫైన్

క్రికెట్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ప్రవర్తించినందుకు బంగ్లాదేశ్ ఆటగాళ్లు షకిబుల్ హసన్, నూరుల్ హసన్‌లు మ్యాచ్ ఫీజు లో 25 శాతం కోత విధించబడింది. దాంతో పాటూ 1 డీమెరిట్ పాయింట్ కూడా వారి ఖాతాలోకి వెళ్లింది. మ్యాచ్ కొన్ని నిమిషాల్లో ముగుస్తుందనగా అంపైర్ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ... బ్యాటింగ్ చేస్తున్న మహ్మదుల్లా, రుబెల్ హుసేన్‌లను బయటికి రావాలంటూ షకిబుల్ సైగలు చేయడంపై మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయమై మాట్లాడిన బ్రాడ్.. షకిబుల్, నూరుల్‌ల ప్రవర్తన అభ్యంతరకరంగా వుందన్నారు. ఫోర్త్ అంపైర్, మ్యాచ్ అధికారులు కలగజేసుకోకపోతే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా వుండేదని అన్నారు.

భారత్ మీద వ్యతిరేతక

బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లను భారత్‌లో చూసే విధానానికి, బంగ్లాలో చూసే విధానానికి చాలా తేడా వుంటోంది. పెద్ద జట్లకు ఎన్నిసార్లు షాకిచ్చినా ఇంకా బంగ్లాతో మ్యాచ్ అంటే పిల్లకాలవను దాటడంలాగానే భారత అభిమానులు భావిస్తున్నారు. కానీ బంగ్లాదేశ్ అభిమానులు మాత్రం చిరకాల ప్రత్యర్థితో మ్యాచ్‌లా భావించడం ఈమధ్య కాలంలో కనిపిస్తోంది. ఈరకమైన వ్యతిరేకత 2015 ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్ నుంచీ మొదలైంది అని చెప్పాలి. ఆ మ్యాచ్‌లోనూ అంపైర్ల నిర్ణయాలే వ్యతిరేకతకు ఆజ్యం పోశాయి. రోహిత్ శర్మ క్యాచ్ ఔట్ అయిన బంతిని నోబాల్‌గా ప్రకటించడం, ఆ తర్వాత అదే రోహిత్ సెంచరీతో భారత్‌కు 300 పైచిలుకు పరుగులు చేయడం.. బంగ్లా బ్యాటింగ్‌లోనూ కొన్ని నిర్ణయాలు ఆ జట్టుకు వ్యతిరేకంగా రావడం.. వీటన్నిటి మీదా సోషల్ మీడియాలో చర్చలు.. ఇలాంటి అంశాలన్నీ భారత జట్టు మీద బంగ్లా వ్యతిరేకతను క్రమక్రమంగా పెరిగేలా చేశాయి. ఆ మ్యాచ్ తర్వాత స్టార్ టీవీ వచ్చే మౌకా మౌకా యాడ్ కూడా బంగ్లా అభిమానుల అహాన్ని దెబ్బతీసింది. ఆ తర్వాత అదే ఏడాది బంగ్లాలో పర్యటించిన భారత జట్టు సిరీస్ కోల్పోయినప్పుడు ధోనీ తల నరికినట్టు పోస్టర్లు వేసి మరీ సంబరాలు జరుపుకోవడం భారతీయులను నివ్వెరపోయేలా చేసింది. బంగ్లాదేశ్ అభిమానులకు భారత క్రికెట్ జట్టు మీద ఇంత ద్వేషం వుందా అని సగటు భారత జట్టు అభిమాని అనుకునేలా చేసింది.


సాయంత్రం 7 గంటలకు ప్రత్యక్ష ప్రసారం డీ స్పోర్ట్స్, డీడీ స్పోర్ట్స్ జియో టీవీల్లో

పరువు కోసం పోరాటం

- ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డే
- ఇప్పటికే 2 - 0 సిరీస్ కోల్పోయిన భారత్

వదోదర: కంగారూలతో జరుగుతోన్న ట్రై సిరీస్‌లో తొలి రెండు వన్డేల్లోనూ భారీ పరాజయాలు మూటగట్టుకున్న భారత్.. ఆఖరి వన్డేలోనైనా గెలిచి పరువునిలుపుకోవాలని ఆశిస్తోంది. తొలి వన్డేను 8 వికెట్ల తేడాతో, రెండో వన్డేను 60 పరుగులు తేడాతో కోల్పోయిన భారత్‌కు ఆఖరి మ్యాచ్‌లోనూ అవకాశాలు పెద్దగా లేవనే చెప్పాలి. సిరీస్ ఆరంభానికి ముందు జరిగిన రెండు ప్రాక్టీస్ మ్యాచుల్లోనూ మిథాలీ సేన పేలవ ప్రదర్శన చేసింది. ఓ మ్యాచ్‌లో ఏకంగా 321 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఇక ఇండియన్ బౌలింగ్ మరీ దారుణంగా వుండడంతో కంగారూలు భారీ స్కోర్లు అవలీలగా చేయగలుగుతున్నారు. మరోవైపు టెస్టు మ్యాచులను తలపించే ఆటతీరును ఓపెనింగ్‌లో దిగే భారత బ్యాట్స్‌వుమన్ ప్రదర్శిస్తున్నారు. ఈ మ్యాచ్‌లోనైనా గెలవాలంటే ఆతిథ్య జట్టు మరింత దూకుడుగా వ్యవహరించాల్సిన అవసరం వుంది.

వీడియో 'రెఫరీ'కి పచ్చజెండా

- ఫుట్‌బాల్ ప్రపంచకప్



బొగోటా: వివాదాస్పదమైన వీఏఆర్ టెక్నాలజీని 2018 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఉపయోగించేందుకు రంగం సిద్ధమైంది. రష్యాలో జరగనున్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో వీఏఆర్(వీడియో అసిస్టెంట్ రెఫరీ) టెక్నాలజీని ఉపయోగించనున్నట్టు ఫిఫా అధ్యక్షుడు ఇన్‌ఫాంటినో తెలిపారు. వీఏఆర్ ఒక రకంగా క్రికెట్‌లో డీఆరెస్, బాల్ ట్రాకింగ్.. టెన్నిస్‌లో హాక్ ఐ లాంటిదే. ఫుట్‌బాల్‌లోనూ గోల్ కొట్టారా, లేదా... పెనాల్టీ ఇవ్వాలా, లేదా.. రెడ్ ఇవ్వడం సరైందేనా, ఇస్తే ఎవరికి ఇవ్వాలి అనే నిర్ణయాలు తీసుకునేందు ఈ సరికొత్త టెక్నాలజీని ఉపయోగించుకోనున్నారు.

అయితే టెక్నాలజీని ఉపయోగించుకోవడంపై అందరూ సంతృప్తిగా వున్నట్టు కనిపించడం లేదు. క్రికెట్, టెన్నిస్ లాంటి ఆటలు మామూలుగానే ఆట మధ్యలో గ్యాప్ వస్తుంది. పాయింట్, పాయింట్‌కూ టెన్నిస్‌లో గ్యాప్ వుంటుంది. క్రికెట్‌లో బంతి, బంతికీ... ఓవర్,ఓవర్‌కూ మధ్య గ్యాప్ ఆటలో భాగంగానే వస్తుంది. కానీ ఫుట్‌బాల్ నిరంతరం ఆటగాళ్లు పరిగెత్తే ఆట. మాటిమాటికీ టెక్నాలజీని ఉపయోగించుకోవడం ఆట ఫ్లో దెబ్బతింటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.


ఫిఫా మాత్రం టెక్నాలజీ వాడటం వల్ల ఒక నిమిషం వృథా అవుతుందీ అనేదే విమర్శ అయితే.. సరైన నిర్ణయం తీసుకునేందుకు ఒక నిమిషం ఖర్చు అయినా పర్వాలేదు అంటోంది. టెక్నాలజీ విషయంలో ప్రతి ఆటలోనూ ఇదే రకమైన ఘర్షణ అన్ని ఆటల్లోనూ కనిపించేదే. క్రికెట్‌లో కూడా డీఆరెస్‌ను వ్యతిరేకించారు. కానీ అంతిమంగా ప్రేక్షకులు అన్నిక్రీడల్లోనూ టెక్నాలజీ వుపయోగించుకోడానికే మొగ్గుచూపుతున్నారు.

తొలి డే నైట్ టెస్ట్

వేదికగా హైదరాబాద్?

న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో భారత్‌లో పర్యటించనున్న వెస్టిండీస్‌తో భారత జట్టు తొలి డే అండ్ నైట్ టెస్ట్ ఆడనుంది. ఈ చారిత్రాత్మక మ్యాచ్‌కు హైదరాబాద్ వేదిక అయ్యే అవకాశం ముంది. అయితే రాజ్‌కోట్ కూడా ఈ టెస్టుకు అతిథ్యమిచ్చేందుకు పోటీలో ఉంది. దేశంలో భారత జట్టు ఆడే సిరీస్ షెడ్యూల్‌ను బీసీసీఐ కరారు చేసింది. బీసీసీఐ పర్యటనలు, పోటీల షెడ్యూలు (టూర్స్ అండ్ ఫిక్చర్స్) కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో బెంగాల్ క్రికెట్ అసోసియేషన్(సీఏబీ) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరుకాగా, బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరీ, క్రికెట్ ఆపరేషన్స్ జీఎం సాబా కరీం, రాజన్ తివారీలు పాల్గొన్నారు. బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సికె ఖన్నా వ్యక్తిగత కారణాలతో ఈ భేటీకి హాజరుకాలేదు. విండీస్, భారత్‌తో ఆడే టెస్టులకోసం రెండు కేంద్రాలను బీసీసీఐ ఎంపిక చేసింది. బీసీసీఐ పాలన కమిటీ ఆమోదిస్తే ఈ రెండు కేంద్రాల్లో ఒకటి డే అండ్ నైట్ టెస్టుకు ఆతిథ్య మిస్తుందని బీసీసీఐ అధికార వర్గాలు వెల్లడించాయి. భారత్ దేశంలో మూడు టెస్టులు ఆడనుంది. జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో ఒక టెస్టు ఆడనుండగా, మిగతా రెండు టెస్టులు దీపావళి అనంతరం అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో ఆడనుంది. విండీస్ పర్యటనలో భాగంగా నవంబర్‌లో ముంబై, గువాహటి, కొచ్చి, ఇండోర్, పుణెల్లో భారత్‌తో ఐదు వన్డేల్లో పాల్గొంటుంది. ఈ సిరీస్ కోల్‌కతా, చెన్నై, కాన్పూర్‌లో జరిగే మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచులతో ముగుస్తుంది. నవంబర్ 4న కోల్‌కతాలో జరిగే టీ20గా జరుగనుండగా, మిగతా మ్యాచ్‌ల నిర్వహణ తేదీలను అనంతరం ప్రకటించనున్నట్లు బీసీసీఐ తెలిపింది.

పీటర్సన్ గుడ్‌బై



లండన్: ఇంగ్లాండ్ ఆల్‌టైమ్ గ్రేట్ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. రిటైర్మెంట్ పేరు చెప్పకుండానే ట్విట్టర్ ద్వారా తన వీడ్కోలును తెలిపాడు. రిటైర్మెంట్ తర్వాత ఖడ్గమృగాలను అంతరించిపోకుండా కాపాడతానని పీటర్సన్ తెలపడం విశేషం. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుతో విభేదాల కారణంగా 2014 నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా వుంటున్న పీటర్సన్.. తర్వాత పూర్తిస్థాయి క్లబ్ క్రికెటర్‌గా మారిపోయాడు. దాదాపు ప్రతి క్రికెట్ దేశంలోనూ జరుగుతున్న లీగ్‌లలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తూ వస్తున్నాడు. ఐపీఎల్ మినహాయింపు. కెరీర్‌లో 104 టెస్టులు ఆడి 8181 పరుగులు, 136 వన్డేల్లో 4440 పరుగులు చేశాడు. 37 అంతర్జాతీయ టీ20ల్లో 1176 పరుగులు చేసిన పీటర్సన్.. ఇంగ్లాండ్‌కు ఏకైన ఐసీసీ టోర్నమెంట్ 2010 టీ20 వరల్డ్ కప్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. పీటర్సన్ రిటైర్మెంట్‌పై స్పందించిన ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్.. తనతో పాటూ ఆడిన వారిలో పీటర్సనే అత్యున్నత బ్యాట్స్‌మన్ అని కీర్తించాడు. ఇంగ్లాండ్‌కు 4 యాషెస్ సిరీస్ విజయాలు అందించిన పీటర్సన్.. ఆసీస్‌ను భయపెట్టిన తొలి బ్యాట్స్‌మన్ అని ప్రశంసించాడు. ఇదే విషయమై స్పందించిన ఇంగ్లీష్ ఆల్‌రౌండర్ ఆండ్రూ ఫ్లింటాఫ్.. నువ్వింకా క్రికెట్ ఆడుతున్నావా అని వ్యంగ్యంగా ట్వీట్ చేశాడు. ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్‌లీగ్ ఆడుతున్న పీటర్సన్.. మిగిలిన టోర్నీకి అందుబాటులో వుండనని తెలిపాడు.

పోరాడి ఓడిన సింధు

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ముగిసిన భారత్ పోరు



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ టోర్నీ సెమీఫైనల్లో సింధు పోరాడి ఓడింది. పి వి సింధు (బీడబ్ల్యుఎఫ్ 3 ర్యాంక్) జపాన్‌కు చెందిన అకానె యమగుచి(బీడబ్ల్యుఎఫ్ 2 ర్యాంక్)ల మధ్య శనివారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ నువ్వా నేనా అన్నట్లు సాగింది. తొలి సెట్‌లో ఆది నుంచే సింధు దూకుడుగా ఆడుతూ 0-6తో ప్రత్యర్థిపై ఆధిక్యాన్ని ప్రదర్శించింది. సింధు 15-8 స్కోరుతో ముందుకు వెళుతున్న దశలో యమగుచి నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఫలితంగా సింధు ఆధిక్యం తగ్గి స్కోరు 17-16కు చేరింది. సింధు తన అనుభవాన్నంతా ఉపయోగించి ఆడి సెట్‌ను 21-19తో కైవసం చేసుకుంది. రెండో సెట్ ప్రారంభం నుంచి ఇరువురు పోటాపోటీగా ముందుకు సాగారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ సెట్లో చివరికి యమగుచి 2 పాయింట్ల స్వల్ప ఆధిక్యంతో (21-19) గెలుచుకుంది. మ్యాచ్ నిర్ణాయక మూడో సెట్లో సింధు పోరాడినప్పటికి ఫలితం లేకపోయింది. యమగుచి చేతిలో 21-18 తేడాతో ఓటమి పాలయ్యింది. యమగుచి ఫైనల్‌కు చేరింది.

ముగిసిన ప్రణయ్ పోరు

పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత షట్లర్ ప్రణయ్ ఓటమి చెంది టోర్నీ నుంచి నిష్క్రమించాడు. చైనా షట్లర్ హుయాంగ్ యుగ్జియాంగ్ చేతిలో 20-22 21-16, 23-21 తేడాతో ప్రణయ్ ఓటమి చెందాడు. గంట 17 నిమిషాలు సాగిన పోటీలో తొలి సెట్‌ను ప్రణయ్ 22-20 తేడాతో గెలుచుకున్నాడు. రెండో సెట్లో హుయాంగ్ పుంజుకుని 21-16 తేడాతో గెలివగా.. నువ్వా, నేనా అన్నట్లు సాగిన మూడో సెట్లో ఒక దశలో ఇరువురి మధ్య స్కోరు 20-20తో సమమైంది. ఈ సమయంలో ప్రణయ్ కొట్టిన షాట్ నెట్‌ను దాటలేకపోయింది. అదే ప్రణయ్ ఓటమిలో కీలకంగా మారింది. అనంతరం మరో రెండు పాయింట్లు సంపాదించిన హుయాంగ్ మ్యాచ్‌ను గెలిచి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు.

వీనస్, హలెప్‌లు ఇంటికి

- ఫైనల్ బరిలో నవోమి, కసత్‌కినా


నవోమి

ఇండియన్‌వెల్స్: సీనియర్ల టెన్నిస్‌కు స్వర్గధామంగా పేరుపొందిన బిఎన్‌పి పరిబాస్ ఇండియన్ వెల్స్ టోర్నీలో ప్రపంచ నం.1 సిమోనా హెలెప్, అమెరికన్ టెన్నిస్ స్టార్ వీనస్ విలియమ్స్‌లు సెమీస్‌లో ఓడి నిష్క్రమించారు. నేడు జరుగనున్న ఫైనల్స్‌లో జపాన్ క్రీడాకారిణి నవోమి ఒసాకా, రష్యా క్రీడాకారిణి డారియా కసత్‌కినా టైటిల్‌కోసం తలపడనున్నారు. శనివారం జరిగిన సెమీఫైనల్ తొలి మ్యాచ్‌లో ప్రపంచ నం.44 ఒసాకా అన్ సీడెడ్‌గా టోర్నీలోకి అడుగుపెట్టి, ప్రపంచ నం.1 సిమోనా హెలెప్(రుమేనియా)ను 6-3, 6-0 తేడాతో కంగు తినిపించింది. 37ఏళ్ల వీనస్ విలియమ్స్, 20 ఏళ్ల రష్యన్ బామ కసత్‌కినా మధ్య సాగిన మారథాన్ మరో సెమీస్ మ్యాచ్‌లో కసత్‌కినా తొలి సెట్‌ను 4-6 తేడాతో వీనస్‌కు కోల్పోయింది. అయితే తర్వాత కసత్‌కినా పుంజుకుని రెండో సెట్‌ను 6-4, మూడో సెట్‌ను 7-5 తేడాతో గెలిచి మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకుంది. కసత్‌కినా ఈ టోర్నీలో వరుసగా నలుగురు టాప్ 20 ర్యాంకర్స్, గ్రాండ్ స్లామ్ విజేతలు స్లొవానె స్టీఫెన్స్, కరోలిన్ వోజియాంకి, అంజెలిక్ కెర్బర్, వీనస్ విలియమ్స్‌ను ఓడించింది. కాగా ఒసాకా నవోమి కూడా ఈ టోర్నీలో కూడా నలుగురు టాప్ క్రీడాకారిణులను ఓడించింది. వారిలో మారియా షరపోవా, రాద్వాన్‌స్కా, కరోలినా ప్లిస్‌కోవా, హెలెప్‌లున్నారు.

పురుషుల సింగిల్స్‌లో..

కెనడాకు చెందిన టెన్నిస్ ఆటగాడు మిలోస్ రవోనిక్ సెమీస్‌లో తన బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు. శనివారం జరిగిన క్వార్టర్స్ ఫైనల్లో రవోనిక్ అమెరికన్ ఆటగాడు సామ్ క్వెర్రీని 7-5,2-6,6-3 తేడాతో ఓడించాడు. మరో క్వార్టర్ ఫైనల్స్‌లో అర్జెంటీనా ఆటగాడు డెల్ పొట్రో జర్మన్ ఆటగాడు ఫిలిప్ కోల్స్‌క్రైబర్‌ను 3-6,6-3,6-4 తేడాతో ఓడించి సెమీస్‌కు చేరాడు. వీరిద్దరి మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ నేడు జరుగనుంది. ఇప్పటికే సెమీస్‌కు చేరిన స్విస్ దిగ్గజం ప్రపంచ నం.1 రోజర్ ఫెదరర్, క్రొయేషియా ఆటగాడు బోర్నా కొరిక్‌తో శనివారం రాత్రి జరుగుతున్న మ్యాచ్‌లో తలపడుతున్నాడు.


కసత్‌కినా

ఐటీఎఫ్ గ్వాలియర్ 2018 విజేత అంకిత



గ్వాలియర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఐటీఎఫ్) నిర్వహిస్తున్న ఈవెంట్లో భారత క్రీడాకారిణి అంకిత రైనా టైటిల్‌ను గెలుచుకుంది. గత మూడేళ్లనుంచి చూస్తే అంకితకు ఇదే తొలి టైటిల్ విజయం. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నాలుగు సీడెడ్ అంకిత ఫ్రాన్స్‌కు చెందిన రెండో సీడెడ్ క్రీడాకారిణి అమండైన్ హిస్సీని 6-2,7-5 తేడాతో ఓడించింది. విజేతగా అంకిత 25,000 అమెరికన్ డాలర్ల మొత్తాన్ని అందుకుంది. గత కొన్ని నెలలుగా అపూర్వంగా రాణిస్తున్న అంకిత తన చివరగా 2014 పుణె ఐటీఎఫ్ టైటిల్‌ను గెలుచుకుంది. తాజా టైటిల్‌తో కలిపి అంకిత తన కెరియర్‌లో మొత్తం ఆరు టైటిళ్లను గెలుచుకుంది. గత ఆరేళ్లలో అంకిత తొమ్మిదిసార్లు ఫైనళ్లలో ఓడిపోయింది. డబుల్స్‌లో 12 టైటిళ్లను సొంతం చేసుకుంది. ఐటీఎఫ్ సర్క్యూట్లో భాగంగా అంకిత త్వరలో జపాన్ టోర్నీలో పాల్గొంటుంది.

• నాటి విభజన హామీలకు కట్టుబడి ఉన్నాం

మేమొస్తే అమలు చేస్తాం


ప్లీనరీలో జాతీయ గీతం ఆలపిస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్, సీనియర్ నేతలు.

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్యాయం చేస్తోంది

ప్లీనరీలో కాంగ్రెస్ రాజకీయ తీర్మానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ ప్లీనరీ సమావేశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ విభజన చట్టంలోని అంశాలను, నాటి ప్రధాని మన్మోహన్ వాగ్దానాలను అమలుచేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము ఈ హామీలన్నింటి అమలుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది. శనివారం న్యూఢిల్లీలో నిర్వహించి 84వ ఏఐసీసీ ప్లీనరీ సమావేశంలో ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ తీర్మానంలో ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించింది. కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత మల్లికార్జున ఖర్గే ఈ రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, ప్లీనరీ తీర్మానాన్ని ఆమోదించింది.ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని రాజకీయ తీర్మానంలో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. తాము ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాల అమలుకు కట్టుబడి ఉన్నామని మరోసారి పునరుద్ఘాటించింది. మెజారిటీ రాజకీయ పార్టీల ఏకాభిప్రాయంతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని, ఏపీ పునర్విభజన చట్టాన్ని రూపొందించామని పేర్కొంది. నాడు ఫిబ్రవరి 20, 2014లో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో ప్రకటించారని వెల్లడించింది. ఈ వాగ్దానాలను ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది.

భావసారూప్యత పార్టీలతో పనిచేస్తాం: సోనియా

బీజేపీని గద్దె దింపేందుకు భావసారుప్యత కలిగిన పార్టీలతో కలిసి పనిచేస్తామని యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఉనికి లేకుండా చేయాలనుకున్న వారికి తమపై ప్రజలకు ఉన్నప్రేమాభిమానాలు తెలియవని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని అన్నారు. కాంగ్రెస్ అంటే కేవలం రాజకీయ పార్టీ కాదని, అదొక సిద్ధాంతం అని, కాలపరీక్షలో నిలబడిందన్నారు. యూపీఏ ప్రభుత్వ సంక్షేమ పథకాలను బలహీన పరచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా కాంగ్రెస్ పార్టీని నాశనం చేసేందుకు అధికార పార్టీ అన్ని రకాల ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ప్రత్యర్థులపై కక్ష్యసాధింపు చర్యలకు దిగుతోందన్నారు. కానీ అధికార అహంకార రాజకీ యాలకు తాము జంకేది లేదన్నారు. సబ్‌కాసాత్ సబ్‌కావికాస్, న ఖావుంగా, నఖానేదుంగా లాంటి నినాదాలు నాటకాలని అభి వర్ణించారు. అధికారాన్ని సాధించేం దుకు ఉపయోగించే ట్రిక్కులని అన్నారు. నాటి ప్రధాని మన్మోహన్ హయాంలో దేశ ఆర్థిక ప్రగతి వికసించిందని అన్నారు. తమ పథకాల ద్వారా అనేక మంది ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. కానీ ఆ పథకాలను ప్రభుత్వం బలహీ నపరుస్తోందన్నారు. మోడీ, ఆయన మనుషుల అవినీతి, మోసాలను ఆధారాలతో సహా ఎండగడుతున్నామని చెప్పారు. 2014లో బీజేపీ ఇచ్చిన హామీలు ఆచరణలో తేలిపోయాయని ప్రజలకు అర్థమైందన్నారు. అరాచకం, హింస, అన్యాయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. నూతన శకానికి ఇదొక నాందిగా నిలవాలని, ప్రస్తుత ఎదుర్కొంటున్న సవా ళ్లు అసాధారణమైనవని అన్నారు. భారత్‌ను అవినీతి రహితంగా, కక్ష్యసాధింపులకు వ్యతిరేకంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అందరూ ప్రతిన బూనాలని కోరారు.

బీజేపీ విద్వేషాలను పెంచితే...మేము ప్రేమను పంచుతాం: రాహుల్‌గాంధీ


అధికార బీజేపీ విద్వేషాలను పెంచితే, తాము ప్రేమను పంచుతున్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. దేశం ఏ ఒక్కరిదో కాదని, అందరిది అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రతీ చర్య అందరికీ ప్రయోజనం చేకూర్చేది అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు నిరాశజనకంగా ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రగతి పథంలోకి తీసుకువెళుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశం పూర్తిగా వెనుకబడిందన్నారు. ఈ విద్వేషాలకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే చికిత్స చేయగలదని అన్నారు. దేశాన్ని ఏకతాటిపై నడిపించి ముందుకు తీసుకువెళ్లే సత్తా కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను బతికించేందుకు పార్టీ కార్యకర్తలు గట్టిగా పోరాడాలని అన్నారు. సీనియర్ నాయకులు పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేస్తారని అన్నారు. పురాతన వారసత్వాన్ని మర్చిపోకుండానే సంప్రదాయాలు కొన సాగిస్తూ మార్పును ఆహ్వానించాలని కోరారు.

ప్లీనరీ సమా వేశంలో రాజకీయ, ఆర్థిక తీర్మానాలను ఆమోదించారు. వీటితో పాటు వ్యవసాయం, నిరుద్యోగం, పేదరిక నిర్మూలనపై ప్రత్యేక తీర్మానాలను ఆమోదించారు. పార్టీ సీనియర్ నేతలు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, పి.చిదంబరం, గులాంనబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, సీఎంలు సిద్దరామయ్య, అమరీందర్ సింగ్, పార్టీ రాష్ట్రాల అధ్యక్షులు, నేతలు పాల్గొన్నారు. గతానికి భిన్నంగా ఈసారి ఏఐసీసీ ప్లీనరీలో వేదికను ఏర్పాటు చేశారు. వేదికపై ఎటువంటి సీట్లు ఏర్పాటు చేయకుండా కేవలం పోడియం ను మాత్రమే ఏర్పాటు చేశారు. వేదిక బ్యాక్ డ్రాప్‌లో భారీ స్థాయిలో ఎన్నికల చిహ్నామైన హస్తం గుర్తును ఏర్పాటు చేశారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



ఉగాదిపచ్చడిలో... మన ఉద్వేగాలు!



ఆరురుచులు... మన అంతరంగ ప్రతిరూపాలు

ఉగాది అనగానే మనకు గుర్తొచ్చేది ఆ ఆరు రుచులే....తీపి కారం చేదు వగరు పులుపు ఉప్పు. మనం రోజువారీ తీసుకునే ఆహారంలో ఉండే రుచులే ఇవి. ఇంకా చెప్పాలంటే మన పళ్లెంలోనే కాదు...జీవితంలోనూ ఈ రుచులుంటాయి. మనకు అత్యంత ఇష్టమైన చిన్నారులను స్వీటీ, హనీ, లడ్డు...అంటూ మధురమైన తీపి పదార్థాల పేర్లతో పిలుస్తుంటాం. అలాగే నచ్చనివారి గురించి చెప్పేటప్పుడు ఆ మనిషి మనసంతా చేదే అంటాం...ఆ అమ్మాయికి వగరు పొగరు ఎక్కువ...అంటూ వగరుని కూడా వ్యక్తులకు ఆపాదిస్తాం. అలా చూస్తే ఉగాది పచ్చడిలోని ఆరు రుచులూ మనలోని భావోద్వేగాలే. సాధారణంగా ఉగాది పచ్చడిలోని రుచులు కష్టసుఖాలకు చిహ్నాలని...జీవితంలో అన్నింటినీ సమంగా తీసుకోవాలనే ఉద్దేశంతోనే అలా రుచులన్నీ కలిసిన పచ్చడిని తింటామని..అనుకుంటాం. కానీ ఉగాది పచ్చడిలోని రుచులను మరోరకంగా కూడా చెప్పవచ్చు. ఒక్కో రుచిని మనలోని ఒక్కో ఉద్వేగానికి చిహ్నంగా భావించవచ్చు. ఆయుర్వేదం కూడా అదే చెబుతోంది. మనం తినే ఆహారంలోని రుచులే... మనలో భావోద్వేగాలుగా మారతాయని. అన్ని రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని రుచి చూసే ముందు...ఏ రుచి మనలో ఏ గుణాన్ని కలిగిస్తుందో తెలుసుకుందామా-

మన ఆహారంలో ఆరురుచులు కలగలసి ఉంటాయి. నేరుగా కానీ...ఒక్కోసారి రెండుమూడు రుచులు కలసిపోయి కాని ఉంటాయి. అలాగే మన జీవితంలో ప్రేమ, భయం, కోపం, ఈర్ష్య, అసూయ, ద్వేషం...ఇవన్నీ ఉంటాయి. ఒక్కొక్కరిలో ఒక్కో ఉద్వేగం ఒక్కో స్థాయిలో ఉంటుంది. మనం తీసుకునే ఆహారం మన ఆరోగ్యంపైనే కాదు...మన మానసిక స్థితిపైన కూడా ప్రభావాన్ని చూపుతుంది. అంటే శరీరమే కాదు...మనసుని తయారుచేసేదీ ఆహారమే అన్నమాట. విలాసాల్లో మునిగితేలేవారు అత్యంత రుచికరమైన ఆహారాన్ని కోరుకోవటం, నిర్వికారంగా బతికే మునులు యోగులు రుచిని పట్టించుకోకుండా కందమూలాలు తిని జీవించడం...ఇలాంటి ఉదాహరణలు కూడా మనకు అదే విషయాన్ని చెబుతున్నాయి. నాలుకకు నచ్చిన రుచులు తినేందుకు మనం ఉత్సాహం చూపుతుంటాం. మరి నాలుక మెచ్చిన రుచులు మన జీవితాన్నే ప్రభావితం చేస్తాయంటే... రుచుల సమతౌల్యం విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిందే మరి.

తీయదనం ప్రేమ...ఎక్కువైతే బాధపెట్టే బంధమే!

తీపి చాలామందికి ఇష్టం. ఈ రుచితో ముడిపడి ఉన్న భావోద్వేగాలు ప్రేమ, శ్రద్ధ, దయ. మనసుబాగోని వారు, డిప్రెషన్‌కి గురయినవారు తీపిని ఎక్కువగా ఇష్టపడతారని పరిశోధనల్లో తేలిన నిజం. అంటే ప్రేమ లేమి లేదా ఏదైనా ఒత్తిడికి గురయినప్పుడు తీపిని ఎక్కువగా తినాలని అనిపిస్తుందన్నమాట. ఎందుకంటే తీపి జీవితంపైన ప్రేమని పెంచుతుంది. తీపిరుచి మనలో మధురమైన జ్ఞాపకాలను తట్టిలేపుతుందట. అలాగే తీయదనంతో ప్రేమించిన వారి గురించిన ఆలోచనలు భక్తిపరమైన భావనలు కలుగుతాయి. మామూలుగా అయితే ఈ రుచి ప్రేమ, దయ, తృప్తిని కలిగిస్తుంది కానీ...ఇదే ఎక్కువైతే మాత్రం మితిమీరిన ప్రేమగా, ఇబ్బంది పెట్టేంత స్థాయి అనుబంధంగా...అంటే నువ్వు నాకే సొంతం అనిపించేలాంటి బంధంగా మారుతుందన్నమాట.

పులుపు పెంచును చురుకు...సమతౌల్యం లోపిస్తే అసూయ!

నోటికి తగలగానే పళ్లు నోరు ఒళ్లు అంతా జివ్వుమనిపించే పులుపు...మనలో ఏకాగ్రత చురుకుదనం తెలివితేటలు..వీటన్నింటినీ పెంచుతుంది. ఈ రుచికే



...ఒక్కసారిగా ఉత్తేజితం చేసే గుణముంది. అయితే ఈ రుచి మరీ ఎక్కువైతే మాత్రం ఈర్ష్య అసూయలకు దారి తీస్తుంది. అలాగే కోపం కూడా పెరుగుతుంది. తమకున్న ఆశయాలు కోరికలు తీరక ఇతరులను విమర్శించే గుణానికి కూడా పులుపే ప్రతినిధి.

ఉప్పు జీవితేచ్ఛకు ఊపిరి.. .ఎక్కువైతే దురాశకు దారి!

ఉప్పు... వంటలకు ఎలాగైతే రుచిని పెంచుతుందో అలాగే జీవితం తాలూకూ రుచిని సైతం పెంచుతుంది. ఉప్పు మనలోని ఆసక్తులు అభిరుచులకు ఊతమిచ్చి...వాటివైపు మన ప్రయాణం సాగేలా చేస్తుంది. మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ధైర్యంగా ముందుకు సాగేలా చేస్తుంది. అందుకే ఒక్కమాటలో ఇది జీవితంతాలూకూ రుచిని సైతం పెంచుతుందని చెప్పవచ్చు. అయితే ఇది ఎక్కువైతే మాత్రం దురాశ, విపరీతమైనస్వార్థం, తనకు సంబంధించినది...తనకే సొంతమనే తీవ్రమైన కోరక..ఇవన్నీ పెరిగిపోతాయి. ఉప్పుతో తయారయిన ఆహారాన్ని మరీ ఎక్కువగా తీసుకుంటే ...విపరీతమైన కోరికలు, అత్యాశలు, నిగ్రహశక్తి లేకపోవటం లాంటి లక్షణాలకు గురికావాల్సివస్తుంది.

కారం విశాలదృష్టికి మార్గం... ఎక్కువైతే శ్రుతిమించిన కోపం!

తీపిలాగే కారాన్ని సైతం చాలామంది ఇష్టపడుతుంటారు. దీనిని మనల్ని లక్ష్యంవైపు నడిపించే ఉత్ప్రేరకంగా చెప్పవచ్చు. కారం మనలో విశాలత్వం, ధైర్యం, శక్తి..వీటన్నింటినీ పెంచుతుంది. అలాగే ఏకాగ్రతని, చక్కని ఆలోచనలను సైతం ఇస్తుంది. అయితే మరీ ఎక్కువ తింటేమాత్రం ఇదే కారం...కోపం హింస ద్వేషం లాంటి భావాలను సైతం పెంచుతుంది.

చేదు ఆత్మావలోకనం చేయిస్తుంది... ఎక్కువైతే ద్వేషం, దుఃఖం!

చేదుని చాలా తక్కువ మంది ఇష్టపడతారు. ఇది తీపికి వ్యతిరేకం కనుక తీపితో పెరిగే గుణాలకు వ్యతిరేకమైన లక్షణాలు చేదుతో వస్తాయి. చేదు అసంతృప్తి, ద్వేషాలను తెచ్చిపెడుతుంది. అయితే ఇందులో మనల్ని మనం శోధించుకునేలా ప్రేరపించే గుణం ఉంది. అంటే ఆత్మావలోకనానికి దోహదం చేస్తుంది. చేదుని మరీ ఎక్కువ ఆస్వాదించేవారు ఏకాకి జీవులు, బోర్ కొట్టించే మనుషులుగా తయారవుతారు. మితిమీరిన దుఃఖంలో కూరుకుపోతుంటారు.

వగరు ఆలోచనలను ఒక దారికి తెస్తుంది.... ఎక్కువైతే అభద్రత, భయం!

ఈ రుచిని కూడా మనం చాలా తక్కువగా ఆస్వాదిస్తాం. దీనివలన కూడా పెద్దగా మనకు మేలు చేసే గుణాలేమీ రావు. అయితే వగరులో...మనలో దారితెన్ను లేకుండా తిరిగే ఆలోచనలు భావోద్వేగాలను ఒక దారికి తెచ్చే శక్తి ఉందట. అంటే ఇది అంతర్ముఖంగా ఆలోచించడానికి దోహదం చేస్తుంది. ఇక ఇది శ్రుతి మించితే...అభద్రత భయం ఆందోళన డిప్రెషన్ మెదడు వాస్తవంలో ఆలోచించలేకపోవటం లాంటి లోపాలు తలెత్తే ప్రమాదం ఉంది.

✍ వి. దుర్గాంబ



తెలుగు సంవత్సరాల చక్రం! 1801నుండి 2100 వరకు

ఉగాది వచ్చిందనగానే ఈ సంవత్సరం పేరంటనే ప్రశ్న ఉదయిస్తుంది. నేడు విళంబి నామ సంవత్సరం మొదలైంది సరే... మరి పోయిన సంవత్సరం పేరేంటి...వచ్చే ఏడాది పేరేంటి....అనే ప్రశ్నవేసుకుంటే మాత్రం ఆ వివరాలకోసం వెతుక్కోవాల్సిందే. అయితే అలాంటి శ్రమలేకుండా చేస్తోందీ చక్రం. ఇందులో 1801 నుండి 2100 సంవత్సరాల వరకు ఏ ఏడాది ఏ తెలుగు సంవత్సరం వచ్చిందనే వివరాలు ఉన్నాయి. సోషల్ మీడియాలో ఈ చిత్రం హల్ చల్ చేస్తోంది.

నాయిక మారాలి!

పరిశ్రమ హీరోల సొంతం కాదు...హీరోయిన్లకూ ప్రాధాన్యత పెరగాలి

బాలీవుడ్ తార విద్యాబాలన్



నాయిక ప్రధాన చిత్రాలతో బాలీవుడ్‌లో కొత్త ఒరవడి తీసుకొచ్చిన నటి విద్యాబాలన్. జాతీయ ఉత్తమ నటిగా పలు ప్రభావవంతమైన చిత్రాల్లో నటించారామె. పరిణీత, ఇష్కియా, నో వన్ కిల్డ్ జెస్సికా, డర్టీ పిక్చర్, కహానీ, బేగమ్ జాన్ లాంటి నాయిక ప్రధాన చిత్రాలతో ప్రేక్షకులకు మర్చిపోలేని నాయికగా మారారు. వివాహం తరువాత కూడా విజయవంతమైన నటిగా కొనసాగుతున్న విద్య....ఇల్లాలే సూపర్ ఉమెన్ అంటున్నారు. అన్నిరంగాల్లోనూ వివక్షని తుడిచేయాలని మహిళలు విశ్వప్రయత్నం చేస్తున్న ఈ రోజుల్లో... సినిమాల విషయంలో నాయక ప్రధాన, నాయిక ప్రధాన అనే పేర్లు ఎందుకని ప్రశ్నిస్తూ...సినీరంగపు వివక్షపై తన గళం వినిపిస్తున్నారు విద్య. చిత్ర పరిశ్రమలో మహిళా సాధికారత, వారసత్వం మొదలుకొని ప్రలోభాల వరకు అన్ని అంశాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా తెలిపే విద్యాబాలన్ అభిప్రాయాలు ఆధునిక మహిళలకు అద్దం పడుతుంటాయి...ఆమె భావాల సమాహారం మీకోసం-

సినిమాల్లో హీరోయిన్లు అనగానే కథతో సంబంధం లేకుండా హీరోల పక్కన నృత్యాలు చేసి పక్కకు వెళ్లిపోయేవారనే అభిప్రాయాన్ని... తుడిచేసే ప్రయత్నం చేస్తున్నారు బాలీవుడ్ తార విద్యాబాలన్. పదహారేళ్ల వయసులో హమ్ పాంచ్ అనే హిందీ ధారావాహికలో నటించారు. ఈ సీరియల్‌కు వచ్చిన గుర్తింపుతో హీరోయిన్‌గా ఆమె భవిష్యత్ ఖరారైపోయింది. బెంగాలీ సినిమా భాలో థేకో తో తెరంగేట్రం చేసి....పరిణీతతో బాలీవుడ్‌లో అడుగు పెట్టారు. తొలి చిత్రమే కావాల్సినంత గుర్తింపు తీసుకురాగా.....మున్నాభాయ్ ఎంబీబీఎస్ అగ్ర తారగా మార్చేసింది. నాయికగా పేరొచ్చాక..ఆమె ఒకే మూసలో నడవకుండా నటిగా పేరు తెచ్చే పాత్రలను ఎంచుకోవటం మొదలుపెట్టారు. కహానీ, డర్టీ పిక్చర్, తుమ్హారీ సులూ లాంటి విభిన్నమైన చిత్రాల్లో తన ప్రతిభని కనబరచారు. అంతేకాదు...నటిగా తను చేసిన పాత్రలతో ఏదో ఒక రూపంలో ఎంతో కొంత వ్యక్తిగత అనుబంధం ఉందని, ప్రతి కథలోనూ తనను తాను చూసుకున్న సందర్భాలున్నాయని అంటారు. నేటి మహిళలు వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితాల్లో ఒకదానికొకటి సంబంధం లేని భిన్నమైన జీవితాన్ని గడుపుతున్నారని, ఇలాంటి మహిళలే అత్యంత శక్తివంతమైన వాళ్లని అంటారామె. విద్యాబాలన్ తన తాజా చిత్రం తుమ్హారీ సులూ లో ఇల్లాలి పాత్రలో నటించారు. పాటలు, మాటల్లో ఆమె ప్రతిభను గుర్తించిన భర్త... రేడియో జాకీ అవమని ప్రోత్సహిస్తాడు. భర్త ప్రోత్సాహంతో ఆర్జేగా మారిన సులూ గొప్ప పేరు సంపాదించుకుంటుంది. ఈ చిత్రంలోలా భర్తల ప్రోత్సాహం ఉంటే ...ఏ భార్య అయినా గొప్ప విజయాలు సాధిస్తుందని అంటారు విద్య.

అన్ని పాత్రల్లో...నేనున్నా!

✦ సినిమా రంగంలో దశాబ్దాలుగా కథానాయకుల చుట్టే కథలు తిరుగుతున్నాయి. ఆ సంప్రదాయం మారే రోజులు వచ్చేశాయి. చిత్ర పరిశ్రమ హీరోల సొంతం కాదు. నాయికలుగా మేము సాధిస్తున్న విజయాలు ఆ ప్రభావం నుంచి ప్రేక్షకులు బయటకొచ్చేలా చేస్తున్నాయి. మహిళా ప్రధాన చిత్రాలు అనే ప్రత్యేకమైన పేరుతో మా సినిమాలను పిలవకండి. సినిమా అంటే చాలు.

✦ తుమ్హారీ సులూ విజయం తర్వాత పెళ్లయిన హీరోయిన్లను ప్రేక్షకులు అభిమానించరనే అభిప్రాయం తప్పని తెలుసుకున్నాను. మంచి కథలో నటిస్తే...చాలు పెళ్లయినా.. ప్రేక్షకులు ఆదరిస్తారు..

✦ నాకు బాగా పేరు తీసుకొచ్చిన కహానీ సినిమా చిత్రీకరణ మర్చిపోలేని అనుభూతులను ఇచ్చింది. ఈ సినిమాలో భర్త కోసం వెతికే గర్భిణి పాత్రలో నటించాను. ఓ నాయిక అలా కనిపిస్తే ఎవరూ చూడరని అంతా అన్నారు. అయితే కథలో ఆ పాత్ర భావోద్వేగాలు ప్రేక్షకులను మెప్పించాయి. కహానీ సినిమాలో తను వెదుతుకున్న భర్త ఉగ్రవాది అని తెలుసుకుని తనే చంపేస్తుంది. కథలోని ఈ మలుపు నాకూ, దర్శకుడికీ, కెమెరామెన్‌కు తప్ప మరెవరికీ తెలియదు. ఆ విషయాన్ని కహానీ చిత్రీకరణలో రహస్యంగా ఉంచాం.

✦ నేను చేసిన ప్రతి చిత్రం నా మనసుకు దగ్గరైనదే, నాకు వ్యక్తిగత అనుబంధాన్ని ఇచ్చినదే. నేను చేసిన నాయిక ప్రధాన చిత్రాలన్నింటిలో నాయికలు తమకు నచ్చింది చేస్తుంటారు. మనసుకు తోచిన దారిలో వెళ్తుంటారు. వ్యక్తిగతంగా నేనూ అలాంటి మహిళనే. అయితే నటిగా తెరపై ఏదైనా చేయగల, ఎలాగైనా నటించగల నేను వ్యక్తిగతంగా కొంత సిగ్గరిని.

✦ చిత్రరంగంలో ఉన్నవాళ్లుగా ఎలాంటి కథతోనైనా సినిమా చేసే ప్రాథమిక హక్కు మాకుంది. అయితే ఎలాంటి సినిమా రూపకల్పనకైనా హద్దులు ఉంటాయి. ఆ చిత్రాలు చూడాలనుకునేవారు చూడొచ్చు. వద్దనుకునేవాళ్లు వదిలేయవచ్చు. కానీ ఏ చిత్రాలైనా విడుదల కాకుండా అడ్డుకునే పరిస్థితులు ఉండకూడదు.

✦ హాలీవుడ్‌లో వెయిన్‌స్టెన్ లాంటి నిర్మాతల ఉదంతం ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఇలాంటి పరిస్థితిలోనూ అక్కడి ప్రముఖ తారలు కొందరు నోరు విప్పలేదు. మనమంతా బయటకొచ్చి మాట్లాడినప్పుడే తలదించుకునే రోజులు పోతాయి.

మలయాళ తారలు మంజు వారియర్, పార్వతీ, భావన, అంజలీ మీనన్, గీతూ మోహన్ దాస్, రిమా లాంటి వాళ్లంతా ఒక్కటిగా చిత్ర పరిశ్రమలో తమ హక్కుల గురించి పోరాడుతున్నారు. బాలీవుడ్‌లోనూ అలాంటి ఐక్యత రావాలి. అప్పుడే నాయికలకు సమాన హక్కులు లభిస్తాయి.



- రమేష్ గోపిశెట్టి

నవజీవనారంభ సూచిక ఉగాది

చింతన



ఉగాది నాడు చేయవలసిన విధులు గురించి ధర్మ సింధువు, నిర్ణయ సింధువు అనే ధర్మ శాస్త్ర గ్రంథాలు విపులంగా వివరించాయి. ఆ విధి విధానాలలో సూర్యోదయాత్పూర్వమే అభ్యంగనస్నానం, గృహాలంకరణం, ఉగాది పచ్చడి తినడం, పంచాంగ శ్రవణం ఉన్నాయి. ఇవికాక ఉగాదినాడు ఇంద్ర ధ్వజ పూజ, బ్రహ్మ ధ్వజ పూజ, దమనక పూజ, ఛత్ర చామరాది స్వీకారం, సర్వాపచ్ఛాంతికర మహాశాంతి, పౌరుష ప్రతిష ద్రవ్రతం, ప్రపాదాన ప్రారంభం, రాజదర్శనం, వసంత నవరాత్ర ప్రారంభంమొదలైన పూజలు, వ్రతాలు జరుపుకోవడం ఉంది. సంవత్సరాది నాడు వర్తకులు కొత్త చిట్టాలను ప్రారంభిస్తారు. కొందరు నూతన వ్యాపారాలు మొదలు పెడతారు. వృత్తి పనివారు, శ్రామికులు వారి పని ముట్లను పూజిస్తారు. రైతులు ఏరు వాక సాగిస్తారు. పండితులు వేద శాస్త్ర పురాణ గ్రంథాలను పూజిస్తారు. పురాణేతిహాసాల్లో మనం ఉగాదిగా పరిగణిస్తున్న చైత్ర శుద్ధ పాడ్యమికి పౌరాణికంగాను, ఖగోళ శాస్త్ర రీత్యా, చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉంది.

పచ్చని ఆకులతో, పుష్పాలతో, ఫలాలతో వృక్షాలు, పచ్చిక బయళ్లు లేత మామిడి చిగుళ్ళు తిని కుహూకుహూ అంటూ పంచమ స్వరంతో కూసే కోయిల, పువ్వులలో ఉండే మధువును గ్రోలి ఝుంకారం చేసే తుమ్మెద, పురి విప్పి నృత్యం చేసే నెమలి, రామణీయకతతో ఆనంద సౌందర్యంతో వింత సోయగంతోనున్న ప్రకృతి కాంత మోడువారిన మానవ హృదయాలలో వసంతోదయం కలగజేస్తుంది. సృష్టిలో నవ జీవనం వసంతకాలాగమనంతో ప్రారంభమవుతుంది. భగవంతుని ఈ చరచరాత్మకమైన సృష్టిలో నూతన చైతన్యం కలిగిస్తుందీ వసంతకాలం. చైతన్యవంతమైన నవజీవనానికి ప్రారంభం ఉగాది.

మన పర్వదినాల్లో ఉగాది అంత ప్రాధాన్యం వహించింది. దీనికి కారణం సృష్టికర్తయైన బ్రహ్మ తన అనంతమైన సృష్టినంతనూ ఈనాడే బహిర్గతం చేశాడు. అందువల్ల ఉగాది మనందరికీ పర్వదినం.

సంప్రదాయక విధులు

ఉగాది నాడు చేయవలసిన విధులు గురించి ధర్మ సింధువు, నిర్ణయ సింధువు అనే ధర్మ శాస్త్ర గ్రంథాలు విపులంగా వివరిం చాయి. ఆ విధి విధానాలలో సూర్యోదయాత్పూర్వమే అభ్యంగనస్నానం, గృహాలంకరణం, ఉగాది పచ్చడి తినడం, పంచాంగ శ్రవణం ఉన్నాయి. ఇవికాక ఉగాదినాడు ఇంద్ర ధ్వజ పూజ, బ్రహ్మధ్వజ పూజ, దమనక పూజ, ఛత్ర చామరాది స్వీకారం, సర్వాపచ్ఛాంతికర మహాశాంతి, పౌరుష ప్రతిషద్రవ్రతం, ప్రపాదాన ప్రారంభం, రాజదర్శనం, వసంత నవరాత్ర ప్రారంభం మొదలైన పూజలు, వ్రతాలు జరుపుకోవడం ఉంది. సంవత్సరాది నాడు వర్తకులు కొత్త చిట్టాలను ప్రారంభిస్తారు. కొందరు నూతన వ్యాపారాలు మొదలు పెడతారు. వృత్తి పనివారు, శ్రామికులు వారి పని ముట్లను పూజిస్తారు. రైతులు ఏరువాక సాగిస్తారు. పండితులు వేద శాస్త్ర పురాణ గ్రంథాలను పూజిస్తారు.



పురాణేతిహాసాల్లో మనం ఉగాదిగా పరిగణిస్తున్న చైత్ర శుద్ధ పాడ్యమికి పౌరాణికంగాను, ఖగోళ శాస్త్ర రీత్యా, చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉంది.

బ్రహ్మపురాణం

బ్రహ్మ పురాణం ప్రకారం ఆదిలో బ్రహ్మ, ఈ చరాచర సృష్టినంతా చైత్ర శుద్ధ పాడ్యమినాడే ప్రారంభించాడని తెలుస్తోంది. అందువల్ల ఈ రోజు మానవ కోటి అంతకు పర్వదినం.

నారద పురాణం

చైత్ర శుక్ల పాడ్యమి సూర్యోదయ కాలంలో సూర్యుడు అధిదేవతగా ఉన్న కాలంలో ఆదివారం రోజు బ్రహ్మ సృష్టిని బహిర్గతం చేసినట్టు నారద పురాణం చెబుతోంది.

మత్స్యపురాణం

మత్స్యావతార కాలంలో విష్ణుమూర్తి మత్స్య రూపంలో సముద్రంలోనికి వెళ్లి, వేదాలను దొంగిలించిన రాక్షసుణ్ని చంపి తిరిగి బ్రహ్మకు వేదాలను అందజేసిన శుభ దినం చైత్ర శుద్ధ పాడ్యమే.

రామాయణం

పద్నాలుగేళ్లు అరణ్యవాసం చేసి, రావణ సంహారానంతరం సీతా, లక్ష్మణ సమేతంగా రాముడు చైత్ర శుద్ధ పాడ్యమి నాడు అయోధ్యకు తిరుగు ప్రయాణ సన్నాహం చేసిన రోజు అవడం వల్ల ఈ రోజు పర్వదినంగా ప్రజలు భావిస్తారు.

వసుచరిత్ర

పురు వంశ రాజైన వసు రాజు ఒక పర్యాయం వేటకు వెళ్లి అక్కడ ధ్యాన నిష్ఠలో ఉన్న సమయంలో ఇంద్రుడు ప్రత్యక్షమై అతిలోక సుందరమైన ఒక విమానాన్ని, ఎప్పటికీ వాడని ఒక పూల దండను ఇచ్చి, దీనిని యుద్ధంలో ఉపయోగించి అజేయుడివై ఉండమని అంతర్ధానమయ్యాడు. మహిమాన్వితమైన ఆ వస్తువులతో వసు రాజు చైత్ర శుద్ధ పాడ్యమినాడు తన పట్టణంలో ప్రవేశిస్తాడు. ఆ వస్తువుల మహిమ తెలుసుకున్న ప్రజలు ఇంద్రుని గురించి పెద్ద ఉత్సవం నిర్వహించారు. అందువల్ల ఈ రోజు పర్వదినంగా పరిగణించబడింది.



ఖగోళశాస్త్రరీత్యా

ఖగోళ శాస్త్ర రీత్యా కూడా చైత్ర శుద్ధ పాడ్యమి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ రోజున సూర్యుడు భూమధ్య రేఖపై ఉంటాడని ప్రతీతి. అందువల్ల ఈ రోజు దిన, మాస, వర్షారంభ యుగాదులు ఒకేసారి ఏర్పడతాయి.



విక్రమార్క పట్టాభిషేకం

మహావీరుడు, పరాక్రమ శాలి అయిన విక్రమార్క చక్రవర్తి శకులను ఓడించి, చైత్ర శుద్ధ పాడ్యమినాడు పట్టాభిషిక్తుడయ్యాడు. విక్రమార్క శకం ఆ నాడే ప్రారంభమయింది.

అగ్నిపూజ

మొగలులు దేశాన్ని పాలించే కాలంలో వారు ఉగాదిని అగ్ని పూజ అనేవారు. ఉగాదిని పార్సీలు నౌరోజ్ అంటారు. ఆ రోజున వారు అగ్ని పూజ చేస్తారని ఔరంగజేబు తన కుమారునికి రాసిన లేఖ వల్ల వెల్లడవుతోంది.

ఖల్సా వ్రతం


పంజాబులో సిక్కులు సంవత్సరాది రోజున ఖల్సా ఉత్సవాలు జరుపుతారు. వారి గురువు గురు గోవింద్ సింగ్ ఈ రోజునే ఖల్సా ధర్మాన్ని నడిపాడు. ఆయన జ్ఞాపకార్థం సిక్కులు ఉగాదినాడు ఉత్సవాలు జరుపుతారు.

ఆదివాసీల ఉత్సవం

బీహార్ ప్రాంతంలో 'హో' అనే పేరున్న ఆదిమవాసులు ఉగాది రోజు గొప్ప ఉత్సవం చేస్తారు. వారానాడు భూదేవికి, సూర్య భగవానునికి, వైభవంగా వివాహం జరిపి ఆ తర్వాత పెళ్ళి కావలసిన యువతీ యువకులుంటే వివాహాలు జరిపిస్తారు. ఈ విధంగా ఉగాది పర్వదినమై సర్వ మానవ హృదయాలను నూతన చైతన్యంతో రంజింపజేస్తుంది. ఉగాది నవజీవనానికి నాంది.

- డాక్టర్ రాపాక ఏకాంబరాచార్యులు
9440494752

సనాతన ధర్మంలో కాలగణన



విలంబి నామ సంవత్సరంలో ప్రవేశిస్తున్నాం. ఈ అనంత కాలప్రవాహంలో పరిమితంగా మన స్థానం, కాలగణన ఏ విధంగా చేయాలి. మనం ఎక్కడ ఉన్నాము అనేది తెలుసుకుందాం. శ్రీమన్నారాయణుని నాభి పద్మంలో పుట్టిన బ్రహ్మ ఆయుష్షు రెండు పరార్థాలు. బ్రహ్మకు నూరు సంవత్సరాలు ఆయుర్దాయం. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు ఒక వెయ్యి సార్లు తిరిగితే బ్రహ్మకు ఒక పూట. అనగా నాలుగు వేల యుగాలు ఒకపూట. ఈ లెక్కలో బ్రహ్మకు నూరేళ్ళు అంటే 3,11,4000 కోట్ల సంవత్సరాలు. మొదటి యాభై సంవత్సరాలు పూర్వార్ధమని, తరువాతి యాభై సంవత్సరాలు పరార్ధమని వ్యవహారం. సృష్టి నుంచి నేటి వరకు బ్రహ్మకు ఒక యాభై సంవత్సరాలు పూర్తయ్యాయి. యాభై ఒకటవ సంవత్సరంలో మొదటి నెలలో, మొదటి పక్షంలో, మొదటి వారంలో, మొదటి దినంలో 17 ఘడియల, 42 విఘడియల కాలం దానిలో ఒక గురువు అక్షరాన్ని ఉచ్చరించేంత ప్రాణకాలం నడుస్తోంది. అంటే మూడు నిమిషముల (సెకన్ల), 19 లవముల 49వ తృటి ఇప్పుడు నడుస్తోంది. 49వ తృటిలో ఇంతవరకూ 21,42,732 సౌర మాసాది సంవత్సరాలు గడిచాయి. ఇక ఇప్పుడు శ్వేత వరాహ కల్పంలో స్వాయంభువ, స్వారోచిష, ,ఉత్తమ, తామస, రైవత, ఆది ఆరుగురు మనువులు గతించినారు. అనగా ఆరు మన్వంతరాలు గడిచాయి. ఇప్పుడు ఏడవదైన వైవస్వత మన్వంతరం నడుస్తోంది. ఈ మన్వంతరంలో 27 మహా యుగాలు గడిచాయి. 28వ మహాయుగంలో ఇది కలి యుగంగా వ్యవహరింపబడుతోంది. కలియుగం వచ్చి 5,119 సంవత్సరాలు. విక్రమార్క శకం మొదలై 2,075, మధ్వాచార్యులు వచ్చి 902, శంకరాచార్యులు వచ్చి 2090, శాలివాహన శకం వచ్చి 1940, రామానుజ అవతారం వచ్చి 1001, భారత స్వాతంత్ర్యం వచ్చి 71 సంవత్సరాలు పాశ్చాత్య సంవత్సరాలు 2018, 2019 జరుగుతున్నాయి.

యుగం అంటే ఐదు సంవత్సరాలు. ఈ సంవత్సరాత్మక కాలంలో 12 యుగాలు ఉంటాయి. అనగా 12X5=60 సంవత్సరాలు. ఇలా 12 యుగాలుగా కాలాన్ని పరిగణిస్తారు. యుగంలోని ఐదు వర్షాలను తైత్తిరీయ బ్రాహ్మణంలో సంవత్సరోసి, పరివత్సరోసి, ఇదావత్సరోసి, ఇదు వత్సరోసి, ఇద్వత్సరోసి అని చెప్పి ఉన్నారు. అనగా సంవత్సరం, పరివత్సరం, ఇదావత్సరం, ఇదువత్సరం, ఇద్వత్సరము అని ఐదు వత్సరాలు ఒక యుగం. మళ్ళీ రెండో యుగం సంవత్సర, పరివత్సర ఆదిగా పరిగణించబడుతుంది. అనగా ప్రభవ సంవత్సరం, విభవ పరివత్సరం. శుక్ల ఇదావత్సరం, ప్రమోద ఇదు వత్సరం, ప్రజాపత ఇద్వత్సరము ఈ విధంగా 60 సంవత్సరాలలో ఈ ఐదు 12 సార్లు తిరుగుతాయి. ఇపుడు ఈ విలంబి నామ సంవత్సరం 7వ యుగంలో ఉంది. ఈ యుగానికి దేవత ఇజ్య నామకం అనగా యజ్ఞం. 7వ యుగంలో రెండవది అయిన పరివత్సరం విలంబి నామ సంవత్సరం. ఈ పరివత్సరానికి సూర్యుడు దేవత. విలంబి అనగా కూడా అర్థం సూర్యుడే. 'విశేషేన లంబత ఇతి విలంబః' అనగా విశేషంగా వ్రేళ్ళాడు వాడు అని అర్థం. అటు స్వర్గ లోకానికీ, ఇటు పాతాళ లోకానికీ మధ్య ఉన్న భూలోకానికి తన తేజస్సు ప్రసరించేలా వేలాడగల శక్తి ఉన్నవాడు, వేలాడుతూ సాగువాడు సూర్యుడే కనుక విలంబి అనగా సూర్య భగవానుడు. **విలంబిః, అర్కః, భగవాన్ తపనో భాస్కరో రవిః** అనునది కోశం. అందుకే ఈ సంవత్సరానికి సూర్య భగవానుడే రాజు.

ఈ వత్సర మానం ఐదు విధాలుగా ఉంటుంది. అవి చాంద్ర మానం, సౌర మానం, సావన మానం, నాక్షత్ర మానం, బార్హస్పత్య మానం.

చాంద్రమానం: ఇది చంద్రుని సంచారంతో లెక్కించబడుతుంది. అనగా శుక్ల ప్రతిపత్తు మొదలు అమావాస్య వరకు ఒక మాసం. ఈ మాసంలో పూర్ణిమ నాడు చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటే ఆ మాసానికి ఆ నామం ఉంటుంది. ఉదా హరణకు పూర్ణిమనాడు చిత్ర నక్షత్రం ఉంటే చైత్ర మాజం, విశాఖ నక్షత్రం ఉంటే వైశాఖ మాసం. ఈ చాంద్ర సంవ త్సరంలో 354 రోజులుంటాయి.



సౌర మానం: మేషాది ద్వాదశ రాశులు సూర్య సంచారంచే కొలవబడు కాలం సౌరమానం. సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ పేరే ఆ మాసానికి వస్తుంది. ఉదాహరణకు సూర్యుడు మేషరాశిలో ఉంటే మేష మాసం, వృషభ రాశిలో ఉంటే వృషభ మాసం. ఈ సౌర సంవత్సరంలో 365 రోజులుంటాయి.

సావన మానం: ఇందులో మాసానికి 30 రోజులుంటాయి. ఇలా సంవత్సరానికి 360 దినాలు. ఇది యుగ, మన్వంతరాది విభాగానికి ఉపయోగిస్తుంది.

నాక్షత్ర మానం: అశ్వని మొదలగు 27 నక్షత్రాల యందు చంద్రుని సంచారంతో ఏర్పడిన 12 మాసాలు కలది. ఈ సంవత్సరానికి 324 రోజులుంటాయి.

బార్హస్పత్య మానం: బృహస్పతి మేషాది రాశులలో సంచరించడం వల్ల ఏర్పడే సంవత్సరం ఇది. ఈ సంవత్సరానికి 361 రోజులుంటాయి.

అయనాలు: సంవత్సరంలో రెండు అయనాలు ఉంటాయి. అవి ఉత్తరాయనం, దక్షిణాయనం.

సూర్యుడు మకర సంక్రమణం మొదలు ఆరు రాశులు అనగా మిథున సంక్రమణం వరకూ ఉండేది ఉత్తరాయనం. ఈ సమయంలో సూర్యుడు భూమధ్య రేఖకు ఉత్తరంగా సంచరిస్తాడు.

సూర్యుడు కర్కాటక సంక్రమణం నుంచి ధనుస్సంక్రమణం వరకూ ఉండే కాలం దక్షిణాయనం. ఈ సమయంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణంగా సంచరిస్తాడు. సామాన్యంగా ఉత్తరాయనం మాఘ మాసం నుంచి ఆషాఢ శుక్ల పక్షం వరకూ, దక్షిణాయనం ఆషాఢ కృష్ణ పక్షం లేదా శ్రావణ మాసం మొదలు పుష్య మాసం వరకూ ఉంటుంది.

ఋతువులు

సంవత్సరానికి ఆరు ఋతువులు ఉంటాయి వీటిలో సౌర, చాంద్రఋతువులు ఉంటాయి. వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిరాలు ఆరు ఋతువులు. ఒక్కొక్క ఋతువులో రెండు మాసాలు ఉంటాయి. చైత్ర, వైశాఖాలు వసంత ఋతువు. జ్యేష్ఠ ఆషాఢాలు గ్రీష్మ ఋతువు, శ్రావణ భాద్రపదాలు వర్ష ఋతువు. ఇలా రెండు మాసాలు ఒక ఋతువు.

మాసాలు:

మాసాలు నాలుగు రకాలు అవి చాంద్ర మాసం, సౌర మాసం, సావన మాసం, నాక్షత్ర మాసం.

మాసంలో రెండు పక్షాలుంటాయి అవి శుక్ల పక్షం, కృష్ణపక్షం.

రాశి చక్రానికి సంబంధించిన కాలాన్ని రాశి, భాగ, లిప్త, విలిప్త రూపాలుగా గుణిస్తారు. 60 విలిప్తలు ఒక లిప్త, 60 లిప్తలు ఒక భాగం, 30 భాగాలు ఒక రాశి. 12 రాశులు ఒక భగణం. ఈ భగణంలో 12 రాశులు 27 నక్షత్రాలు, తిథులు, వారం, యోగం, కరణాలు గుర్తిస్తారు. ఇలా సూర్యుడు ఒక సారి రాశి చక్రాన్ని చుట్టివచ్చేందుకు 360 దినాలు, 12 మాసాలు పడుతుంది. ఇది ఒక సంవత్సరం. ప్రతి మాసంలో రెండు పక్షాలు ఉంటాయి. అవి శుక్ల పక్షం, కృష్ణపక్షం. పక్షం 15 దినాలు. దినానికి అరవై ఘడియలు. ఘడియకు 24 నిముషాలు. సూర్యోదయం మొదలు మరల సూర్యోదయం వరకూ ఉన్న కాలాన్ని దినం అంటారు.

పంచాంగం అంటే

పంచాంగం విషయానికి వస్తే ఐదు అంగములు కలది. అందుకే పంచాంగం అన్నారు. అవి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు.

తిథులు: పాడ్యమి నుంచి పూర్ణిమ వరకూ, రెండవ పక్షంలో పాడ్యమి నుంచి అమావాస్య వరకూ ఉండేవి 30 తిథులు.

వారాలు: ఇవి ఏడు. ఆది నుంచి శనివారం వరకు

నక్షత్రాలు : ఇవి 27. అశ్వని నుంచి రేవతి వరకు

యోగములు: ఇవి 27. విష్కంభం నుంచి వైధృతి వరకు

కరణాలు: ఇవి 11. భవ నుంచి కింస్తుఘ్నం వరకు. ప్రతి దినం రెండు కరణాలు ఉంటాయి

సంవత్సరాలు: ఇవి 60. ప్రభవ నుంచి అక్షయ వరకు.

గ్రహాలు: ఇవి 9. అవి సూర్య, చంద్ర, అంగారక, బుధ, గురు, శుక్ర, శని, రాహు, కేతువులు.

రాశులు: ఇవి 12. మేషం నుంచి మీనం వరకు.


యుగాలకాల ప్రమాణం

కలియుగ కాల ప్రమాణం 4,32,000 సంవత్సరాలు
ద్వాపర యుగ ప్రమాణం 8,64,000 సంవత్సరాలు
త్రేతాయుగ ప్రమాణం 12,96,000 సంవత్సరాలు
కృతయుగ ప్రమాణం 17,28,000 సంవత్సరాలు

ఈ నాలుగు యుగాల మొత్తం 43,20,000 సంవత్సరాలు. ఇది ఒక మహాయుగం. 71 మహాయుగాలు ఒక మన్వంతరం. 14 మన్వంతరాల కాలం బ్రహ్మకు ఒక పగలు. వెయ్యి మహాయుగాలు అనగా 432 కోట్ల సంవత్సరాలు బ్రహ్మకు ఒక పూట. పగలు రాత్రి కలిపితే, 864 కోట్ల సంవత్సరాలు ఒక రోజు. ఇలాంటి రోజు లు 30 ఒక నెల. ఆ నెలలు 12 ఒక సంవత్సరం. అటువంటి 100 సంవత్సరాలు బ్రహ్మ ఆయుఃప్రమాణం. ఇప్పుడున్నది 7వ బ్రహ్మ. ఇప్పటి వరకు ఆరుగురు బ్రహ్మలు గతించారు.

ఆ బ్రహ్మల జన్మలకు పేర్లున్నాయి. ప్రస్తుతం మనం చెప్పుకుంటున్న బ్రహ్మ శ్రీమన్నారాయణుని నాభి నుంచి పుట్టినట్లుగానే వారు ఆ పరమాత్మ ఒక్కొక్క అంగం నుంచి పుట్టారు.

మానస జన్మ శ్రీమన్నారాయణుని మనసు నుంచి పుట్టినవాడు
చాక్షుష జన్మ ఆయన కంటి నుంచి జనించిన వాడు
వాచిక జన్మ వాక్కు నుంచి వచ్చిన వాడు
శ్రావణ జన్మ చెవి నుంచి ఆవిర్భవించిన వాడు
నాసిక జన్మ ఆయన ముక్కు నుంచి పుట్టినవాడు
అండ జన్మ అండము నుంచి వచ్చినవాడు
పద్మ జన్మ నాభి కమలం నుంచి పుట్టినవాడు



- డా॥ కందాడై రామానుజాచార్య

దినఫలాలు

మేష రాశి: ప్రయాణాల విషయంలో అనుకూలత ఉంటుంది. పనులలో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆర్థిక చిక్కులు పరిష్కరింపబడతాయి. శత్రుభీతి పోతుంది.

వృషభరాశి: అసహన పరిస్థితులు తగ్గుతాయి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొం టారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చికరాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికిపోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ది చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ తప్పని సరి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్య ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



సంస్కృతి

వసంత శోభల ఉగాది ఆరోగ్య రక్షణకు ఆది

వసుధపై వసంతం వికసించిన తొలిరోజు ఉగాది. ఆరు రుచుల్లోని "అంతరార్థాన్ని" జీవితానికి అన్వయించుకుంటూ జరుపుకునే విశిష్ట పండుగ యిది. కాలాన్ని గణిస్తూ మారుతున్న రుతువులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని రక్షించుకోవడమే పండుగ పరమార్థం. "ఉగాది" రోజున మనం చేసే "పండుగ" కృత్యాల్లో "ఆరోగ్య నియమాలు" దాగి ఉన్నాయి.



యుగాదికి ఆది "యుగాది". తెలుగు సంవత్సరాలలో మొదటి పండుగ. దీనికి యుగాది అని పేరు వచ్చింది. ఉగాది పచ్చడికి నింబకుసుమభక్షణం, అశోక కళికా ప్రాశనం అని పేర్లు. ప్రాచీనకాలం నుంచి ఉగాది పచ్చడిని సేవించే ఆచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఉగాది పచ్చడి తయారీలో వైద్యవిజ్ఞానం దాగి వుంది. ఉగాది పచ్చడిని కేవలం సంప్రదాయ దృష్టితో కాకుండా ఆరోగ్య రక్షణకోసం అందరూ సేవించాలి.

శ్లోకం: "వర్షదానింబకుసుమం శర్కరామ్లఘృతైరుత్వం భక్షితం సర్వయామేచ తద్వదం సౌఖ్యదాయకం శతాయుర్వ్రదేహాయ సర్వసంపత్కరాయుచ సర్వారిష్ట వినాశాయ నింబకుసుమభక్షణం".

అని జీవితానికి పనికి వచ్చే సందేశాన్ని తెలియజేస్తూ ఆశీర్వదిస్తోంది ఉగాది. వసుధపై వసంతం వికసించిన తొలిరోజు ఉగాది. ఆరురుచుల్లోని "అంతరార్థాన్ని" జీవితానికి అన్వయించుకుంటూ జరుపుకునే విశిష్ట పండుగ యిది. కాలాన్ని గణిస్తూ మారుతున్న రుతువులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని రక్షించుకోవడమే పండుగ పరమార్థం. "ఉగాది" రోజున మనం చేసే "పండుగ" కృత్యాల్లో "ఆరోగ్యనియమాలు" దాగి ఉన్నాయి. ఆ నియమాలు పాటించడం వలన మనస్సు, బుద్ధి, ఇంద్రియాలకు ఆహ్లాదం, చైతన్యం కలుగుతాయి. ఉగాది వచ్చే సమయాన్ని ఆయుర్వేదంలో "ఆదాన"కాలంగా పరిగణిస్తారు. "రుతుసంధిషువ్యాదిర్జాయతే"..అన్నట్లు రుతువుల మధ్య సంధికాలాలు ఎప్పుడూ అనారోగ్యాల్ని కలిగిస్తాయి. ఆ అనారోగ్యం నుంచి రక్షించుకునేందుకు ఈ కాలంలో "వసంతనవరాత్రి" దీక్షలు వస్తాయి. పండుగ నాటి ఉదయం చేసే అభ్యంగన స్నానంలోనూ ఆరోగ్య రహస్యాలు దాగి వున్నాయి. "ఆరు రుచుల"సమ్మేళనంతో తయారుచేసే "ఉగాది" పచ్చడి విశిష్టత అందరికీ తెలిసిందే అయినా కొత్త సంవత్సరంలా ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది. "ఔషధ గుణాల సమ్మేళనం" పచ్చడిలో ప్రధానంగా "ఆరురుచులకు" ఆరుపదార్థాలు చేరుస్తారు. బెల్లం, మిరియాలు, ఉప్పు, చింతపండు, వేపపువ్వు, మామిడి ప్రధానమైనవి. ఇవి వరుసగా తీపి, కారం, ఉప్పు, పులుపు, చేదు వగరులు అనే "ఆరురుచులకు ఇవి ప్రాణదిత్వం వహిస్తాయి. వీటితో పాటు జీలకర్ర, అరటిపళ్లు, చెరుకుముక్కలు, ఎండుద్రాక్షలు జీడిపప్పు, బాదంపప్పు లాంటివి కూడా వేస్తారు. ఆహారధాన్యాలన్నీ అప్పుడే కొత్తగా వస్తాయి. కాబట్టి వాటిని "ఉగాది"పచ్చడిలో వేసిన తర్వాత వాటిని వాడుకోవడం "తెలుగువారి" ఆచారం. ఉగాది "పచ్చడి వేసే ముఖ్యపదార్థాలలో ఉండే సుగుణాలను తెలుసుకుందాం.

వేపపువ్వు: "యాంటీబయాటిక్"గా ఉపయోగపడుతుంది. అనేక వ్యాధులకు ఇది "దివ్యౌషధం".

మామిడి: ఫలములో ఇది రాజాఫలం. ఇది వాత, పిత్త, కఫాలను అదుపుచేస్తుంది. "రక్తస్రావాన్ని" అరికడుతుంది. అతిసారం నివారిస్తుంది.

చెరకు: పిత్తనివారిణి, మలబద్ధకం పోగొడుతుంది. మూత్రపిండాలు కాలేయం, కళ్లకు రక్షణనిస్తుంది. ఉత్తేజం కలిగించి, సత్వర శక్తినిస్తుంది.

అరటిపండు: కుసుమరోగనివారిణి, బొల్లు, మత్తు, అతివేడిని తగ్గిస్తుంది.

బెల్లం: ఎముకలకు గట్టిదనం చేకూరుస్తుంది. ఆయుర్వృద్ధిని ఇచ్చి "శిరోబాధల"నుండి రక్షణ నిస్తుంది.

చింతపండు: జీర్ణశక్తిని కలిగిస్తుంది. వాతం హరిస్తుంది. మూలశంక వంటి వ్యాధులు రావు.

ఉప్పు: ఇది అరుగుదలకు, రుచికి ఉపయోగపడుతుంది. ఉగాది పచ్చడిలో వాడే ముఖ్యమైన పదార్థాలన్నీ "ఆరోగ్యాన్ని"పెంపొందింపజేస్తాయి. "రుతువులు" మారినప్పుడల్లా ఆహారంలో కొన్ని నియమాలు పాటించాలి. అది కూడా ఉగాది నుంచే మొదలుపెట్టాలని మన పూర్వీకులు సూచించినారు.

"ఉగాది పచ్చడి"ని సేవించేటప్పుడు ఈ క్రింది శ్లోకం పఠించాలని "శాస్త్రవచనం".

త్వామష్మశోక వరాభీష్టమధుమాస సముద్భవ!
నిచామి శోకసంతప్తాం
మమశోకం సదా కురు॥

'చైత్రశుద్ధ పాడ్యమి" అంటే ఉగాది నుంచి పౌర్ణమి వరకు "పదిహేను రోజుల" పాటు ఉగాది పచ్చడి సేవిస్తే వివిధ వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని "ఆయుర్వేదం" తెలుపుచున్నది. సంవత్సరాంతం జీవితంలో ఏర్పడే కష్టనష్టాలు, సుఖ సంతోషాలను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలనే "తాత్త్విక సందేశం" యుగాది పచ్చడిలో ఉంది. "ఆరురుచుల సమ్మేళనము" మానవ జీవనానికి సంకేతకంగా ఉంది.
"బెల్లాన్ని"- ఆనందానికి సంకేతంగా భావిస్తారు
"ఉప్పు"-ఉత్సాహానికి
"చేదు"-సహనం అలవరుచుకోవడానికి
"పులుపు"-ఓర్పును నేర్పడానికి
"వగరు"-కొత్తసవాళ్లను ఎదుర్కోవడానికి
"కారం"- ధైర్యానికి చిహ్నాలని మనవారు చెబుతారు.
నాడు మానవుడు "నిప్పు" తెలుసుకున్నాక నాలుకకు రుచులు అలవాటు చేశాడు. అయితే పచనం చేయని ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం వృద్ధి చెందుతుంది. పచ్చికూరగాయల వంటివి ఏడాది పొడవునా తినలేనివారికి "ప్రకృతి" వైద్యవిధానాన్ని అలవాటు చేసేందుకు "ఉగాది పచ్చడి" ఉపయోగపడుతుంది. అయితే ఉగాది పచ్చడిని ఎప్పుడూ పరగడుపున సేవించాలి. అంటే పండుగ పూట ముందుగా తలస్నానం పూర్తిచేయాలి. "మన ఇష్టదేవతా పూజ చేసి నివేదన చేయాలి. తదనంతరం ఇంటిలోని వారంతా "యుగాది" పచ్చడిని సేవించాలి. అప్పటివరకూ మంచినీళ్లు తప్ప మరేది తినకూడదు. తాకకూడదు. అది నియమం. "యుగాది" పచ్చడిని అలా సేవించడం వల్ల అది "ఔషధ ప్రాయంగా" పనిచేస్తుంది.
ఈ యుగాది రోజున నూతన పంచాంగానికి పూజ చేసి సాయంకాలంలో దేవాలయాలలో పంచాంగ శ్రవణాలు చేస్తారు. కొన్ని ప్రాంతాలలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని "కవిసమ్మేళనాలు" కూడా నిర్వహిస్తుంటారు.

- ఢిల్లీ విజయకుమార్ శర్మ
9618597139

యుగాది పర్వంబిది

తెలుగువారికి పసందు చేయు పర్వంబిది
షడ్రుచులు మేళవించి జీవిత సారాంశమును
తెలియజేయు పండుగ ఇది
తెలుగువారి నూతన సంవత్సరానికి ఆదియైన పర్వంబిది
కమ్మని "కోకిల" రావాల శుక,పిక ధ్వనులకు
ఆలవాలమైన పండుగ యిది
కవన గోష్టులతో కవులకు కవనభోజనంబు
పెట్టు పర్వంబిది
నూతన వధూవరుల వలెయుండు పచ్చని
పుడమి పండుగ యిది
ప్రాంతభేదములకు తావులేని పండుగయిది
దూరదర్శన్ వారు తెలుగు కార్యక్రమాల వేయు పర్వంబిది
పంచాంగ శ్రవణాలను అందించి తన జీవిత కష్ట
సుఖాలను ఆదాయ, వ్యయాలను తెలుసుకొనే పర్వంబిది
కవులంతా గానం చేసే శ్రీ విళంబి నామ సంవత్సరం యిది.

ఈ రసాబ్దిలో...?!నైరూప్యవి"చిత్రం"!

ప్రభవ నుంచి ప్రారంభమయ్యే మధురోహలు
"కాలం"ఎంతైనా "కలి"విడి-విడి ప్రయాణిస్తోంది!గత ప్రాభవాల్నించి-
జాతులు-సంస్కృతులు తవ్వి తలకెత్తుకుంటూనే వుంటాయి.
అది హేవళంబా-విళంబా, పేరున్న ప్రభావమో, దిద్దుబాట్లతో కానీ,
య(వ్య)ధార్థ జీవనం నుంచి అర్థసత్యాలు ప్రశ్నలౌతూనే ఉంటాయి!!
అస్తిత్వం-హోదాల గురించి మేధోవికసనం మల్లగుల్లాలు
పడుతుంటుంది.
అరా(జ)కీయం ముసుగులో-
ఎవరో ఎవర్నో ఉసిగొల్పుతారు
ఉద్యమాలకు ఆజ్యం పోస్తూనే వుంటారు



ప్రాంతం-భావం-భాషల ప్రకటనలు
విన్యాసాల పటాటోపాలు గుప్పిస్తూనే వుంటారు.
సామాన్యజనం ఘోషలు వాళ్లకవసరం లేదు
ఈ రసాబ్దిని-రసాభాసగా (ఏ)మార్చిన
విభజన ఎడారిలో
ఏ రేణువుని తడిమినా మృగతృష్ణే కన్పించింది
కలిసి రాసుకున్న ఏకాంకికలు
కండువాల రంగుల్లోని ఆంగికాభినయాలు
దొంగచాటుగా కదలికల్ని-కవళికల్లో మార్పుని
రుతువుల కంటే జోరుగా
విలువల-వలువలు వెలతెలాపోతున్నాయి.
పెద్దల గద్దెలకోసం "సమన్యాయం"
చెల్లు చీటీల్ని రాసేసుకుంటోంది!
యిప్పుడు తెలుగుతనం "మిథ్యా"పాదాలు
ప్రయాణం-ధృవాల అంచుల్ని వెతుకుతోంది
అక్షాంశాలు-రేఖాంశాలు.
ఆర్థిక యిబ్బందుల నియంత్రణలు- నిమంత్రణలు
ఏ చుట్టూ కొలతల చ(ట్రం)ట్టంలో యిమడాలో
చదరంగంలో ఎత్తులు- పై ఎత్తులు వేస్తూనే వున్నాయి.
ఆడంబరంగానో, నిరాడంబరంగానో అసలు "రంగు"ల్నించి
ఆవిష్కరణం సారూప్య చిత్రం, విళంబనం కాకుంటే మేలు!!

- వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు
9441148158

తెలుగు-ఉగాది

క్రొంగొత్త భావాల శ్రీ విళంబి
తెలుగింట సరాగాలు పలికించాలని
పులకించిన వసంతం వెన్నెల వికసించింది
కొమ్మావి చిగురు పచ్చదనంతో
పరవశించిన ప్రకృతి కాంత
చైతన్య ఉగాది 'తెలుగు ఉగాది'



తెలుగింట తెలుగునాట వికసించిన
తెలుగు వైభవం సౌభాగ్య ఉగాది
అన్నీ రుచులు కలబోసిన
ఉగాది పచ్చడి తెలుగు సంవత్సరాది
తొలికానుక తెలుగుకీర్తికి హారతులు పడుతూ
యుగయుగాలుగా సరికొత్తదనంతో
ఆహ్వానం పలుకుతోంది"తెలుగు ఉగాది"
పండిత పామరుల పంచాంగ పఠనం
తెలుగు సంస్కృతికి సుందరం! సుమధురం!
మహిళా జగతికి మేలుకొలుపు 'తెలుగు ఉగాది'
తెలుగు పండుగ ఉగాది కమనీయం
వెలుగు పండుగ ఉగాది రమణీయం.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర
8886574370



వసంత సరాగాలు

చిగురాకుల కులుకు చిలుకలు
చిలకరించెను కలికి పలుకులు

మావి గుబురులో కోయిల గానం
ప్రేమ జీవులకు మురళీ మోహన రాగం

తహతహమని పూలతీగ
తరువుల గుండెల పాకింది

తరగని వన్నెల మగసిరి తుమ్మెద
చెరగని జిలుగుల సొగసరి కుసుమం

చిలిపి పరువాల చిందులతో
వలపు మురిపాల విందులతో

హాయిని కురిసే మోజుల జాతర
తీయని సుఖాల విహారయాత్ర


ఆకాశపు అంచులు చూసి
ఆనందపు లోతులు తాకి

జీవన మధురిమల తరియించి
జీవరాశులన్నీ పులకించె
వనమంతా వెల్లివిరిసె వసంతాల సరాగాలు

- చిరమన వెంకట రమణయ్య
9441380336

ఉగాది ఆకాంక్ష

జీవితం
కష్టసుఖాల సంగమం
మెట్టపల్లాల మిశ్రమం
ఎన్నో తీపి గుర్తులు
మరెన్నో చేదు జ్ఞాపకాలు
అన్నీ సమంగా ఆస్వాదించడమే జీవితం
ఉగాదులెన్నో...
ఉషస్సులెన్నో...
జీవితంలో పరివర్తన ముఖ్యం.
'హేవిళంబి' పంచిన మంచీ చెడుల్ని
బేరీజు వేసుకుందాం.



దుర్నీతిని, దురంతాలను
దూరం చేసి, అంతం చూసి
'విళంబి'ని విశేషంగా మలచుకుందాం.
విలువల వెలుగులో జీవితాలను
నిర్మించుకుందాం.
సర్వ మానవాళి సుఖసంతోషాలతో
వర్ధిల్లాలని,
ఉభయ తెలుగు రాష్ట్రాలు ఉజ్వలంగా
వెలిగిపోవాలని
దేశం ప్రగతి పథంలో పరుగులు తీయాలని
పుడమిపై శాంతి పరిఢవిల్లాలని
మనసారా కోరుకుందాం
విశ్వప్రభువును వేడుకుందాం.
శ్రీ 'విళంబి' నామ ఉగాది శుభాకాంక్షలతో...

- యం.డి. ఉస్మాన్ ఖాన్
9912580645



ఆకుల సంగీతం

ఎన్ని రంగుల పువ్వులున్నా
ఆకులెందుకు పచ్చరంగులో ఉంటాయి!
ప్రేమలెన్ని ఉన్నా
అమ్మ ప్రేమ ఒక్కటే గొప్పదని బోధించటానికి...
ఆకులెందుకు రాలిపడతాయో తెలుసా!
ఆనందాన్ని కాచి వడబోసి
అవనికి పంచే కోకిల ఇంకా రాలేదని...

ఆహారం సృజించే కృషిలో తలమునకలై ఉన్నాయి కాబట్టే
ఆకుల బిడ్డల్ని ఆదరంగా ఒడిలో పెట్టుకొని
ఊయల లూపుతోంది గాలి తల్లి...
ఆకుల్లో బద్ధకాన్ని హత్య చేసే బాకులున్నాయి
నిరాశను కాల్చేసే తుపాకులున్నాయి...

అందంగా మెరిసే పచ్చని ఆకులు
నేలరాలే ముందు ఎంత దిగులుపడతాయో తెలుసా!
కృశించి కృశించి రంగు నశించి అవనిలోనికే వెళ్లిపోతాయి,
ఆకులంటే బిడ్డలు పట్టించుకొనని గొప్ప మనసు వృద్ధులు...

డివైడరులు పెట్టి పెంచుతున్న చెట్ల నుండి
హైవేల మీద రాలిపడుతున్న ఆకులు ఆకులు కాదు-
నగరాల ప్రేమతో పరుగెత్తుతున్న ప్రపంచంలో
మహాత్ముల తీరని ఆశయాలు, ఆలోచనలు...

మనిషికి ఆనందానికి వంతెన చెట్టు,
ప్రతి ఆకు-వంతెనలో ఒక్కొక్క రాయి,
వంతెన పాడయితే
కొత్త వంతెన కట్టుకోవాలని చెబుతుంటాయి ఆకులు.
వంతెనల్ని నాశనం చేయుటమే పనిగా పెట్టుకుంటే
జాగ్రత్త-
ఆకులు రాలకుండా సమ్మె చేస్తాయి,
అప్పుడు మనుషులే రాలిపడేది.

- డా. రావి రంగారావు
9247581825

విళంబికి కొత్తరూపు!



ఇది దగాపడ్డ ఉగాది
దిగాలుపడ్డ ఉగాది
హామీలన్నీ నీటిబుడగలైపోతే
చిగిరించేందుకు ఏమీ మిగలక
శిశిరం కాటేసింది. ఇక
చైత్రం కూడా ముఖం చాటేస్తుందేమో!
ప్రత్యేక హోదా గోదాలో
మనిషి మనిషి గా మిగలకపోతే
రాజకీయాలు అందని చందమామల్ని చూపి
అగాధపు అంచులకు నెట్టేస్తే
పురిటిబిడ్డ అని కూడా చూడకుండా
పాలుపట్టడం మానేస్తే
నిన్నటి ఉగాది ఉషస్సులేనిదై వెలవెలబోయింది
తూర్పు తెల్లవారకపోతే
మార్పు వీవెన వీయకపోతే
తెలుగువాడి బ్రతుక్కు
ఉషఃసమీరాలు వీచేదెట్లా?
బ్యాంకులు హామీల చక్రబంధంలో చిక్కుకొని
జనం డబ్బులు పప్పుబెల్లాలుగా పంచేస్తే
ఏ ఉగాది మాత్రం ఉషస్సును ప్రభవించగలదు.
విళంబి సాక్షిగా చెబుతున్నాను
సవాళ్ల జిఎస్‌టితో ఓ ప్రక్క
ఆడిట్లు లేని బ్యాంకింగ్ రంగంతో మరోప్రక్క
దేశం ముందడుగు వేయడం ఇక అసాధ్యం!
ప్రభుత్వాలు ఏదో చేస్తాయని
ఎండమావులెంట పరుగులెత్తితే
స్వీయనియంత్రణలేని బ్రతుకింతే!
రవిరాజై, శనిమంత్రై
సవాలు విసరే, విళంబిని
మనం ఎదురీదాలి
కాలాన్ని లుంగీగా చుట్టుకొని
నిత్యం పయనించే మనుషులం
చావు తప్పదని తెల్సినా
చేవతో వేకువల్ని స్వంతం చేసుకోగలం
వెలుగుల్ని సృష్టించుకోగలం
విళంబికి కొత్తరూపునివ్వగలం!

- చిన్నినారాయణరావు
9440202942



★ దర్శకుడు ఉపేంద్ర మాధవ్ కథ చెప్పిన తర్వాత టైటిల్ ఎమ్మెల్యే మంచి లక్షణాలున్న అబ్బాయి అని చెప్పారు. పాత్రకు, కథకు బాగుంది కదాని అదే పేరును ఖరారు చేశాం. అందరికీ మంచి చేయాలనుకునే పాత్ర నాది. అయితే మంచి చేసే క్రమంలో కొన్ని తప్పులు జరుగుతాయి. చేసేది మంచి అనుకుంటే అది మరో పొరపాటు అవుతుంది. అప్పుడు దాన్ని తిరిగి సరిదిద్దుకునే ప్రయత్న చేస్తాను.

★ పిల్లలకు ఆస్తులు ఇస్తే ఖర్చు చేస్తారు. చదువును ఇస్తే జీవితాంతం సమాజానికి ఉపయోగపడతారు. ఇదే ఎమ్మెల్యే కథలోని అసలు నేపథ్యం. సినిమాలో ఒకటి ఉంటే ట్రైలర్‌లో మరొకటి చూపించకూడదు అనుకున్నాం. అందుకే కథ తెలిసేలా ట్రైలర్ తయారు చేశాం. ప్రేక్షకులను తప్పుదారి పట్టించకూడదు అనేది మా ప్రయత్నం.

★ఈ కథలో నాయిక పాత్ర చాలా కీలకం. ప్రభావవంతంగా ఉంటుంది. పేరున్న నాయిక అయితే ప్రేక్షకులు పాత్రను బాగా అర్థం చేసుకుంటారు అనిపించింది. అందుకే కాజల్ అగర్వాల్‌ను తీసుకున్నాం. లక్ష్మీ కళ్యాణం తర్వాత కాజల్ మరోసారి నాతో కలిసి నటించింది.

★దర్శకుడు కథ చెప్పినప్పుడు కథలో నిజాయితీ చూశాను. రచయిత దర్శకుడు అయితే పుటల పుటల సంభాషణలు చిన్న వాక్యంలో చెప్పగలరు. ఉపేంద్ర మాధవ్ ప్రతిభ గల దర్శకుడు. అతనికో ప్రత్యేకమైన శైలి ఉంది. నాతో కొత్తగా డైలాగులు చెప్పించాడు. గతంలో చేసిన చిత్రాలకంటే ఇందులో నేను మాట్లాడే తీరు వినూత్నంగా ఉంటుంది. ట్రైలర్‌లో చూపించినట్లు రజినీకాంత్ తరహాలో సంభాషణలు చెప్పాను.

★ జయాపజయాలు నటీనటులకు సహజం. కథ విన్నప్పుడు అది ఎంత బాగుంది అనేది మాత్రమే చూస్తాను. అంతే గానీ ఈ సినిమా ప్రేక్షకులకు

★ నా జయాపజయాల్లో కుటుంబ నా వెంటే ఉంటుంది. వాళ్లే నా తొలి విమర్శకులు. ఇలా చేసి ఉంటే బాగుండేది అనే చర్చలు మా మధ్యే వస్తుంటాయి. తారక్ నేను మాట్లాడుకునేప్పుడు ఎక్కువగా కార్లు, ఎలక్ట్రానిక్ ఉపకరనాల సంగతులు మాట్లాడుకుంటాం.

★ రాజకీయంగా నా భవిష్యత్‌కు ఎమ్మెల్యే నిదర్శనం కాదు. రేపు నేనెలా ఉండాలో సినిమాలో చేసి చూపించను. రాజకీయాలు నాకు తెలియవు. అందులోకి వచ్చే ఉద్దేశం లేదు. సినిమాలు చేయడంలోనే సంతోషంగా ఉన్నాను.

★ ప్రస్తుతం నేను చేస్తున్న మరో సినిమా నా నువ్వే. జయేంద్ర దర్శకుడు. ఆయన కథ చెప్పినప్పుడు ఈ కథకు నేనెలా సరిపోతాను అని అడిగాను. మీరు చేయగలరు అన్నారాయాన. అదొక కొత్త తరహా ప్రేమకథ.

★ సినిమాలు చేసుకుంటూ వెళ్లడమే నా పని. దాని ఫలితం మన చేతుల్లో ఉండదు. సినిమా చేసేప్పుడు అందులో నటించడాన్ని ఆస్వాదించామా లేదా అన్నదే చూస్తాను. నా సినిమాలు ఆడకున్నా మంచి ప్రయత్నం చేశాడు అనిపించుకున్నాను. ఇప్పటిదాకా నేను చెత్త సినిమాలో నటించాను అని ఎవరూ అనలేదు.

★ మల్టీస్టారర్ సినిమాలు చేసేందుకు నేను ఎప్పుడూ సిద్ధమే. సాయి ధరమ్ తేజ్ నేనూ కలిసి ఓ సినిమా చేయాలనుకున్నాం. ఏఎస్ రవికుమార్ దర్శకుడు. కథ మా ఇద్దరికీ సంతృప్తికరంగా రాలేదు. అందుకే వద్దనుకున్నాం. త్వరలోనే ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని చేయబోతున్నా. వివరాలు నేనే చెబుతాను.

ప్రేక్షకులను విసిగించే చిత్రాలు చేయలేదు...

-కళ్యాణ్‌రామ్

కథనాయకుడిగా, నిర్మాతగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు నందమూరి కళ్యాణ్ రామ్. ఆయన నటించిన తాజా చిత్రం ఎమ్మెల్యే మంచి లక్షణాలున్న అబ్బాయి సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. కాజల్ నాయికగా నటిస్తుండగా...నూతన దర్శకుడు ఉపేంద్ర మాధవ్ తెరకెక్కించారు. మంచి లక్షణాలున్న అబ్బాయి ఎమ్మెల్యేగా ఏం చేశాడో కళ్యాణ్ రామ్ వివరించారు.

నేను ఈ చిత్రంలో తొలిసారిగా రాజకీయ నాయకుడి పాత్రలో నటిస్తున్నాను. ఎమ్మెల్యేగా కనిపిస్తాను. తరతరాలుగా ఒక ఊరిని పాలిస్తున్న నాయకుడికి వ్యతిరేకంగా ఎదురు నిలిచే ఓ యువకుడి పాత్ర నాది. అయితే తీవ్రమైన రాజకీయ ఉపన్యాసాలు కథలో ఉండవు. వినోదాత్మకంగా సాగే తేలికైన సరదా సినిమా ఇది. కార్పొరేట్ విద్య ప్రతి తల్లిదండ్రులకు భారమవుతోంది. పిల్లలను ఉన్నత విద్య చదివించుకోవాలనే ఆరాటంలో పేదలు తమకున్న సర్వస్వాన్నీ కోల్పోతున్నారు. ఇలాంటి సమస్యను కథలో ప్రస్తావిస్తున్నాం.

నచ్చుతుందా లేదా అనే సందేహాలు పెట్టుకోను. అలాగని పూర్తి సహజమైన సినిమాలు చేస్తే ఎవరూ చూడరు. పాటలు, పోరాటాల్లో కొంత స్వేచ్ఛ తీసుకుంటాం. అయితే సాధ్యమైనంత నేల విడిచి సాము చేయకుండా ప్రయత్నిస్తాం.

★ పటాస్ సినిమా తర్వాత అలాంటి మరో విజయం దక్కలేదు. ఇజం ప్రేక్షకాదరణ పొందకున్నా నాకు ఎంతో ప్రత్యేకమైన సినిమా. ఆ సినిమాతోనే నటుడిగా మరింత పరిపక్వత చెందాను. నటుడిగా సంశయాలు వదులుకున్నాను. నా అభినయాన్ని విస్తృతపరుచుకున్నాను. పటాస్ విషయంలో కథ విని ఎలా నిర్ణయం తీసుకున్నానో, ఇజం చిత్రానికీ అలాగే చేశాను. ఒకటి ప్రేక్షకులకు నచ్చింది, మరొకటి నచ్చలేదు అంతే.

★ కథ అంగీకరించాక...నిర్మాణ వ్యయాన్ని అంచనా వేస్తాను. నా వ్యాపార పరిధి మేరకే ఖర్చు పెట్టమని నిర్మాతకు చెబుతాను. ఎమ్మెల్యే సినిమాకు పెట్టిన ఖర్చులో చాలావరకు శాటిలైట్‌తో వచ్చేస్తోంది. ఒక నిర్మాతగా చిత్ర నిర్మాణ వ్యయాన్ని అదుపులో ఉంచాలనే చూస్తాను.

★నేను ఏ సినిమా చేయాలన్నా కథ, పాత్ర తీరుతెన్నులు ఎంత కొత్తగా ఉన్నాయనేది ఆలోచిస్తాను. గతంలో చేసిన తరహా చిత్రాలు చేస్తే నటించడాన్ని ఆస్వాదించలేము. తొలిసారి ఎమ్మెల్యేగా నటిస్తున్నా అంటే అది కొత్తగా ఉంది కాబట్టి.




తాప్సీ

నటించే అన్ని పాత్రలకు తమ వ్యక్తిత్వానికి పోలిక ఉండాల్సిన అవసరం లేదంటోంది బాలీ వుడ్ భామ తాప్సీ. దక్షిణాదిలో ఎక్కువగా పేరు తెచ్చుకున్న తాప్సీ....హిందీ తెరకు వెళ్లి అక్కడా విజయపరంపర కొనసాగిస్తోంది. నామ్ షబానా, జుద్వా 2 లాంటి మూడు వరుస విజయాలను అందుకుంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న చిత్రం ముల్క్ విడుదలకు

ఆ సన్నివేశాలు ఇబ్బందే...

సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో తాప్సీ రొమాంటిక్ పాత్రలో నటిస్తోంది. ఈ పాత్రకు చాలా సన్నిహిత సన్నివేశాలు కథలో ఉంటాయట. ఈ విషయంపై తాప్సీని వివరాలు అడగ్గా......ఒక చిత్రంలో సంప్రదాయ నృత్యకారిణి పాత్రలో నటిస్తాను. మరో చిత్రంలో ఇంకో పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్రలకు నా వ్యక్తిగతంగా ఎలాంటి సంబంధం లేదు. అలాగే ముల్క్ చిత్రంలోని క్యారెక్టర్‌కు నాతో ఎలాంటి పోలికలు లేవు. నేను ఆ పాత్ర అంత రొమాంటిక్ కాదు. ఈ పాత్రలో నటించడం నిజంగా ఇబ్బందిపడ్డాను. రొమాంటిక్ సన్నివేశాల్లో ధరించేదుస్తులు, మాట్లాడే మాటలు, స్పందించేవిధానం ఇవన్నీ కెమెరా ముందు చేయాలంటే కష్టమనిపించింది. అని చెప్పింది



రవితేజ సినిమా పేరు
నేల టికెట్

రవితేజ కథానాయకుడిగా ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రానికి నేల టికెట్ పేరు ఖరారు చేశారు. సోగ్గాడే చిన్నినాయన, రారండోడ్ వేడుక చూద్దాం ఫేమ్ కల్యాణ కృష్ణ ఈ చిత్రానికి దర్శకుడు. ఉగాది పండుగ సందర్భంగా తన ట్విట్టర్ ఖాతా ద్వారా హీరో రవితేజ ఫస్ట్‌లుక్ విడుదల చేశారు.

కుటుంబ నేపథ్యంలో, క్లాస్, మాస్ ప్రేక్షకులను అలరించే విధంగా ఈ చిత్రం రూపొందిస్తున్నారు. ఇప్పటికే అరవై శాతం చిత్రీకరణ పూర్తిచేశారు. మే 24న సినిమాను విడుదల చేస్తారు.

రవితేజ సరసన మాళవిక శర్మ నాయికగా నటిస్తోంది. ఇతర పాత్రల్లో జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు, అలీ, పోసాని, అన్నపూర్ణ, ప్రియదర్శి, ప్రభాస్ శీను, సురేఖఆవాణి ఇతర పాత్రధారులు.

ఫిదా ఫేమ్ శక్తికాంక్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రహణం ముఖేష్.



సుశాంత్

పుట్టినరోజు కానుక

సుశాంత్ హీరోగా రూపొందుతున్న చిత్రం చి.ల.సౌ. సిరుని సినీ కార్పొరేషన్ పతాకంపై రాహుల్ రవీంద్రన్ దర్శకుడిగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. జస్వంత్ నడిపల్లి నిర్మిస్తున్నారు. రుహాని శర్మ నాయికగా నటిస్తోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత జస్వంత్ నడిపల్లి మాట్లాడుతూ చిలసౌ ద్వారా నిర్మాతగా పరిశ్రమలోకి రావడం ఆనందంగా ఉంది. ప్రామిసింగ్ ఫిలిమ్‌గా రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మా హీరో సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశాం. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మే 11న సినిమాను విడుదల చేస్తున్నాం అని చెప్పారు. సుశాంత్, రుహాని శర్మ, వెన్నెల కిషోర్, రోహిణి, అనుహాసన్, జయప్రకాష్, విద్యుల్లేఖ తదితరులు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి సంగీతం ప్రశాంత్ ఆర్.విహారి, ఛాయాగ్రహణం ఎం.సుకుమార్.



ఆనందం ఆడియో విడుదల

మలయాళ హిట్ ఫిల్మ్ ఆనందం అదే పేరుతో తెలుగులో అనువాదమవుతోంది. సుఖీభవ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని టాలీవుడ్‌లోకి తీసుకొస్తోంది. గణేష్ రాజ్ దర్శకత్వం వహించారు. ప్రేమమ్ ఫేమ్ నివీన్ పూలే అతిథి పాత్ర పోషించిన ఈ చిత్రంలో మిగతా వారంతా నూతన నటీనటులే. సచిన్ వారియర్ సంగీతాన్ని అందించిన ఆనందం తెలుగు ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు గణేష్ రాజ్ మాట్లాడుతూ...2010 నుంచి కథ రాసుకున్నాను. రెండేళ్ల కిందట మలయాళంలో ఆనందం మంచి విజయం సాధించింది. కళాశాలలో పర్యటనకు వెళ్లిన కొందరు విద్యార్థుల కథే ఈ చిత్రం. అందరికీ చేరువయే అంశంతో తెరకెక్కిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చుతుంది. తెలుగులో వచ్చిన హ్యాపీడేస్ సినిమా నాకు స్ఫూర్తినిచ్చింది. అన్నారు. నిర్మాత ఎ.గురురాజ్ మాట్లాడుతూ... ఆనందంతో థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులు ఆనందంతో తిరిగి వెళతారు. ముఖ్యంగా ద్వితీయార్థం సినిమా కొత్త అనుభూతిని అందిస్తుంది. యువతతో పాటు కుటుంబమంతా ఈ సినిమాను ఆస్వాదిం చవచ్చు. ఆనందం చూస్తున్నవారికి విద్యార్థిగా తమ అనుభవాలు గుర్తొస్తాయి. అన్నారు.ఈ కార్యక్రమంలో నిర్మాత కేఎల్ దామోదరప్రసాద్, హీరో తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్‌గుడ్ కామెడీ అప్పుడు-ఇప్పుడు

సుజన్, తనీష్క జంటగా నటిస్తున్న చిత్రం అప్పుడు - ఇప్పుడు. యుకె. ఫిలింస్ పతాకంపై ఉషా రాణి కనుమూరి, విజయ రాకృష్ణంరాజు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చలపతి పువ్వల దర్శకుడు. శివాజీరాజా, మళ్లీరావా ఫేం పేరుపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఫీల్ గుడ్ కామెడీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సమ్మర్‌లో విడుదల చేస్తారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం కల్యాణ్ సమి, సంగీతం పద్మానావ్ భరద్వాజ్, నిర్మాతలు ఉషారాణి కనుమూరి, విజయ్ రామకృష్ణమ్ రాజు, దర్శకత్వం చలపతి పువ్వల.



సుజన్ తనీష్క

యాత్రకు ముహూర్తం కుదిరింది

విష్ణు మంచు, ప్రజ్ఞ జైస్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం అచారి అమెరికా యాత్ర. జి.నాగేశ్వరరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయనున్నారు. వినోదభరిత కథా చిత్రంగా ఆచారి అమెరికా యాత్రను తెరకెక్కించారు. గతంలో విష్ణు, జి.నాగేశ్వరరెడ్డి కలయికలో దేనికైనా రెడీ, ఈడోరకం ఆడోరకం చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే.

ఈ చిత్రంలో బ్రహ్మానందం మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. పద్మజ పిక్చర్స్ పతాకంపై కీర్తి చౌదరి, కిట్టు నిర్మించిన ఈ చిత్రానికి యమ్.ఎల్. కుమార్ చౌదరి సమర్పకులు.

అమెరికా, మలేషియా, హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రంలో ఇంకా తనికెళ్ళ భరణి, పోసాని, కోట శ్రీనివాసరావు, పృథ్వీ, ప్రవీణ్, విద్యుల్లేఖ, ప్రభాస్ శీను, సురేఖావాణి తదితరులు నటిస్తున్నారు.

కథ మల్లాది వెంకటకృష్ణమూర్తి, ఛాయాగ్రహణం సిద్దార్థ్, సంగీతం తమన్, మాటలు డార్లింగ్ స్వామి.



విష్ణు మంచు

చిరుతేజ్ సింగ్ బాలల చిత్రం



అద్భుత మేధాశక్తితో ప్రపంచ రికార్డులు నెలకొల్పిన గిరిజన బాలిక చిరుతేజ్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా ఓ చిత్రం తెరకెక్కింది. నిర్మాత ఎన్ఎస్. నాయర్ సహాయసహకారాలతో రూపొందించిన ఈ చిత్రానికి డా.ఆనంద్‌కుమార్ దర్శకుడు. ఫ్యాషన్ డిజైనర్ ఫేమ్ మనాలి రాథోడ్, కాటమరాయుడు ఫేమ్ సౌమ్య వేణుగోపాల్ ప్రధాన పాత్రలు పోషించారు. కేవలం మూడు నిమిషాల వ్యవధిలో 236 ప్రపంచ దేశాల పటాలను గుర్తించి, బాల మేధావిగా ఎన్నో పతకాలను, ప్రశంసలను సొంతం చేసుకున్న చిరితేజ్ సింగ్ చిత్రం త్వరలో విడుదలకానుంది. తల్లీకూతురు మధ్య ప్రేమ, టీచర్, స్టూడెంట్ మధ్య ఉన్న అనుబంధం మనసుకు హత్తుకునే విధంగా, మరికొంత మంది చిన్నారులకు ప్రేరణ కలిగించేలా ఉంటుందని దర్శకుడు తెలిపారు. అనాథ పిల్లల కోసం ప్రత్యేక ప్రివ్యూ ప్రదర్శన అన్నపూర్ణ స్టూడియోలో వేశారు. డైరెక్టర్ వీరశంకర్, నిర్మాత రాజ్ కందుకూరి, దర్శకులులు సాగర్ చంద్ర, మధుర శ్రీధర్, సంగీత దర్శకుడు రఘు కుంచె, నటుడు అభిజిత్, నటి సీత నారాయణ్‌తో పాటుగా పలువురు ప్రముఖులు చిత్రాన్ని వీక్షించి ప్రశంసించారు. ఈ చిత్రానికి సంగీతం గీతా పూనిక్, ఛాయాగ్రహణం జై, సమర్పణ స్టార్ మీడియా ఫోకస్.



పూజా రామచంద్రన్

ఎన్నెన్ని వింతలో...

నందు, సౌమ్య వేణుగోపాల్ జంటగా నటిస్తున్న చిత్రం ఇంతలో ఎన్నెన్ని వింతలో. పూజా రామచంద్రన్ కీలక పాత్రలో నటిస్తోంది. హరిహర చలన చిత్రం సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఎస్.శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మాతలు.వరప్రసాద్ వరికూటి దర్శకుడు.

యాజమాన్య సంగీతంలో ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. మా చిత్రాన్ని ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నాం అని నిర్మాత తెలియజేశారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం ఎస్.మురళీ మోహన్‌రెడ్డి, సంగీతం యాజమాన్య.